తాతలనాటి కథలు
రూ॥70/-
పేజీలు:64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

రాజ్యాంగ సభలో సభ్యుడు సోమనాథ్ లాహిరి

రాడికల్ హ్యూమనిజంలోకి ఎంఎన్.రాయ్ ప్రస్థానం

లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 216 | శనివారం | 25-01-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

# 20 లక్షల ఇండ్లు ఇవ్వండి



## కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 కింద తెలంగాణ రాష్ట్రానికి 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశ పట్టణ జనాభాలో 8 శాతం ప్రజలు తెలంగాణలో ఉన్నారని సిఎం తెలియజేశారు. పిఎంఎవై(యు) పట్టణాభివృద్ధి, విద్యుత్ శాఖలపై కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పిఎంఎవై 2.0లో చేరిన తొలి రాష్ట్రమైన తెలంగాణ ఇళ్ల నిర్మాణానికి సమగ్రమైన డాటా, పూర్తి ప్రణాళికతో సన్నద్ధంగా ఉన్నందున రాష్ట్రానికి 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. దేశంలోని మహా నగరాలైన ఢిల్లీ, చెన్నై, బెంగళూరుతో పోల్చితే హైదరాబాద్‌లో మెట్రో కనెక్టవిటీ తక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో మెట్రో ఫేజ్II కింద ఆరు కారిడార్లను గుర్తించామని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్‌కు సిఎం రేవంత్‌రెడ్డి తెలియజేశారు. ఇందులో కారిడార్ 4: నాగోల్–శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), కారిడార్ 5: రాయదుర్గం–కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), కారిడార్6: ఎంజిబిఎస్–చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), కారిడార్7: మియాపూర్–పటాన్‌చెరు (13.4 కి.మీ.), కారిడార్8: ఎల్‌బి నగర్–హయత్ నగర్ (7.1 కి.మీ),

తరువాయి 2లో



## బనకచర్ల ప్రాజెక్టు లేనేలేదు

మాజీమంత్రి హరీశ్‌రావువి పచ్చి అబద్ధాలు

బిఆర్‌ఎస్ హయాంలో నీటి కేటాయింపుల్లో నిర్లక్ష్యం

రాష్ట్రానికి తీరని అన్యాయం : మంత్రి ఉత్తమ్

ప్రజాపక్షం/హైదరాబాద్

నీటి ప్రాజెక్టుల విషయంలో మాజీమంత్రి హరీష్‌రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు బనకచర్ల ప్రాజెక్టు లేనేలేదని, ఆలాంటిది ఆ ప్రాజెక్టు నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 200 టిఎంసి నీటిని ఏలా మళ్లించుకుంటుందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నీళ్ల కోసమే తెలంగాణ ఉద్యమమని గొప్పలు చెప్పిన బిఆర్‌ఎస్ నేతలు అధికారం చేపట్టిన తర్వాత అదే నీటి కేటాయింపుల్లో వారి నిర్లక్ష్యం కారణంగా తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. సచివాలయంలో శుక్రవారం మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ పాలకుల నిర్వాకం వల్లే కృష్ణా నది జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇప్పుడు దానిని కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నం చేస్తుంటే పచ్చి అబ్బద్ధాలతో

తరువాయి 2లో

ఎపి అక్రమ నీటిప్రాజెక్టులను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలి : హరీశ్‌రావు 03

## గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి రూ.55,652 కోట్లు సాయం చేయండి



ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్‌లో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 55,652 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని కేంద్ర విద్యుత్, గృహ నిర్మాణ, పురపాలక వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 65 శాతం భూభాగం అర్బన్ ఏరియా కింద ఉందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ సహా పురపాలికల అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందించాలని కోరారు. హైదరాబాద్ ఐటిసి కాకతీయలో గురువారం అర్బన్ సెక్టార్, పవర్ సెక్టార్‌లపై సంబంధిత ఉన్నతాధికారులతో కేంద్ర విద్యుత్, గృహ నిర్మాణ, పురపాలక వ్యవహారాల మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,

తరువాయి 2లో

## గత పాలనలో గృహనిర్మాణం నిర్లక్ష్యం



మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా గడిచిన పదేళ్ల కాలంలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ డిమాండ్ ఉన్న నేపథ్యంలో 20లక్షల ఇండ్లను మంజూరు చేయాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ ఖట్టర్‌ను కోరారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి మనోహర్ ఖట్టర్‌కు హైదరాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్‌నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో మంత్రి పొంగులేటి శుక్రవారం స్వాగతం పలికారు. అక్కడి నుంచి వారిద్దరూ కలిసి కరీంనగర్‌కు వెళ్లారు. తిరిగి అక్కడి నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. అనంతరం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో మంత్రి పొంగు లేటి గృహనిర్మాణానికి సంబంధించి పలు అంశాలను కేంద్ర మంత్రి మనోహర్ దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వం గృహనిర్మాణాన్ని

తరువాయి 2లో

## కరీంనగర్‌లో బిఆర్‌ఎస్‌కు బిగ్ షాక్

బిజెపిలో చేరనున్న మేయర్ సునీల్ రావు , 11 మంది కార్పొరేటర్లు



ప్రజాపక్షం/కరీంనగర్ : బిఆర్‌ఎస్‌లో బిగ్ షాక్ తగలనుంది. కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్ రావు బిజెపిలో చేరుతున్నట్లు ఊహాగానాలు వెలువడుతున్నాయి. అందుకు అనుగుణంగానే శుక్రవారం కేంద్రం మంత్రి మనోహర్ లాల్ కట్టర్ పర్యటనలో ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్ నీ మేయర్ సునీల్ రావును పొగడ్తలతో ముంచెత్తడం చర్చనీయంగా మారింది. మేయర్ తోపాటు తన

తరువాయి 2లో



## ఆయుధ కర్మాగారంలో భారీ పేలుడు

ఎనిమిది మంది దుర్మరణం, పలువురికి గాయాలు

మహారాష్ట్ర భండారా జిల్లాలో ఘటన

**భండారా :** మహారాష్ట్ర భండారా జిల్లాలోని ఆయుధ కర్మాగారంలో శుక్రవారం భారీ పేలుడు సంభవించింది. ఎనిమిది మంది మృత్యువాత పడినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ప్రాథమిక సమాచారం మేరకు పేలుడులో ఎనిమిది మంది మరణించగా, ఏడుగురు గాయపడ్డారన్నారు. పేలుడు ధాటికి యూనిట్ పైకప్పు కూలిపోయిందని జిల్లా సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సంఘటన స్థలంలో గాలింపు, రక్షణ చర్యలు కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. పేలుడు శబ్దం సుమారు

తరువాయి 2లో

## రాజకీయాలకు వెసిపి నేత విజయసాయిరెడ్డి గుడ్‌బై!

నేడు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా



**అమరావతి :** రాజకీయాలకు వైసీపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి గుడ్‌బై చెప్పారు. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుక్రవారం ఆయన ప్రకటన చేశారు. తన రాజ్యసభ సభ్యత్వానికీ శనివారం రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. విజయసాయిరెడ్డి రాజీనామా వైసీపీకి పెద్ద షాక్‌గా మారింది. విజయసాయిరెడ్డి తన ట్వీట్‌లో... చంద్రబాబు కుటుంబంతో వ్యక్తిగత విభేదాలు లేవని, పవన్ కల్యాణ్‌తో చిరకాల స్నేహం ఉందని పేర్కొన్నారు. రెండు సార్లు రాజ్యసభ అవకాశం ఇచ్చిన

తరువాయి 2లో

## ఎన్‌కౌంటర్ల పేరుతో కమ్యూనిస్టులను అంతంచేసే కుట్ర

బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలి

బిజెపిని హెచ్చరించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో అనేక హామీలను నెరవేర్చలేదు. కాబట్టే ప్రజలు మార్పు కోరుకున్నారు. కాంగ్రెస్‌కు అధికారమిచ్చారు. ఈ మార్పు సరిపోదు. ఇంకా మారాల్సిన అవసరం ఉంది. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలి. – కూనంనేని



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి

దేశంలో బిజెపి ప్రభుత్వం నక్సలైట్ల పేరుతో ఎన్‌కౌంటర్లు చేస్తూ కమ్యూనిస్టులను అంతం చేయాలని చూస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. అది వాళ్ల తరం కాదని, కమ్యూనిస్టు పార్టీకి వందేళ్ల చరిత్ర ఉందని, నక్సలైట్లు తమ సహచర సోదరులేనని అన్నారు. ఏరివేత పేరిట అమాయకులను చంపడం దుర్మార్గమైన చర్య అని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలని డిమాండ్ చేశారు. మతతత్వ రాజకీయాలతో ప్రజలను రెచ్చగొడితే సహించేది లేదని హెచ్చరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో 280 సర్వే నంబర్‌లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న భగత్ సింగ్ కాలనీ రెండవ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. వేడుకల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావులతో కలిసి కూనంనేని పాల్గొన్నారు. భగత్ సింగ్‌కాలనీ అంతటా ఆయన కలియతిరిగారు. గుడిసెలలో నివసిస్తున్న వారిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కూనమనేని సాంబశివరావు మాట్లాడుతూ, ప్రజల పక్షాన నిత్యం పోరాటాలు నిర్వహించి దేశం కోసం ఉరి కంభం ఎక్కేది కమ్యూనిస్టులే అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎర్ర చెరువులో ఉన్న గుడిసెలకు ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన విప్లవ వీరుడు భగత్ సింగ్ పేరు పెట్టడం అభినందనీయమని కొనియాడారు. మంచి పనులు చేస్తున్న ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూనే సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు ధర్నాలు నిర్వహించడమేనని అన్నారు. భగత్ సింగ్ కాలనీకి మౌలిక వసతులు రోడ్లు కరెంటు

తరువాయి 12లో

## సహకరిస్తా..

ఎమ్మెల్యే గండ్ర హామీ

భగత్ సింగ్ కాలనీలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న నిరుపేదలకు సిఎంతో మాట్లాడి పట్టాలు ఇచ్చేందుకు సహకరిస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హామీ ఇచ్చారు. భగత్ సింగ్ కాలనీలో రూ.2 లక్షలతో ఎమ్మెల్యే ఏర్పాటుచేసిన బోరును స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. అనంతరం సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూనంనేని, తాను కలిసి ముఖ్యమంత్రికి భగత్ సింగ్ కాలనీ విషయాలపై చర్చించి భగత్ సింగ్ కాలనీ వాసులకు హక్కు పత్రాలు ఇప్పించే విధంగా తనవంతుగా సహకరిస్తానని తెలిపారు. అంతేకాకుండా ఇందిరమ్మ ఇండ్లలో మొదటి ప్రాధాన్యతను కల్పిస్తామన్నారు.



## నేటి నుంచి సంగారెడ్డిలో సిపిఐ(ఎం) రాష్ట్ర మహాసభలు

ప్రజాపక్షం/హైదరాబాద్



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుండి 28 వరకు జరుగుతున్నాయి. సిపిఐ(ఎం) మహాసభల ప్రారంభం సందర్భంగా మొదటి రోజు 25వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు సంగారెడ్డి ఐబి కార్యాలయం నుంచి పిఎస్‌ఆర్ గ్రౌండ్ వరకు భారీ ప్రదర్శన జరుగుతుంది. అనంతరం 3 గంటలకు పిఎస్‌ఆర్ గ్రౌండ్‌లో బహిరంగ సభ జరుగుతుంది. ఈ సభకు ముఖ్యఅతిథులుగా సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్క రాములు హాజరుకానున్నారు. వారితోపాటు సిపిఐ(ఎం) జాతీయ, రాష్ట్ర నాయకులు ఈ సభలో ప్రసంగిస్తారు. ఈనెల 26 నుంచి 28 వరకు సంగారెడ్డిలోని గోకుల్ గార్డెన్స్‌లో ప్రతినిధుల సభ జరుగుతుంది. మహాసభల కోసం సంగారెడ్డి పట్టణంలో హోర్డింగ్‌లు, ఎర్రజెండాలు, తోరణాలను అలంకరించారు. ఆదివారం నుంచి గోకుల్ గార్డెన్స్‌లో ప్రారంభమయ్యే ప్రతినిధుల సభకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 700 మంది ప్రతినిధులు హాజరవుతారని సిపిఐ(ఎం) ఒక ప్రకటనలో తెలిపింది.

## కిడ్నీ అక్రమ మార్పిడి కేసు సిఐడికి అప్పగింత

వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

తమిళనాడు, కేరళ, కర్నాటక, ఎపి ప్రభుత్వాలకు సమాచారం ఇవ్వాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

అలకనంద హాస్పిటల్‌లోని కిడ్నీ అక్రమ మార్పిడి కేసును సిఐడికి అప్పగించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.ఈ కేసు వ్యవహారమై కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలకు సమాచారం ఇవ్వాలని, గతంలో ఇలాంటి కేసు కేరళలో నమోదైన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో జరిగిన వ్యవహారాలకు, ప్రస్తుత కేసుకు ఏమైనా సంబంధం ఉన్నదా అనే అంశంపై కూడా ఆరా తీయాలని సూచించారు.



హైదరాబాద్‌లోని తన నివాసంలో ‘అలకనంద హాస్పిటల్లో జరిగిన కిడ్నీ అక్రమ మార్పిడి’ వ్యవహారంపై మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మార్పిడి సర్జరీలకు ఎటువంటి అనుమతి లేదని, నిబంధనలకు విరుద్ధంగా

తరువాయి 12లో

## వక్ఫ్ బిల్లు జెపిసి నుంచి 10 మంది విపక్ష సభ్యుల ‘సస్పెన్షన్’

సమావేశానికి ఆటంకం కలిగిస్తున్నారని జగదాంబికాపాల్ ఆగ్రహం



**న్యూఢిల్లీ :** వక్ఫ్ సవరణ బిల్లుపై పార్లమెంటరీ కమిటీ సమావేశానికి హాజరైన 10మది విపక్ష సభ్యులు చైర్మన్ జగదాంబికాపాల్‌పై ఆరోపణలు, నిరసనలకు దిగుతూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించడం నడుమ శుక్రవారంనాడు వారు ఒకరోజు పాటు సస్పెన్షన్‌కు గురయ్యారు. జగదాంబికా పాల్ కార్యకలాపాలను కుదిస్తూ ఒక ప్రహసనంగా మార్చారని విపక్ష సభ్యులు ధ్వజమెత్తారు. ఆయన గవర్నర్ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటున్నారని ఆరోపించారు.ఈ నేపథ్యంలో జగదాంబికాపాల్ స్పందిస్తూ సమావేశానికి అంతరాయం కలిగించాలనే రీతిలో విపక్షసభ్యుల ప్రవర్తన ఉన్నదని నిందించారు. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) పార్టీ నాయకుడు కళ్యాణ్ బెనర్జీ తనపై దూషణలకు దిగారని ఆరోపించిన జగదాంబికాపాల్ మాట్లాడుతూ తాను సమావేశాన్ని అదుపులో ఉంచేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. ఈ క్రమంలో బిజెపి సభ్యుడు నిషికాంత్ దూబే మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయాలన్న

తరువాయి 12లో





# కాలిఫోర్నియా కార్చిచ్చు.. నీటి విధానాలదే తప్ప

సుమారు పది రోజులు కాలిఫోర్నియాను అల్లాడించిన కార్చిచ్చు, కొన్ని ప్రాంతాల్లో తిరిగి తలెత్తడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. కాలిఫోర్నియా అనుసరిస్తున్న నీటి విధానాలే ఈ ముప్పుకు ప్రధాన కారణమని వ్యాఖ్యానించారు. సరైన విధానాలను అనుసరించి ఉంటే, ఇలాంటి ప్రమాదాల సంభావ్యత తక్కువగా ఉండేదని అన్నారు.




# అమెరికాలో జోరందుకున్న జన్మతః పౌరసత్వ వివాదం

## కోర్టు స్టే... అప్పీల్‌కు వెళతామన్న ట్రంప్



**వాషింగ్టన్ :** అమెరికాలో జన్మతః పౌరసత్వంపై వివాదం జోరందుకుంది. దేశంలోకి వలస వచ్చిన వారి సంతానానికి జన్మతః పౌరసత్వం కల్పించే హక్కును రద్దు చేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఆదేశాలను సియాటిల్ ఫెడరల్ కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ స్టే ఆర్డర్‌పై అప్పీల్‌కు వెళతామని ట్రంప్ ప్రకటించారు. దీనితో, ఆటోమేటిక్ సిటిజన్‌షిప్ రద్దుపై నీలినీడలు అలముకున్నాయి. దేశాధ్యక్షుడిగా ప్రమాణం చేసిన తర్వాత ట్రంప్ పలు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్ జారీ చేశారు. ఆ ఒరవడి మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉంది. వలస వచ్చిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే, వారికి ఎలాంటి షరతులు లేకుండా పౌరసత్వాన్ని పొందే హక్కు ఉంది. అయితే, అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి దిగినప్పుడే ట్రంప్ ఈ విషయాన్ని తన ప్రచార సమయంలో పలుమార్లు ప్రస్తావించారు. తాను ఎన్నికైతే, అక్రమ వలసదారులనను దేశం నుంచి పంపేస్తానని, అదేవిధంగా జన్మతః లభించే పౌరసత్వాన్ని రద్దు చేస్తానని కూడా స్పష్టం చేశారు. ఆ మాటలను ఇప్పుడు నిజం చేస్తున్నారు. ఇలావుంటే, ఆటోమేటిక్ సిటిజన్‌షిప్ రద్దుని ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీ వ్యతిరేకిస్తున్నది. ట్రంప్ నిర్ణయాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా అభివర్ణించింది. కాగా, ఆ పార్టీ అధికారంలో ఉన్న వాషింగ్టన్ ఆరిజోనా, ఇల్లినాయిస్, ఓరెగాన్ రాష్ట్రాలు ట్రంప్ నిర్ణయానికి వ్యతిరేకంగా సియాటిల్ ఫెడర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. అమెరికా రాజ్యాంగంలోని 14వ అధికరణకు పూర్తి వ్యతిరేకంగా ట్రంప్ ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నాయి. ఆ ఆదేశాలను కొట్టివేయాలని కోర్టును కోరాయి. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు, ట్రంప్ ఉత్తర్వులపై తాత్కాలికంగా స్టే ఆర్డర్ జారీ చేసింది. అమెరికాలోని 22 రాష్ట్రాల పరిధిలో మొత్తం ఐదు న్యాయ వ్యాజ్యాలు కోర్టులో దాఖలైనందున, వాటిని క్రోడీకరించి కేసును పరిశీలించే అవకాశం ఉంది. ఈ ఐదు వ్యాజ్యాల్లో ఒకదానిపై సియాటిల్ ఫెడర్ కోర్టు స్టే ఆర్డర్ జారీ చేసింది. మరో నాలుగు న్యాయ వ్యాజ్యాలపై వాదనలు జరుగుతున్నాయి.

అమెరికా గణాంకాలను అనుసరించి 2022 సంవత్సరంలో అమెరికా అక్రమంగా నివసిస్తున్న విదేశీ మహిళలకు 2.55లక్షల మంది జన్మించారు. వీరిలో విదేశీ దంపతులకు పుట్టిన వారు 1.53 లక్షలు. అమెరికాలో అంతర్యుద్ధం ముగిసిన తర్వాత, 1868లో రాజ్యాంగ సవరణ జరిగినప్పుడు, అమెరికాలో జన్మించే ప్రతి ఒక్కరికీ పౌరసత్వం దక్కాలని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 33 దేశాల్లో ఇలాంటి చట్టాలు ఉన్నాయి. అయితే, దేశంలో అక్రమంగా ఉంటున్న వలసవాదులను తిప్పి పంపిస్తామని ప్రకటించిన ట్రంప్, జన్మతః పౌరసత్వం వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది.

# శ్రీలంకలో మంత్రుల అలవెన్స్‌లపై కోత



**కొలంబో :** శ్రీలంకలో మంత్రుల అలవెన్స్‌లపై కోత పడింది. వివిధ వర్గాల నుంచి వస్తున్న విమర్శలు, సూచనలను దృష్టిలో ఉంచుకొని అధ్యక్షుడు అరుణ కుమార దిస్సనాయకే జారీ చేసిన ఉత్తర్వుల్లో సపోర్ట్ స్టాఫ్ సంఖ్యను కేబినెట్ మంత్రులకు 15గానూ, సహాయ మంత్రులకు 12గానూ ఖరారు చేశారు. వారి పెట్రోలు అలవెన్స్‌లు, కార్యాలయాలు, నివాస భవనాలు, మొబైల్ ఫోన్లకు చేసే చెల్లింపుల్లోనూ కోత పడింది. ప్రైవేటు సెక్రెటరీ, కోఆర్డినేటింగ్ సెక్రెటరీ, మీడియా సెక్రెటరీ, పబ్లిక్ రిలేషన్స్ సెక్రెటరీగా కుటుంబ సభ్యులు లేదా బంధువులను నియమించుకోరాదని దిస్సనాయకే ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉంది. మాజీ అధ్యక్షుడు మహీంద రాజపక్స భద్రతా సిబ్బందిని 2024 డిసెంబర్ మాసంలో 300 నుంచి 60కి తగ్గించారు. అయితే, ఇప్పటికీ ఆయన ప్రభుత్వ భవనంలోనే ఉంటున్నారు. తాజా ఉత్తర్వుల్లో రాజపక్సే వెంటనే ఆ భవంతిని ఖాళీ చేయక తప్పదని స్పష్టం చేశారు. అత్యంత ఖరీదైన ప్రభుత్వ భవనాన్ని ఆయన ఖాళీ చేయకపోవడం అనేది ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసినట్టే అవుతుందని వ్యాఖ్యానించారు. రాజపక్సేకు ఇస్తున్న పెన్షన్‌లో మూడో వంతు మొత్తాన్ని కొత్తగా తీసుకోబోయే అద్దె ఇంటికి కిరాయిగా ప్రనుత్వం చెల్లిస్తుందని దిస్సనాయకే ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయి. అయితే, రాజపక్సే ప్రాణాలకు ప్రమాదం ఉందని, ఆయనకు భద్రతను తగ్గించడం రాజకీయ కక్షతో కూడుకున్న చర్య అని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. కానీ, దిస్సనాయకే తన నిర్ణయాలను అమలు చేస్తూ ముందుకు వెళుతున్నారు.

# హెగ్సత్‌పై లైంగిక వేధింపుల కేసులో..

## బాధిత మహిళకు 50000 డాలర్ల చెల్లింపు!



**వాషింగ్టన్ :** అమెరికా విదేశాంగ మంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్న పీట్ హెగ్సత్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల్లో కొత్త మలుపు చోటుచేసుకుంది. బాధిత మహిళకు తాను 50000 డాలర్లు చెల్లించినట్టు హెగ్సత్ అంగీకరించాడని సమాచారం. అసోసియేట్ ప్రెస్ (ఎపి) కథనం ప్రకారం, హెగ్సత్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయి. అతిగా మద్యం సేవించి ఘర్షణలకు దిగడం వంటి ఆరోపణలు ఇది వరకు అనేక పర్యాయాలు చర్చనీయాంశమయ్యాయి. మాసచూసెట్స్ డెమోక్రాటిక్ సెనెటర్ ఎలిజబెత్ వారెన్ అడిగిన ఓ ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో హెగ్సత్ ఈ వివరాలను పేర్కొన్నారు. కాలిఫోర్నియాలోని ఓ హోటల్ గదిలో, హెగ్సత్ తనను నిర్బంధించాడని, ఫోన్ కూడా లాక్కొని బయటకు వెళ్లకుండా అడ్డుకున్నాడని ఓ మహిళ 2017లో ఆరోపించింది. ఈ ఆరోపణలపై పోలీసులు విచారణ జరిపి నివేదికను విడుదల చేశారు. అయితే, అతనిపై వచ్చిన ఆరోపణల్లో నిజం ఉందా? లేదా? అనేది వారు ఎక్కడా ప్రస్తావించలేదు. కేసును తదుపరి విచారణ కోసం మాంటెరీ కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయానికి పంపాలని ఆ నివేదిక సిఫార్సు చేసింది. కాగా, కేసును విచారించడానికి అవసరమైన ప్రాథమిక సాక్ష్యాధారాలు ఏవీ లేవని పేర్కొంటూ అటార్నీ జెన్నీన్ ఎం.పాసినీ ప్రకటించింది. దీనితో హెగ్సత్‌పై వచ్చిన కేసుకు తెరపడింది. అయితే, సెనెటల్ ఎలిజబెత్ తోపాటు అలాస్కా సెనెటర్ లీసా ముర్కోవ్‌స్కీ, మైన్ సెనెటర్ సుసాన్ కొలిన్స్ ఈ ప్రస్తావనను తీసుకురావడంతో, కేసు మళ్లీ తెరపైకి వచ్చింది. ఎలిజబెత్ డెమోక్రాటిక్ పార్టీకి చెందిన సెనెటర్‌కాగా, మిగతా ఇద్దరూ అధికార రిపబ్లికన్ పార్టీ సభ్యులేకావడం గమనార్హం. ఇలావుంటే, హెగ్సత్ మాత్రం తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

# ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా నియామకానికి..

## 30న కాష్ పటేల్ చివరి హియరింగ్

**వాషింగ్టన్ :** అమెరికా నిఘా సంస్థ 'ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్' (ఎఫ్‌బిఐ) డైరెక్టర్‌గా భారత సంతతికి చెందిన కాష్ పటేల్ (44) నియామకం ఖాయమైంది. లాంఛనప్రాయమైన చివరి హియరింగ్ ఈనెల 30న జరగనుంది. 'ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా కశ్యప్ ప్రమోద్ పటేల్ నామినేషన్‌పై తుది హియరింగ్ జనవరి 30న జరుగుతుంది' అని సెనేట్ జ్యుడిషియరీ కమిటీ ప్రకటించింది. భారత సంతతికి చెందిన ఒక వ్యక్తి ఇలాంటి కీలక పదవిని అలంకరించడం ఇదే మొదటిసారి. క్రిస్టోఫర్ వే స్థానంలో కాష్ పటేల్ బాధ్యతలు స్వీకరిస్తారు.

# షాంఘైలో భారత కాన్సులేట్ జనరల్‌గా మాథర్ బాధ్యతల స్వీకరణ

**బీజింగ్ :** షాంఘైలో భారత కాన్సులేట్ జనరల్‌గా ప్రతీక్ మాథర్ బాధ్యతలు స్వీకరించారు. భారత కాన్సులేట్ కార్యాయం ప్రకటనను అనుసరించి, డాక్టర్ ఎన్.నందకుమార్ స్థానాన్ని మాథుర్ భర్తీ చేస్తారు. ఇండియన్ పారిన్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) 2007 బ్యాచ్‌కి చెందిన మాథుర్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కార్యాలయ డిప్యూటి సెక్రెటరీగా 2019 ఆగస్టు నుంచి 2020 సెప్టెంబర్ వరకూ విధులు నిర్వహించారు.

ఆ తర్వాత న్యూయార్క్‌లో, ఐక్యరాజ్య సమితికి భారత బృందంలో సభ్యుడిగా 2024 డిసెంబర్ వరకూ సేవలు అందించారు.

# విజయసాయిరెడ్డి గుడ్‌బై

(మొదటి పేజీ తరువాయి)

జగన్‌కు కతజ్ఞతలు తెలిపారు. 'రాజకీయాల నుంచి తప్పుకుంటున్నాను. రాజ్యసభ సభ్యత్వానికి రేపు 25న రాజీనామా చేస్తున్నాను. నేను ఏ రాజకీయపార్టీలోను చేరడం లేదు. వేరే పదవులో, ప్రయోజనాలో లేక డబ్బులో ఆశించి రాజీనామా చేయడం లేదు' అని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ నిర్ణయం పూర్తిగా తన వ్యక్తిగతమని, ఎలాంటి ఒత్తిళ్లు లేవని, ఎవరూ ప్రభావితం చేయలేదని తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా, మూడు తరాలుగా తనను నమ్మి ఆదరించిన వైఎస్ కుటుంబానికి రుణపడి ఉన్నానని వివరించారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చిన జగన్‌కు, తనను ఇంతటి ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన భారతికి సదా కతజ్ఞుడినని, జగన్‌కు మంచి జరగాలని కోరుకుంటున్నాని పేర్కొన్నారు. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా, రాజ్యసభలో ఫ్లోర్ లీడర్‌గా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కషి చేశానన్నారు. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వారధిలా పనిచేశానని విజయసాయిరెడ్డి వివరించారు. దాదాపు తొమ్మిది సంవత్సరాలు ప్రోత్సహించి కొండంత బలాన్ని, మనోధైర్యాన్నిచ్చి తెలుగురాష్ట్రాల్లో తనకు గుర్తింపునిచ్చిన ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 'నా భవిష్యత్తు వ్యవసాయం. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఆదరించిన నా రాష్ట్ర ప్రజలకు, మిత్రులకు, సహచరులకు, పార్టీ కార్యకర్తలకు పేరు పేరునా నా హదయపూర్వక కతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను' అని విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు. వైసీపీలో టాప్‌లీడర్‌గా ఉన్న విజయసాయిరెడ్డి అకస్మాత్తుగా రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

**రాజ్యసభలో ఏడుకు తగ్గిన వైసిపి బలం**

విజయసాయిరెడ్డి రాజీనామాతో రాజ్యసభలో వైసిపికి బలం తగ్గుతోంది. 2024 ఎన్నికల సమయంలో వైసీపీకి 11 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. ఇటీవలే వైసీపీ సభ్యత్వానికి, రాజ్యసభకు ముగ్గురు రాజీనామా చేశారు. ఆర్.కష్ణయ్య, మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు తమ పదవులు వదులుకున్నారు. ఇప్పుడు రాజీనామా బాటలో విజయసాయి రెడ్డి ఉన్నారు. దీంతో వైసీపీ బలం ఏడుకు పడిపోతుంది. అయోధ్య రామిరెడ్డి కూడా రాజీనామా చేస్తారంటూ ప్రచారం జరుగుతోంది. ఆయన కూడా రాజీనామా చేస్తే వైసీపీ సంఖ్య ఆరుకే పరిమితమవుతుంది. వాళ్లిద్దరు రాజీనామా చేస్తే కూటమి పార్టీలకే రాజ్యసభ సీట్లు దక్కనున్నాయి.

# భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

ఐదు కిలోమీటర్ల దూరం వరకు వినిపించినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఘటన ప్రదేశంలో దట్టమైన పొగ అలముకుంది. కాగా, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ 13 నుండి 14 మంది కార్మికులు సంఘటన స్థలంలో చిక్కుకున్నారని చెప్పారు. జవహర్ నగర్ ప్రాంతంలో ఉన్న ఆయుధ కర్మాగారంలోని ఎల్‌టిపి విభాగంలో ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పేలుడు సంభవించింది. సంఘటన జరిగిన సమయంలో యూనిట్‌లో 13 నుండి 14 మంది పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ సంజయ్ కోల్టే తెలిపారు. క్షతగాత్రుల్లో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. ఆరుగురు వ్యక్తులను వెలుపలికి తీసుకువచ్చారని, వారిలో ఒకరు మరణించారని, ఇతరులకు ఒక ఆసుపత్రిలో చికిత్స జరుగుతోందని, ఇద్దరు వ్యక్తులను రక్షించినట్లు జిల్లా అధికారులు తెలియజేశారు. 'భండారా జవహర్ నగర్ ఆర్డ్‌నన్స్ ఫ్యాక్టరీలో విస్ఫోటం అనంతరం అగ్నిమాపక శకటాలను. అంబులెన్స్‌లను పంపించారు. రక్షణ, సహాయ కార్యక్రమాలు ప్రస్తుతం సాగుతున్నాయి. ఒక పైకప్పు కూలిపోయింది. దానిని జెసిబి సాయంతో తొలగిస్తున్నారు' అని జిల్లా అధికారి ఒకరు 'ఎఎన్ఐ' వార్తా సంస్థతో చెప్పారు. పలు అంబులెన్స్‌లు, అగ్నిమాపక శకటాలను ఆ ప్రదేశానికి హుటాహుటిని తరలించడమైంది. అగ్నిమాపక దళ సిబ్బంది, పోలీస్ అధికారులు, ల్యాండ రెవెన్యూ అధికారి, ఇతర పాలనయంత్రాంగం అధికారులు పేలుడు ప్రదేశానికి చేరుకున్నారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డిఆర్ఎఫ్)ను కూడా పంపారు.

# రూ.55,652 కోట్లు సాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఎం.పి. ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో పురపాలక శాఖ, హైదరాబాద్ అభివృద్ధిపై నిర్మించిన షార్ట్ ఫిల్మ్‌ను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ తిలకించారు.

**ప్రాజెక్టుల వారిగా పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించిన సిఎం రేవంత్ రెడ్డి..**

గ్రేటర్ హైదరాబాద్ సహా తెలంగాణలో పురపాలికల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతిపాదిత ప్రాజెక్టులను పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా కేంద్ర మంత్రికి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ వివరించారు. తెలంగాణను లక్ష కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన అర్బన్ మొబిలిటీ (హెచ్ సిటీ, ఎలివేటెడ్ కారిడార్స్, మెట్రో కనెక్టివిటీ, ఈస్ట్ వెస్ట్ కారిడార్, ట్రిబుల్ ఆర్, గ్రీన్ ఫీల్డ్, రేడియల్ రోడ్స్,) మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, అర్బన్ ఇన్‌ఫ్రాస్టక్చర్, సివిక్ సర్వీసెస్ ( సరస్సుల పునరుజ్జీవనం, వాటర్ సెక్యూరిటీ సిటీ), భూ భారతి చట్టం మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ప్లాన్ 2050, బిల్డ్ నౌ, టౌన్షిప్ గ్రోత్ సెంటర్స్, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. మెట్రో రైల్ ఫేజ్ 2కు రూ.24,269 కోట్లు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు రూ.10 వేల కోట్లు, తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా కోసం ఉద్దేశించిన సివరేజీ మాస్టర్ ప్లాన్‌కు రూ.17,212 కోట్లు, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్లాన్‌కు రూ.4,170 కోట్ల ఆర్థిక సహాయం చేయాలని సిఎం కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. అటల్ మిషన్ ఫర్ రెజ్యూవే నేషన్ అండ్ అర్బన్ ట్రాన్స ఫర్మేషన్, అమృత్, అర్బన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్, స్వచ్ఛభారత్ మిషన్ 2.0, స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్, స్మార్ట్ సిటీ మిషన్, పిఎం స్వానిధి కేంద్ర సౌజన్య పథకాల ప్రగతిని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. పెండింగ్ పనుల పూర్తికి నిధులను మంజూరు చేయాలని కోరారు.

**తెలంగాణ అభివృద్ధికి సహకారం అందిస్తాం : మనోహర్ లాల్ కట్టర్**

కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ మాట్లాడుతూ సమావేశంలో సిఎం, ఉన్నతాధికారులు తన దృష్టికి తీసుకువచ్చిన అన్ని అంశాలను కూలంకషంగా పరిశీలించి, తెలంగాణ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తానని తెలిపారు. ఎం.పి. ఈటల రాజేందర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో అంతకంతకు పెరుగుతున్న జనాభా దృష్ట్యా ట్రాఫిక్ నిర్వహణ క్లిష్టతరంగా మారిందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని మెట్రో రైల్ విస్తరణకు సహకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా నార్త్ తెలంగాణను అనుసంధానం చేసే మేడ్చల్, శామిర్‌పేట మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్‌లకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. గ్రేటర్‌లో చెరువుల పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని కేంద్రమంత్రికి రాజేందర్ తెలిపారు. చెరువుల్లో కలిసే మురుగు నీరుని డైవర్టు చేసేందుకు కేంద్రం సహకారం అందించాలన్నారు. హైదరాబాద్‌లో అర్బన్ హౌసింగ్‌కు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గత పాలనలో గృహనిర్మాణం నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, హౌసింగ్ విభాగాన్ని నిర్వీర్యం చేసి, ఇందులో పనిచేసే ఉద్యోగులను ఇతర శాఖలలో సర్దుబాటు చేసిందని వివరించారు. తమ ప్రభుత్వం పేదల ఇంటి నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, వచ్చే నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకోసం గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించి, అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నామని పొంగులేటి తెలిపారు. ఇటీవల తాము నిర్వహించిన సర్వే ప్రకారం రాష్ట్రంలో అర్హత పొందిన ఇల్లు లేని వ్యక్తులు సుమారు 44 లక్షల వరకు ఉన్నారన్నారు. లబ్ధిదారుల అర్హత, జియో ట్యాగింగ్, వారి ప్రస్తుత నివాసం వంటి విషయాలను డాక్యుమెంటేషన్ కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించామని, ఇంటింటి సర్వే నిర్వహించామని, 360 డిగ్రీ టూల్‌తో డెస్క్ వెరిఫికేషన్ జరిగిందని, తుది జాబితా రూపకల్పన కోసం గ్రామ సభలను నిర్వహించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో వేగవంతమైన పట్టణీకరణ జరుగుతుందని, 26 జిల్లాలలోని 6867 గ్రామాలను ఇటీవల యూడిఏ కిందికి తీసుకొచ్చామని, వీటిని కేంద్ర ప్రభుత్వ పోర్టల్ లో చేర్చాలని కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేజ్ 1 ప్రకారం దేశ వ్యాప్తంగా రెండు కోట్ల ఇండ్లు మంజూరవ్వగా, తెలంగాణకు 1.58 లక్షల ఇండ్లు మాత్రమే మంజూరయ్యాయని, ఇది మొత్తం మంజూరులో 0.79 శాతం అని వివరించారు. దేశ పట్టణ జనాభాలో తెలంగాణ 8 శాతం ఉన్నదని, ఈ నేపథ్యంలో రాష్ట్రం మరో 24 లక్షల ఇండ్లను పొందేందుకు అర్హత కలిగి ఉన్నదని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం (2.0) కింద కనీసం 20 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ఇండ్లు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

**కారిడార్ – 9:** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఫోర్త్ సిటీ (స్కిల్స్ యూనివర్సిటీ) (40 కి.మీ.) ఉన్నాయని, ఇందులో మొదటి అయిదు కారిడార్లకు సంబంధించి (76.4 కి.మీ.) డిపిఆర్‌లు పూర్తయ్యాయని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 కోట్లు వ్యయమవుతుందని, డిపిఆర్‌లు ఆమోదించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యం (జెవి) కింద చేపట్టి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు.

**మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు రూ.10వేల కోట్లు ఇవ్వండి**

మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు చేయూతనివ్వాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీలో మురుగు చేరకుండా నదికి ఇరువైపులా 55 కి.మీ. (మొత్తంగా 110 కి.మీ.) కాలువలు, బాక్స్ డ్రెయిన్లు, ఎస్‌టిపిల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. ఇందు కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు సమీపంలోని 27 పట్టణ పాలక సంస్థల పరిధిలో మురుగు నీటి నెట్‌వర్క్ నిర్మాణానికి రూ.17,212 కోట్లతో సమగ్ర మురుగునీటి మేజర్‌ప్లాన్ (సిఎస్ఎంపి) తయారు చేశామని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. అమృత్ 2.0 లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా సిఎస్ఎంపిని గుర్తించి నిధులు సమకూర్చాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రెండో పెద్ద నగరమైన వరంగల్ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను నోటిఫై చేసిందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సిఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. వరంగల్ నగరంలో రూ.41,70 కోట్లతో సమగ్ర భూగర్భ నీటి పారుదల (యుజిడి) పథకాన్ని చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కేంద్రమంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు.

**పిఎం కుసుమ్ కింద లక్ష సౌర పంపులు కేటాయించండి**

తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన రైతులకు నిరంతరం సాగు నీరు అందించేందుకు వీలుగా పిఎం కుసుమ్ కింద లక్ష సౌర పంపులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి కుసుమ్ –సి ఎఫ్ఎల్ఎస్ కాంపొనెంట్ కింద 2,500 మెగావాట్లను కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. విద్యుత్ సరఫరా, నెట్‌వర్క్ బలోపేతానికి రూ.488 కోట్ల అంచనా వ్యయంతో 9 ప్రాజెక్టు నివేదికలను కేంద్రానికి సమర్పించామని, వాటిని వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సిఎం, డిప్యూటీ సీఎం కోరారు. రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ స్కీమ్ (ఆర్‌డిఎస్ఎస్)లో తెలంగాణ డిస్కమ్‌లను చేర్చాలని వారు కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విద్యుత్ సంస్థలకు విద్యుత్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పిఎఫ్‌సి), గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ (ఆర్‌ఈసి) ఇచ్చిన రుణాలకు సంబంధించిన వడ్డీ రేట్లను తగ్గించాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కొత్త పునరుత్పత్తి విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి రెండు సంవత్సరాలకు పైగా సమయం పడుతుందని, అందువల్ల ఆర్‌పిపిఓ లక్ష్యాలను చేరుకోలేకపోయినందుకు విధించే జరిమానాలు మాఫీ చేయాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. పునరుత్పత్తి విద్యుత్ నిర్వహణ కేంద్రాల అప్‌గ్రేడేషన్‌కు అవసరమయ్యే నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. సమీక్షలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్, ప్రజాసంబంధాలు) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాస రాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి అభినందనలు**

తెలంగాణ రాష్ట్రానికి రూ.1.78 లక్షల కోట్లు పెట్టుబడుల ప్రతిపాదనలు సాధించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అభినందనలు తెలిపారు. ప్రధానమంత్రి దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలంటున్నారని, అందులో తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి తెలిపారు.

# లేనేలేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలను మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని మంత్రి అగ్రహం వ్యక్తం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు అంశంలో తమ ప్రభుత్వం చాలా అప్రమత్తంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేవలం ప్రతిపాదనను మాత్రమే చేసిందని, ఇందుకు సంబంధించి, కేంద్ర ఆర్థిక మంత్రితో పాటు జలవనరుల శాఖ మంత్రులకు లేఖలు పంపిందన్నారు. దీంతో ఈ రెండు మంత్రిత్వ శాఖలు కృష్ణా, గోదావరి నదీ జలాల బోర్డులకు లేఖలు రాయగా, అధికారికంగా మనకు ఎలాంటి సమాచారం లేకపోయినా తమ దృష్టికి రాగానే అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఇద్దరు కేంద్ర మంత్రులకు లేఖలు రాశామని మంత్రి వివరించారు. కృష్ణా నది జలాల కేటాయింపుల అంశానికి సంబంధించి ప్రాజెక్టు ఆధారంగా బోర్డు నీటిని కేటాయించలేదని, ఇరు రాష్ట్రాలకు కలిపి మొత్తంగా 811టిఎంసిల నీటిని కేటాయించిందని చెప్పారు. ఇందులో 70 శాతం నది పరివాహక ప్రాంతంగా ఉన్న తెలంగాణ ఈ మేరకు నీటి కేటాయింపులు ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని, దీనిని కృష్ణ నది జలాల బోర్డుకు ఇప్పటికే స్పష్టం చేశామని ఉత్తంకుమార్ రెడ్డి చెప్పారు. అదే బిఆర్ఎస్ ప్రభుత్వం 811 టిఎంసిల నీటిలో అపెక్స్ కమిటీ సమావేశానికి హాజరైనా అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా తెలంగాణకు కేవలం 299 టిఎంసిలు చాలు అంటూ ఒప్పుకోవడంతో ఆంధ్రకు 512 టిఎంసిలు కేటాయింపులు జరిగాయని చెప్పారు. అంతేకాకుండా రాయలసీమ ఎత్తి పొత్తల ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి బిఆర్ఎస్ ప్రభుత్వం లోపాయికారిగా సహకరించిందని మంత్రి ఆరోపించారు. 2020 అగస్టు 5న అపెక్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయగా, అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం దానిని అదే నెల 28వ తేదీ తర్వాత ఏర్పాటు చేయాలని కోరిందన్నారు. ఎందుకంటే రాయలసీమ ప్రాజెక్టు టెండర్లకు 2020 అగస్టు 10 చివరి తేదీ కావడం, ఈ ప్రక్రియకు పూర్తయితే వారికి అదో ఆధారంగా అయ్యేందుకు పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. అందులో భాగంగానే హైదరాబాద్ ప్రగతిభవన్‌లో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో ఆలయ్ బలయ్ చేసుకున్నారన్నారు. లక్ష కోట్లు అప్పు తెచ్చి నిర్మించిన కాళేశ్వరం వారి హాయంలో పనికిరాకుండా పోయిందని, ఇంత కంటే దుర్మార్గం మరేదైనా ఉంటుందా అని ఆయన అన్నారు.

# బిఆర్ఎస్‌కు బిగ్ షాక్

(మొదటి పేజీ తరువాయి)

అనుచరగనమైన 11 మంది కార్పొరేటర్లతో రేపో మాపో బిజెపిలో చేరుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. గత కొంతకాలంగా ఊహించినట్లుగానే మేయర్ సునీల్ రావు బిజెపిలో చేరడంపై దాదాపు ఖరారు అయినట్లే స్పష్టమవుతుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిమంత్రి బండి సంజయ్‌తో సానుహిత్యంగా మెదలడం, ఆయనను విమర్శించిన వ్యక్తి పదేపదే మెచ్చుకోవడం అందుకు బలం చేకూరింది. ఈ క్రమంలో టిఆర్ఎస్ లోని కార్పొరేటర్లు మేయర్ సునీల్ రావు బిజెపిలో చేరుతుండడాన్ని స్పష్టం చేస్తున్నారు. కాగా బిఆర్ఎస్‌లో గతంలోనే కొందరు కార్పొరేటర్లు కాంగ్రెస్లో చేరగా తాజాగా మరికొందరు బిజెపిలో చేరుతుండడంతో బిఆర్ఎస్ పార్టీకి గడ్డుకాలం ఎదురుకానుంది.

# తెలంగాణలో కోటా కంటే ఎక్కువ ఇండ్లు

## పెచ్చులూడిన అంగన్‌వాడీ భవనం పైకప్పు

### గాయపడిన అంగన్‌వాడీ చిన్నారులను పరామర్శ జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు





**ప్రజాపక్షం / సంగారెడ్డి ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించే భవనం పైకప్పు పెచ్చులూడి పడడంతో అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న ఐదుగురు చిన్నారులు గాయాల పాలయ్యారు. వీరిని వెంటనే అధికారులు నారాయణ ఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారు. విషయం తెలిసిన కలెక్టర్ క్రాంతి వల్లూరు నారాయణ ఖేడ్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించారు. చిన్నారులకు చిన్న గాయాలయ్యాయని వారికి మెరుగైన చికిత్స అందించడం జరిగిందని తెలిపారు. ముగ్గురిని డిశ్చార్జ్ చేయడం జరుగుతుందని ,మిగతా ఇద్దరిని అబ్జర్వేషన్‌లో పెట్టి డిశ్చార్జ్ చేయడం జరుగుతుందని తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులతో కలెక్టర్ మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితి బాగుందని ధైర్యం చెప్పారు. ఈ సంఘటనపై విచారణకు ఆదేశించడం జరిగింది. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ,బి.డబ్ల్యుఓ వసంతకుమారి , ఆర్డీఓ అశోక్, చక్రవర్తి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### కరీంనగర్ డంప్ యార్డును ఎత్తివేస్తాం

### విద్యుత్ విషయంలో తెలంగాణకు సాయం

### కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** దేశంలోనే తెలంగాణ సుసంపన్నమైన రాష్ట్రమని, అందులో కరీంనగర్ అంటేనే ధైర్యమని, ఎన్నో పోరాటాలకు, నిత్య చైతన్యాలకు.. ఎందరో త్యాగాలకు పురిటిగడ్డ ఈ కరీంనగర్ నేల అని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ అన్నారు. కరీంనగర్ స్మార్ట్ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో భాగంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్, రాష్ట్ర పట్టణభాభివృద్ధి శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి అంబేద్కర్ స్టేడియం కాంప్లెక్స్, మల్టీపర్పస్ స్కూల్ పార్కు, కరీంనగర్‌లో 24 గంటల మంచినీటి సరఫరా పథకం, హౌజింగ్ బోర్డు కాలనీలో స్మార్ట్ స్కూల్ ఆఫ్ హైస్కూల్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌కు ఆధ్యాత్మికమైన విశిష్ట చరిత్ర ఉందంటూ వివరించి కొనియాడారు. కరీంనగర్‌లోని ఐదు డివిజన్లలో 2600 ఇళ్లల్లో 24 గంటల పాటు నిరంతరాయంగా తాగునీటిని సరఫరా అందించడం అనేది చారిత్రాత్మక విజయమన్నారు. జల్ జీవన్ మిషన్ కింద దేశవ్యాప్తంగా 12 కోట్ల ఇండ్లకు నల్లా కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. తెలంగాణలో 38 లక్షల 30 వేల ఇండ్లకు నల్లా కనెక్షన్లు అందించామన్నారు. కానీ కొందరు మిషన్ భగీరథ పేరుతో తమ ఘనతేనని బిఆర్‌ఎస్ ప్రచారం చేసుకుందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద ఐదు డివిజన్లలో 4055 ఇళ్లకు 24 గంటల పాటు తాగునీటిని అందించాలనే ఆశయం నెరవేర్చడానికి అంకురార్పణ చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రారంభంలో భాగంగా 2200 ఇళ్లకు 24 గంటల పాటు తాగునీటిని ప్రారంభించామన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ స్మార్ట్ సిటీ నిధులను సమగ్రంగా వినియోగించుకుని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గత పదేళ్లలో పది లక్షల కోట్లకు పైగా నిధులను తెలంగాణ అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలలో అనేక మంది లబ్ధిపొందుతున్నారన్నారు. గత పదేళ్లలో పిఎం ఆవాస్ యోజన కింద 2 కోట్ల 68 లక్షల ఇండ్లు, పిఎం అర్బన్ ఆవాస్ యోజన కింద 90 లక్షల ఇండ్లు కలిపి మొత్తం 3 కోట్ల 58 లక్షల ఇండ్లను నిర్మించామన్నారు. రాబోయే ఐదేళ్లలో పిఎం ఆవాస్ యోజన పథకం కింద దేశంలో మరో 3 కోట్ల ఇండ్లను నిర్మించాలని ప్రధాని మోడీ నిర్ణయించారన్నారు. ఈ యేడాది కోటి ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో తెలంగాణకు రావాల్సిన వాటా కంటే అధికంగా ఇండ్లు మంజూరు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. కరీంనగర్ ప్రజలను తీవ్రంగా వేధిస్తున్న డంప్ యార్డు సమస్యను పరిష్కరిస్తామన్నారు. అందుకోసం ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. విద్యుత్ మంత్రిగా ఈ రాష్ట్రంలో ఎటువంటి విద్యుత్ సమస్యను రానివ్వనని పేర్కొన్నారు.

### మా ఖమ్మంలో ఎప్పుడూ కొట్లాటలే: పొంగులేటి వ్యాఖ్యలు

కరీంనగర్‌లోని హౌజింగ్ బోర్డులో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం అనంతరం కేంద్ర మంత్రులు కట్టర్, బండిసంజయ్ కుమార్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఒక వేదిక దగ్గరకు చేరుకున్నారు. ఈ వేదికపై నుంచే కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పొన్నం ప్రభాకర్‌తో ఎలాంటి విభేదాలు లేవు.. మేం అంతా ఒక్కటే.. కరీంనగర్ అభివృద్ధికి కలిసి పని చేస్తాం.. జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి రాజకీయాలకతీతంగా కలిసి పనిచేస్తామన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ వీరంతా కలిసి ఉండడం చూసి ఆశర్యపోతున్నానని పేర్కొంటూ మా ఖమ్మంలో ఎప్పుడూ కొట్లాటలే.. ఇలా ఎప్పుడు ఉంటుందా? అని అనుకుంటున్నా.. అనడంతో సభలో నవ్వులు పూయించడమే కాకుండా ఆసక్తికరమైన చర్చకు తెరలేపాయి. అంతకు ముందుకు పోలీసులపైనా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫైర్ అయ్యారు. పదే పదే తోసివేయడంతో అధికారుల తీరుపై మండిపడ్డారు. ఎస్పీ ఎక్కడ అంటూ సీరియస్ అయ్యారు. మూసీ నది ప్రక్షాళనకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని, హైదరాబాద్‌లో మెట్రో విస్తరణకు కేంద్రం చేయూతనందించాలని ఆయన కోరారు.

**కరీంనగర్ జిల్లాను నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం: పొన్నం ప్రభాకర్**

రాజకీయాలకతీతంగా కరీంనగర్ జిల్లా అభివృద్ధిలో నెంబర్ వన్ ఉండేందుకు అందరూ సహకరించాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కరీంనగర్ డంప్ యార్డు సమస్య పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీగా ఎంపికైనప్పటికీ గతంలో నిధులు మంజూరు కాలేదన్నారు. 2019 తర్వాత బండి సంజయ్ సహకారంతో రూ.400 కోట్లు నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా స్మార్ట్ సిటీ కోసం రూ.396 కోట్ల నిధులను విడుదల చేసిందని చెప్పారు. కరీంనగర్ నగరం నుంచి డంప్ యార్డు తరలించాలని, కరీంనగర్‌ను వేధిస్తున్న డంప్ యార్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర మంత్రిని పొన్నం కోరారు.

## సిఎండి మొదలు ఎస్‌సిల వరకూ

# క్షేత్రస్థాయికి వెళ్ళండి

### వేసవిలో విద్యుత్ సరఫరా ప్రణాళికలపై అవగాహన

### విద్యుత్ అధికారులకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశం



**ప్రజాపక్షం / హైదరాబాద్:** రానున్న వేసవిలో నిరాటంకంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సిఎండిలు మొదలుకుని ఎస్‌సి స్థాయి అధికారులు వెంటనే రాష్ట్రవ్యాప్తంగా క్షేత్ర పర్యటనలు చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. వేసవి ప్రణాళికపై క్షేత్రస్థాయిలో విస్తృత సమావేశాలను ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 4 వరకు నిర్వహించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. ప్రజాభవన్‌లో శుక్రవారం సంబంధిత అధికారులతో డిప్యూటీ సిఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా రాష్ట్రంలోని ట్రాన్స్‌కో, ఎన్‌పిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ అధికారులు, సిబ్బంది కార్యాచరణ ప్రారంభించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో, వేసవి విద్యుత్ ప్రణాళిక అమలుపై సమీక్ష, అవగాహన సమావేశాలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశాల్లో అధికారులు, సిబ్బందితోపాటు రైతులు, వినియోగదారులు, మీడియా ప్రతిధులను భాగస్వాములను చేయాలని కోరారు. గత వేసవిలో ఎదురైన ఇబ్బందులు వాటిని దృష్టిలో పెట్టుకుని సమర్థవంతంగా విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సమావేశంలో వివరించాలని ఆదేశించారు. అదే సందర్భంలో రైతులు, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, సలహాలు స్వీకరించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 4 వరకు వేసవి ప్రణాళికపై క్షేత్రస్థాయిలో విస్తృత సమావేశాలు నిర్వహించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. జనవరి 27న నోడల్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు సంబంధించి షెడ్యూల్‌ను వెల్లడించి విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జనవరి 29న నోడల్ అధికారులు ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో కలిసి జిల్లా, సబ్ డివిజన్ స్థాయిలో వేసవి కార్యాచరణపై సమీక్ష సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ఫిబ్రవరి 4న ఎస్‌సిలు డివిజన్ స్థాయిలో పూర్తి సిబ్బందితో కలిసి సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించాలని, ఈ సమావేశంలో సబ్‌స్టేషన్‌లలో ఓవర్ లోడ్ ఫీడర్లు, డిటిఆర్‌లలో గత మూడు సంవత్సరాలుగా ఎదురవుతున్న సమస్యలు, వాటిని ఎలా ఎదుర్కోబోతున్నారో క్షేత్రస్థాయి సమావేశాల్లో వివరించాలని అధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తూ నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడం వంటి అంశాలను ఈ సమావేశాల్లో చర్చించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ అలీ, ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లికంటి పార్వతమ్మకు ఘనంగా నివాళి



**ప్రజాపక్షం/ మునుగోడు:** సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తల్లి నెల్లికంటి పార్వతమ్మ దశదినకర్మ శుక్రవారం మండలంలోని ఎలాగల గూడం స్వగ్రామంలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి జగదీష్ రెడ్డితోపాటు పలువురు పార్వతమ్మ చిత్రపటానికి పువ్వులమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నర్సింహ, బాలనర్సింహ, కె.శంకర్, విఎస్ బోస్, కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, మర్రి వెంకట స్వామి, మంద పవన్, రవీంద్ర చారి, నాయకులు ఛాయాదేవి, కలకొండ కాంతయ్య, ముత్యాల యాది రెడ్డి, సాయిలు గౌడ్, అంజయ్యనాయక్, కె.శ్రీనివాస్, టి వెంకటేశ్వర్లు, పోటు కళావతి, ఉస్తెల సృజన, పుట్ట లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, ఉజ్జిని రత్నాకర్ రావు, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బొల్లురి నర్సింహా, టి.వెంకటేశ్వర్లు, ఆర్.అంజచారి, గురిజ రామచంద్రం, నలపరాజు రామలింగయ్యతోపాటు మండల కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు. అదేవిధంగా మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, గీతా కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, చెరుకు సుధాకర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఇంజనీరింగ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాం ప్రసాద్ రెడ్డి, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, మండల కార్యదర్శి చాపల శ్రీను, మందుల పాండు, సూరిగి చలపతి, ఈధుల కంటి కైలాష్, చాపల విప్లవ్, తదితరులు నివాళులర్పించారు.



## ఎన్‌హెచ్‌ఎం ఆల్ డిఇఒలకు కనీస వేతనం రూ.22,750 చెల్లించాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ హెల్త్ మిషన్ పని చేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఆల్ డాటా ఎంట్రీ ఆపరేటర్స్ (డీ.ఈ.ఓ) సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించడంతో పాటు 60 జిఓ ప్రకారం రూ.22, 750 వేతనాలు చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర అధ్యక్షులు ఎం.నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ హెల్త్ మిషన్‌లో పని చేయుచున్న కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ డీ.ఈ.ఓ. కనీస వేతనాలు అమలు చేయకుండా శ్రమ దోపిడీకి గురి చేయుచున్నారని విమర్శించారు. వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో సరిపడా నిధులు ఉన్నప్పటికీ కార్మికుల జీతాలు పెంచేందుకు మాత్రం అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. గత రెండు ఏళ్ల నుంచి డీ.ఈ.ఓ.అతి తక్కువ జీతాలతో కేవలం రూ. 15వేలచెల్లిస్తున్నారని, ప్రభుత్వం విడుదల చేసిన ఔట్ సోర్సింగ్ జీవో 60 ప్రకారం ఆల్ డీఈఓలకు రూ.22750లను చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారులు ఈ సమస్యలపై తగిన చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని, లేకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సారంగుల బాలసుబ్రమణ్యం, రాఘవేంద్ర, వెంకటేష్, ప్రవీణ్, మహేష్, అనిత, సౌమిత్రి, మురళి, రాజశేఖర్, ప్రవీణ, రామకృష్ణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 12,459 దరఖాస్తులు

### ఇందులో 10,188 ఇందిరమ్మ ఇండ్లు...



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 12,459 దరఖాస్తులు అందాయి. ఇందులో సింహభాగం 10,188 ఇందిరమ్మ ఇండ్ల కోసమే దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 252, విద్యుత్ శాఖకు సంబంధించి 110, రెవెన్యూపరమైన సమస్యలకు సంబంధించి 51, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 5, ఇతర శాఖలకు సంబంధించి 85 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్. జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి అధికారి దివ్య దరఖాస్తులను స్వీకరించారు.

## దావోస్ నుంచి రాష్ట్రానికి సిఎం బృందం





**ప్రజాపక్షం / హైదరాబాద్:** స్విట్జర్‌లాండ్‌లోని దావోస్‌లో మూడు రోజుల పాటు జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ‘తెలంగాణ రైజింగ్’ ప్రతినిధి బృందం తన పర్యటనను ముగించుకుని శుక్రవారం ఉదయం హైదరాబాద్ చేరుకుంది. శంషాబాద్ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందానికి ఎమ్మెల్యేలు, ఎంపిలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఉన్నతాధికారులతో కూడిన బృందం వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు, సభలు, సమావేశాలలో పాల్గొన్నది. ‘తెలంగాణ రైజింగ్’ బృందం దావోస్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని తెలంగాణ రాష్ట్రానికి రికార్డుస్థాయిలో మొత్తం రూ.1,78,950 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలను తీసుకువచ్చినట్లు ముఖ్యమంత్రి వెల్లడించింది. ఇదిలా ఉండగా ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె.కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రేమ్‌సాగర్ రావు దావోస్ నుంచి హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలియజేశారు.



## ఆంధ్రప్రదేశ్ అక్రమ నీటి ప్రాజెక్టులను అడ్డుకునేందుకు చర్యలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నీటి వాటాను సాధించుకునేందుకు, అక్రమ ప్రాజెక్టులను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కళ్లు తెరిచి, యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కోరారు. తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమయం, సందర్భం వచ్చినప్పుడు రాజకీయాలు పక్కన పెట్టి, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలని, ఇతర రాష్ట్రాలను చూసి నేర్చుకోవాలని, రాజకీయాల కన్నా తమకు రాష్ట్ర ప్రయోజనాలు, రాష్ట్ర హక్కులే ముఖ్యమన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ తుంగభద్ర నీళ్లను తరలించేందుకు కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కాల్వలు తవ్వుకుంటున్నాయని మండిపడ్డారు. కల్వకుర్తి, డిండి ఎత్తిపోతలు, సాగర్ ఆయకట్టు నీళ్లు అందక దెబ్బతినే ప్రమాదం ఉన్నదని, ఇంత జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. రెండు రాష్ట్రాల మధ్య నదీ పరీవాహక ప్రాంతాల ప్రకారం నీళ్లు సాధించుకోవాలని, కేంద్రానికి, అన్ని ఫోరమ్స్‌కు లేఖలు రాయాలని, అవసరమైతే ఉన్నత న్యాయస్థానంలో పోరాడి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎపి అక్రమంగా కడుతున్న రాయలసీమ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టులపైన సుప్రీంకోర్టులో తప్పుడు వాదనలు వినిపించినందుకు ఆదిత్యనాథ్ దాస్‌కు 3 నెలల జైలు శిక్ష విధించిందని, ఎపి ప్రయోజనాల కోసం పనిచేసిన ఇటువంటి అధికారిని సలహాదారుగా పెట్టుకున్నారని, తెలంగాణ ప్రయోజనాలకు గండికొట్టి, తెలంగాణ హక్కులను కాలరాసే అధికారి ఎవరి కోసం పని చేస్తరని ప్రశ్నించారు. గోదావరి నదీ జలాలను పెద్ద ఎత్తున తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రయత్నిస్తోందని, తుంగభద్ర నదిపై ఎపి, కర్నాటక రాష్ట్రాలు కొత్త ప్రాజెక్టులను నిర్మించి పెద్ద ఎత్తున నీళ్లు తరలించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయని, ఎపి ప్రభుత్వం ఇప్పటికే పోలవరం రైట్ కెనాల్‌ను మూడింతలు పెంచిందని మండిపడ్డారు.

## ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా యుజిసి నూతన నిబంధనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్న యుజిసి నూతన నిబంధనల ప్రతిపాదనలను తిరస్కరిస్తూ తెలంగాణ రాష్ట్ర శాసనసభ తీర్మానం చేయాలని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. యుజిసి ముసాయిదా రాష్ట్రాల హక్కులను హరించేలా ఉన్నాయని, తక్షణమే ఆ ప్రతిపాదనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. యుజిసి కొత్త నిబంధనలపై అనేక రాష్ట్రాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ యుజిసి నిబంధనలకు వ్యతిరేకంగా ఇప్పటికే తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేసిందని, ఫెడరల్ స్ఫూర్తిని మంట గలుపుతున్నారని తమిళనాడు సిఎం స్టాలిన్ కేంద్రప్రభుత్వంపైన మండిపడ్డారని, కేరళ సిఎం కూడా యుజిసి ప్రతిపాదనలను వ్యతిరేకించారని గుర్తుచేశారు. ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షమైనప్పటికీ జెడియుకు బిహార్ సిఎం నితీష్ కుమార్ యుజిసి ప్రతిపాదనలు వ్యతిరేకించారని, కానీ యుజిసి ప్రతిపాదనలపైన తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, ఎపి సిఎం చంద్రబాబు ఇంకా స్పం దించలేదని వినోద్‌కుమార్ అన్నారు. యుజిసి ప్రతిపాదనలపైన యుజిసి చైర్మన్ జగదీశ్ కుమార్‌కు బిఆర్‌ఎస్ తరపున తమ అభిప్రాయాలను పంపించామని వివరించారు. నూతన నిబంధనల ప్రకారం విసిలను నియమించే అధికారం గవర్నర్‌కు కట్టబెట్టడం అప్రజాస్వామికమని, నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టాలా?, విసిలను మాత్రం కేంద్రం నియమిస్తుం దా?, ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని వినోద్‌కుమార్ అన్నారు. ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించిన నిబంధనలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తమ ఇష్టమైన వారిని బోధనానుభవం లేకపోయినప్పటికీ నియమించే అధికారం కేంద్రానికి ఉంటుందని చెప్పారు. త్వరలో కేంద్ర విద్యా శాఖ మంత్రి దేవేంద్ర ప్రధాన్‌ను కలిసి యుజిసి ముసాయిదాపై బిఆర్‌ఎస్ తరపున తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులకు సంబంధించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతి పత్రం అందజేస్తామని, సిద్ధిపేట, సిరిసిల్ల, వేములవాడలో పెండింగ్ జాతీయ రహదారులపై చర్చిస్తామని వినోద్ కుమార్ తెలిపారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

**NIT No. 29/GHMC/MPT/EE/2024-25**

**పని పేరు:** ఇతర పని. **అంచనా విలువ / ఇసివి:** రూ.7.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 25.01.2025న ఉ.10.30గం.ల నుండి 01.02.2025న ఉ.10.40గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్‌ఎంసి, మూసాపేట్ సర్కిల్-23, సెల్: 9849906745. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్‌ఎంసి, మూసాపేట్ డివిజన్-23.**

**DIPR R.O. No. : 9605-PP/CL/ADVT/1/2024-25, Date: 24-01-2025**

**డాక్యుమెంట్స్ పోయినది**

నేను అనగా **మంద సైదయ్య, తండ్రి: జంగయ్య** నివాసం: కామేపల్లి గ్రామం, గుండ్లపల్లి మండలం, నల్లగొండ జిల్లా. నా యొక్క **లింక్ ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 559/2008.** కామేపల్లి నుండి డిండికి ఆర్టీసీ బస్సులో తేది: 23.01.2025న ప్రయాణిస్తుండగా ముత్యాల సంగీత భర్త రమేష్ రెడ్డి పేరు మీదున్న ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ మార్గ మధ్యలో పోయినది. ఎవరికైనా దొరికేతే ఫోన్ నంబర్ 9912674458కు కాల్ చేసి తెలియజేయగలరు.

ఇట్లు

**మంద సైదయ్య, తండ్రి: జంగయ్య**

కామేపల్లి గ్రామం,

గుండ్లపల్లి మండలం, నల్లగొండ జిల్లా.

Cell: 9912674458.

ప్రజాపక్షం

శనివారం, జనవరి 25

# ఆర్థిక వ్యవస్థలో సవాళ్లు

ఓ వారం రోజుల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి యూనియన్ బడ్జెట్ పార్లమెంటు ముందుకు రానుంది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో ఆర్థికమంత్రిత్వ శాఖ పండితుల బడ్జెట్ తయారీ కసరత్తు పూర్తయి ఉంటుంది. కేంద్ర బడ్జెట్‌లు సమర్పించటంలో శ్రీమతి నిర్మలా సీతారామన్ రికార్డులు నెలకొల్పవచ్చుగాని ప్రజలకు రివార్డులేమీ ఉండవు. ఎందుకంటే, కోవిడ్ 19 అనంతరం ఆర్థిక వ్యవస్థ వృద్ధి సాధించటం గూర్చి ఎన్ని గొప్పలు చెప్పుకున్నా వాస్తవ పరిస్థితి నిరాశాజనకంగా ఉంది. ప్రభుత్వం 2025 జనవరి 8న విడుదల చేసిన గణాంక సమాచారం ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు గడచిన నాలుగేళ్లలోకెల్లా తక్కువ స్థాయికి – 6.4 శాతానికి పడిపోయింది. వస్తూత్పత్తి (మాన్యుఫాక్చరింగ్), సేవల రంగాల్లో పనితీరు నెమ్మదించటం ఇందుకు ప్రధాన కారణం. దేశాన్ని అంతర్జాతీయ మాన్యుఫాక్చరింగ్ కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎన్ని కలలుగంటున్నా, మేక్ ఇన్ ఇండియా పేరుతో మాన్యుఫాక్చరింగ్ రంగంలోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఆశించిన ఫలితాలు రావటం లేదు. ఈ రంగంలో అగ్రగామిగా ఉన్న చైనాలోనే మందగమనం ఆందోళన కలిగిస్తోంది. ఇందుకు ముఖ్యకారణం వినిమయం తగ్గుదల – దానికి కారణం ప్రజల ఆదాయాలు తగ్గుదల. సంఖ్యల్లో వేతనాలు పెరిగినా ద్రవ్యోల్బణం వల్ల నిజవిలువ తగిరిపోవటం. మరోవైపున విద్య, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరగటంతో జేబులకు చిల్లులు పెద్దవి అవుతున్నాయి.

> అంబానీ, అదానీ లాంటి కొద్దిమంది పెట్టుబడిదారుల చేతిలో సంపద, పెట్టుబడి పెద్ద ఎత్తున పోగుపడుతున్నది. రెండోవైపున, జాతీయ ఆర్థిక వ్యవస్థకు పెద్దగా దోహదం చేసే, ఉపాధులు సృష్టించే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు లోతైన సంక్షోభంలో ఉన్నాయి, నాశనం అవుతున్నాయి.

ఇవి మన దేశంలో కార్పొరేట్ పెట్టుబడిదారీ వ్యవస్థలో పెరుగుతున్న సంక్షోభానికి సంకేతాలు. అంబానీ, అదానీ లాంటి కొద్దిమంది పెట్టుబడిదారుల చేతిలో సంపద, పెట్టుబడి పెద్ద ఎత్తున పోగుపడుతున్నది. రెండోవైపున, జాతీయ ఆర్థిక వ్యవస్థకు పెద్దగా దోహదం చేసే, ఉపాధులు సృష్టించే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు లోతైన సంక్షోభంలో ఉన్నాయి, నాశనం అవుతున్నాయి. పారిశ్రామిక పెట్టుబడికి బదులు ద్రవ్యపెట్టుబడికి క్రీడా మైదానంగా మన దేశాన్ని పాలకులు అనుమతించటమే మూలం. బ్యాంకింగ్, పారిశ్రామిక పెట్టుబడి విలీనాన్ని అనుమతించటంవల్ల ఈ పరిస్థితి ఆవిర్భవించింది. పెట్టుబడి సాంప్రదాయక లక్షణం వస్తువులను ఉత్పత్తి చేసి మార్కెట్‌కు పంపటం. అది ఉపాధులు సృష్టిస్తుంది. కాని ద్రవ్యపెట్టుబడి అనేది డబ్బు డబ్బును సంపాదిస్తుంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గి, నిరుద్యోగం, అసమానతలు పెరుగుతూ ఉంటే స్టాక్ మార్కెట్లు వేగంగా ఎగబ్రాకటమే ఇందుకు సాక్ష్యం.

2024–25 సంవత్సరానికి జాతీయ ఆదాయంపై జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎస్ఒ) విడుదల చేసిన ముందస్తు అంచనాలు 2024 డిసెంబర్‌లో రిజర్వు బ్యాంక్ అంచనా వేసిన 6.4 శాతం కన్నా తక్కువగా ఉంది. ఆర్థిక మంత్రిత్వశాఖ ఆరంభ అంచనా 6.5 –7శాతం. ఈ అడ్వాన్స్ అంచనాలు ప్రాతిపదికగా యూనియన్ బడ్జెట్‌కు రూపకల్పన చేస్తారు. 2024–25 తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) 6.7శాతంగా నమోదైన ఆర్థిక వృద్ధి రెండవ త్రైమాసికంలో 5.4శాతానికి తగ్గింది. ఇది అంతకుమునుపు 7త్రైమాసికాలలో కెల్లా తక్కువ. కీలకమైన మాన్యుఫాక్చరింగ్ రంగం ఉత్పత్తిలో వృద్ధిరేటు గత సంవత్సరంలోని 9.9శాతం నుంచి 5.3 శాతానికి క్షీణిస్తుందని అంచనా వేయబడుతున్నది. వ్యవసాయరంగం మాత్రం గత సంవత్సరం వృద్ధిరేటు 1.4 శాతం నుంచి 3.8శాతానికి వృద్ధి చెందుతుందని అంచనా. 2024 –25 ఆర్థిక సంవత్సరంలో జిడిపి వృద్ధిరేటు 6.4 శాతంగా ఎన్ఎస్ఒ అడ్వాన్స్ అంచనాలు తెలుపుతున్నాయి.

ద్రవ్యోల్బణం, అధిక ధరలు, నిరుద్యోగం పెరుగుదలను అరికట్టటం, ప్రజల ఆదాయాలు పెంపుచేసి వినిమయాన్ని, పొదుపును పెంచటం, పేదలకు ఆదాయ మద్దతు, ఉపాధి హామీని పట్టణ పేదలకు విస్తరించటంతోపాటు వేతనాల పెంపుదల, జిఎస్టీ, ఆదాయపు పన్ను ఉపశమనలు, కార్పొరేట్ పన్నుల పెంపుదల తక్షణావసరాలు.

వందేళ్ల సిపిఐ

# రాజ్యాంగ సభ సభ్యుడు సోమనాథ్ లాహిరి

సోమనాథ్ లాహిరి 1909 సెప్టెంబర్ 1న బెంగాల్‌లో జన్మించారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన రాజ్యాంగ నిర్ణాయక సభ (కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీ)లో కమ్యూనిస్టు సభ్యునిగా ప్రసిద్ధుడు. బెంగాల్‌లో 19వ శతాబ్దంలో ప్రసిద్ధ యువజన నాయకుడు, మేధావి. రాంతును లాహిరి కుటుంబానికి చెందినవాడు లాహిరి. ఈశ్వర చంద్ర విద్యాసాగర్‌కు సమకాలీనుడు.

సోమనాథ్ ప్రెసిడెన్సీ కాలేజి, కలకత్తా నుంచి కెమిస్ట్రీలో బి.ఎస్‌సి (హానర్స్) పూర్తి చేశారు. అసాధారణ ప్రతిభ కనబరిచారు. సహాయ నిరాకరణోద్యమం, ఖిలాఫత్ ఉద్యమాలు ఆయన్ను ప్రభావితం చేశాయి. 1930 దశకంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తదుపరి స్వామి వివేకానంద తమ్ముడు భూపేంద్రనాథ్‌దత్‌తో పరిచయం ఏర్పడింది. అతను మార్క్సిస్టు. సోమనాథ్ ఎంఎస్‌సి చదువు మధ్యలో మానివేసి 1930లో కాంగ్రెస్‌లో చేరారు. 1931లో అబ్దుల్ మొమిన్‌తోపాటు కరాచీ కాంగ్రెస్‌లో పాల్గొన్నారు. అక్కడ ఆయన, భగత్సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల ఉరితీతకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

మీరట్ కుట్రకేసు (1929–33)లో 32 మంది కమ్యూనిస్టు నాయకుల అరెస్టుతో కమ్యూనిస్టు ఉద్యమంలో నిర్మాణ శూన్యం ఏర్పడింది. బయటనున్న కామ్రేడ్స్ దాన్ని పరిష్కరించే ప్రయత్నం చేశారు. కలకత్తా కమిటీ ఏర్పడింది. అఖిల్ బెనర్జీ, రణేన్ సేన్, అబనీ చౌధురి, రమేన్ బసుతోపాటు సోమనాథ్ లాహిరి, అబ్దుల్ హలీమ్ అందులో సభ్యులు. పిసి జోషి, డాక్టర్ అధికారి తదితరులు నిర్వహించిన సిపిఐ ప్రత్యేక అండర్‌గ్రౌండ్ (రహస్య) సమావేశానికి సోమనాథ్, అబ్దుల్ హలీమ్, రణేన్ సేన్ హాజరైనారు. వారిని కేంద్ర కమిటీ (సిసి)లోకి తీసుకున్నారు. సోమనాథ్ 1935లో బొంబాయిలోని పార్టీ కేంద్రానికి చేరుకున్నారు. ఎస్.ఎస్. మిరాజ్‌కర్ అరెస్టు తదుపరి కొద్దికాలంపాటు సిపిఐ ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు. 1947 వరకు సిపిఐ సిసి సభ్యునిగా కొనసాగారు. అప్పుడు పోలిట్ బ్యూరో సభ్యుడైనారు.

సోమనాథ్‌ను 1936లో బొంబాయిలో కార్మికుల వాడలో పోలీసులు అరెస్టు చేసి లాహోర్‌లో నిర్బంధ చర్యలకు పేరుపొందిన క్విలా జైల్లో తేజాసింగ్ స్వతంత్ర, దర్శన్‌సింగ్ కెనడియన్‌లతోపాటు ఉంచారు. సోమనాథ్ విడుదలైన తర్వాత 1939లో మళ్లీ అరెస్టు చేశారు.

**కాంగ్రెస్‌లో:** బంకింముఖర్జీ, ముజఫర్ అహ్మద్‌లతోపాటు సోమనాథ్ లాహిరి 1938లో ఎఐసిసి సభ్యునిగా ఎన్నుకోబడ్డారు. కాంగ్రెస్ లోపల ఏర్పడిన వామపక్ష పటిష్టీకరణ కమిటీ సభ్యునిగా కూడా ఉన్నారు. 1938 కాలంలో బెంగాల్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సభ్యునిగా ఉన్నారు.

గాంధీజీకి మద్దతుగా 1944లో నిర్వహించబడిన ఒక పెద్ద బహిరంగసభలో, నిరాహార దీక్ష చేపట్టవలదని ఆయన గాంధీజీకి విజ్ఞప్తి చేశారు. **పిసి జోషి గాంధీజీని 'జాతిపిత'గా పిలవకముందే సోమనాథ్ గాంధీజీని 'మన పిత, మన గురువు' అని పిలిచారు.** సోమనాథ్ లాహిరి, బంకిం ముఖర్జీ సలహాలు ఎంతో విలువైనవిగా ఉండేవి. అందువల్ల నాయకులు ఎల్లప్పుడూ సానుకూలంగా స్వీకరించేవారు. సుభాష్ చంద్రబోస్ కూడా వారి సూచనలను ఆమోదించేవారు.

1944లో ఒకసారి కలకత్తాలోని యూనివర్శిటీ ఇన్‌స్టిట్యూట్ హాలులో విద్యార్థుల సభలో ప్రసంగించబోయిన సోమనాథ్‌ను విద్యార్థులు చప్పట్లు చరిస్తూ గేలిచేశారు. సిపిఐ 'ప్రజా యుద్ధం' (పీపుల్స్ వార్) పంథాను వివరించటానికి ఆయన వెళ్లారు. అప్పుడు సోమనాథ్ మైక్ వద్దకు వెళ్లి ఇంగ్లీషు కవి పిబి షెల్లీ పేరు విన్నారా అని సభికులను ప్రశ్నించారు. వారిని ఆశ్చర్యం ముంచెత్తింది. షెల్లీ కవితలను, ఇంగ్లీషు కవిత్వంలో భావకవిత్వ కాలానికి మార్క్సిస్టు భాష్యాన్ని ఆయన బెంగాలీలో వివరిస్తుంటే ప్రేక్షకులు ఎంతో నిశ్శబ్దంగా విన్నారు. నలభై నిముషాల ప్రసంగం తర్వాత, సిపిఐ పంథాను వివరించటానికి సభికుల అనుమతి కోరారు. ఆయన ప్రసంగాన్ని వారు శ్రద్ధతో విన్నారు.

**అజ్ఞాత జీవితం :** 1940లో కమ్యూనిస్టులను పెద్ద సంఖ్యలో అరెస్టు చేశారు. సోమనాథ్‌ను, ఇంకా అనేకమందిని వారి ప్రాంతాలనుంచి బహిష్కరించారు. ఆయన రెండు సంవత్సరాలు అజ్ఞాత జీవితంలోకి వెళ్లారు. బయటకు వచ్చాక 1943లో కలకత్తా కార్పొరేషన్ లేబర్ సీటు నుంచి పోటీ చేసి ఘన విజయం సాధించారు. ప్రత్యర్థికి రెండు వేల ఓట్లు రాగా ఆయనకు 10వేల ఓట్లు లభించాయి.

1944లో కలకత్తా మున్సిపల్ కార్మికుల చరిత్రాత్మక సమ్మెకు నాయకత్వం వహించారు. జూట్ కార్మికుల్లో 15 సంవత్సరాలకు పైగా పనిచేశారు.

మహమ్మద్ ఇస్మాయిల్, చాతుర్ అలీ తదితరులతో కలిసి బెంగాల్ బెస్ట్ యూనియన్‌ను, ట్రాం వర్కర్స్ యూనియన్‌ను నిర్మించారు. బెంగాల్‌లో ఏకైక కార్మిక పత్రిక 'స్వాధీనత'కు సంపాదకత్వం వహించారు. రాజకీయవేత్త, జర్నలిస్టు అయిన సోమనాథ్ లాహిరి నిశిత పరిశీలకుడు. ఈ రోజు ఘటనల ముఖ్య స్వభావం ఏమిటని ఆయన ఒకసారి నిఖిల్ చక్రవర్తిని అడగ్గా, ప్రజలు పోలీసు కాల్పులకు భయపడి పరుగులెత్తకుండా వాటివైపు దూసుకెళుతున్నారని నిఖిల్ రిపోర్టు చేశారు. సోమనాథ్ నిర్ధారణ ఇలా వుంది. అదీ సంగతి. ప్రజలు ఇంకెంత మాత్రం భయపడటం లేదు; ఈ తిరుగుబాటు స్వభావాన్ని సరిగ్గా రిపోర్టు చెయ్యాలి.

**రాజ్యాంగ సభకు:** సోమనాథ్ లాహిరి 1946లో రాజ్యాంగ నిర్ణాయక సభకు ఎన్నికైన ఏకైక కమ్యూనిస్టు. ఆ బ్రిటీష్ వారి రోజుల్లో ఓటు హక్కు చాలా పరిమితంగా ఉండేది. ఆస్తిని పరిగణనలోకి తీసుకుని కేవలం 13శాతం మందినే ఓటు చేయటానికి అనుమతించారు. కమ్యూనిస్టులు గెలుపొందటం దాదాపు అసాధ్యం. అనేక కఠిన




పోరాటాల తర్వాత ఏర్పాటైన కార్మిక నియోజక వర్గాలు ఒక్కటే ఉపశమనం. సోమనాథ్ కలకత్తా మరియు సబర్బన్ నియోజకవర్గం నుంచి ఎన్నికైనారు. ఎన్నికల ప్రచార కాలంలో ఆయన ఇంటిపై గూండాలు దాడి చేశారు. సిపిఐ ఈ ఎన్నికల్లో బెంగాల్ నుంచి మరో ఆర్గురు అభ్యర్థులను నిలబెట్టింది.

రాజ్యాంగ నిర్ణాయక సభ 1946లో తొలి భారత ప్రభుత్వాన్ని, ప్రధానిగా తాత్కాలిక ప్రభుత్వాన్ని ఎన్నుకుంది. చర్చల తర్వాత 1949లో భారత రాజ్యాంగాన్ని తయారు చేసింది. సోమనాథ్ లాహిరి చాలా చురుగ్గా ఆ చర్చల్లో పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్ణాయక సభ ముందుగా తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని, సార్వజనీన ఓటు హక్కు ప్రాతిపదికపై అది తాజా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేసిన తొలి వ్యక్తి సోమనాథ్ లాహిరి. అయితే సభాధ్యక్షుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ తీర్మానం సరైన రీతిలో లేదని ప్రకటించారు. మంత్రులు, అధికారుల వేతనాలు తగ్గించి, దిగువ స్థాయి సిబ్బంది వేతనాలు పెంచాలని ప్రతిపాదించి సోమనాథ్ అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఆ ప్రతిపాదనలు తిరస్కరణకు గురైనాయి.

**సెడిషన్ :** సెడిషన్ (రాజద్రోహం)పై సర్దార్ పటేల్ అభిప్రాయాలను సోమనాథ్ వ్యతిరేకిస్తూ, దాన్ని బ్రిటిష్ దృక్పథం కొనసాగింపు అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకమైన ప్రతిదీ రాజద్రోహం కాజాలదు. ఇంగ్లాండ్ మరింత స్వేచ్ఛ కలిగి ఉంది. పటేల్ అభిప్రాయాన్ని ఆమోదిస్తే ప్రతి ఒక్క ప్రగతిశీల, సోషలిస్టు అభిప్రాయం అణచివేయబడుతుంది.

రాజ్యాంగ నిర్ణాయక సభ స్టీరింగ్ కమిటీలోని 11సీట్లకు సోమనాథ్ లాహిరి, లక్ష్మీ నారాయణ స్వామి సహా 13పేర్లు వచ్చాయి.



రాజ్యాంగ సభకు ఎన్నికైన ఏకైక కమ్యూనిస్టు సోమనాథ్ లాహిరి. బ్రిటీష్ కాలంలో ఓటు హక్కు చాలా పరిమితంగా ఉండేది. ఆస్తిని పరిగణనలోకి తీసుకుని కేవలం 13శాతం మందినే ఓటు వేయడానికి అనుమతించారు. కమ్యూనిస్టులు గెలుపొందటం దాదాపు అసాధ్యం. అనేక కఠిన పోరాటాల తర్వాత ఏర్పాటైన కార్మిక నియోజక వర్గాలు ఒక్కటే ఉపశమనం. సోమనాథ్ కలకత్తా మరియు సబర్బన్ నియోజకవర్గం నుంచి ఎన్నికైనారు.

వీరిద్దరు తమ పేర్లు ఉపసంహరించుకున్నారు. ప్రభుత్వానికి సంబంధించి సామాన్య ప్రజలకు మరిన్ని హక్కులు సోమనాథ్ డిమాండ్ చేశారు. నెహ్రూని 'ప్రజల గొంతుక'గా అభివర్ణించి, అందుకనుగుణంగా ఆయన వ్యవహరించాలన్నారు.

**స్వాతంత్ర్యానంతర కార్యకలాపాలు:** భారత స్వాతంత్ర్య సాధనను సిపిఐ ఆహ్వానించింది. అయితే త్వరలోనే బిటి రణదివె పంథాను పార్టీ చేబట్టింది. ఆ పంథా అది నిజమైన స్వాతంత్ర్యం కాదని నిరాకరించింది; విప్లవానికి పిలుపు ఇచ్చింది.బిటిఆర్, డాక్టర్ అధికారి, భవానీ సేన్, ఎన్.కె.కృష్ణన్‌లతో పాటు సోమనాథ్ లాహిరి పోలిట్ బ్యూరోలో ఉన్నారు. దానివల్ల సంభవించిన వినాశనాలను పార్టీ త్వరలోనే గ్రహించింది, తిరిగి సరైన పంథాలోకి వచ్చింది. నాయకత్వ మార్పు జరిగింది. సోమనాథ్‌ను కూడా తొలగించారు. ఉత్తరోత్తర సంవత్సరాల్లో ఆయన భారతదేశ పరిస్థితి గూర్చి ఆరోగ్యకరమైన, వాస్తవికమైన విశ్లేషణను ఆచరించారు. పార్టీ దేశ రాజకీయాల ప్రధాన స్రవంతిలోకి రావటానికి కూడా ఆయన సహాయపడ్డారు.

సోమనాథ్ 1948లోనే గాంధీజీ హత్యను ఖండిస్తూ, నేను సంతాపం తెలియజేయటం లేదు, ఆగ్రహిస్తున్నాను అన్నారు.

**శాసనసభ్యునిగా:** సోమనాథ్ లాహిరి 1961లో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికైనారు. 1977 వరకు అన్ని ఎన్నికల్లో విజేత అయినారు. 1967 రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 1973లో పబ్లిక్ అక్కౌంట్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైనారు. 1961, 1964, 1968లో సిపిఐ జాతీయ సమితికి ఎన్నుకోబడ్డారు. 1970వ దశకంలో 'న్యూ ఏజ్' పత్రికకు రెగ్యులర్‌గా రాస్తుండేవారు. బహిరంగ సభలతోపాటు మార్క్సిజంపై, ఇతర సెమినార్‌లలో పాల్గొంటూ ఉండేవారు.

సోమనాథ్ లాహిరి 1984 అక్టోబర్ 19న కన్నుమూశారు.

## రిటైర్డ్ బొగ్గు ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి

లేఖ

బొగ్గు గనులలో దాదాపు 30 నుండి 40 సం.లు అహర్నిశలు చెమట రక్తం ధారపోసి దేశ ప్రగతికోసం పరిశ్రమలకు ఇంధనం, విద్యుత్ శక్తికి బొగ్గును అందిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల పట్ల చాలా ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారు. ఫలితంగా చాలీచాలని పెన్షన్‌తో రోజు గడవడమే ఒక మహాభాగ్యంగా ఉంటున్నది. పెన్షన్ పెంచమని ప్రార్థిస్తుంటే నిధులు సరిపోవటం లేదని చెప్పడం పుండుమీద కారం చల్లినట్లు ఉంటుంది. 1998లో పెన్షన్ స్కీం మొదలైనప్పటి నుండి లక్షలమంది కార్మికుల జీతాల నుండి పెన్షన్ ఫండ్ నిధులు ఏర్పడుతూనే ఉన్నాయి, ఈ పెన్షన్ నిధులు సరిపోవడంలేదని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కోట్లాది రూపాయలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయా బొగ్గు కంపెనీల నుండి లాభాలు అందిస్తున్నారు. ప్రస్తుతం నిల్వ ఉన్న నిధులు 2031 సంవత్సరం వరకు పెన్షన్ చెల్లించుటకు మాత్రమే సరిపోతా యని గత రెండు సంవత్సరాలుగా కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చిస్తూ పెన్షన్ కొనసాగించుటకు నిధులు ఆయా బొగ్గు కంపెనీల బాధ్యతగా సమకూర్చాలని తెలుపుతున్నారు. కానీ ఇంతవరకు ఒక నిర్ణయం జరగడం లేదు. ఫలితంగా రిటైర్డ్ ఉద్యోగులకు ఎండమావి వలె నిరాశే ఎదురవుతున్నది. పెన్షన్ పెంపుదల చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా దాదాపు 100కు పైగా పార్లమెంట్ సభ్యులకు, కేంద్ర మంత్రులకు ముఖ్యంగా బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి దేశవ్యాప్తంగా ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు పలుచోట్ల విజ్ఞాపన పత్రాలు అందజేస్తున్నా ఫలితం కల్పించడం లేదు. దేశంలో బొగ్గు ప్రాంతాల పార్లమెంట్ సభ్యులు రిటైర్డ్ ఉద్యోగుల దీనస్థితిని దృష్టిలో ఉంచుకొని వచ్చే పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో పెన్షన్ పెంచుటకు ఒక నిర్ణయం తీసుకోవాలని అచేతన స్థితిలో ఉన్న మేము వేడుకొనుచున్నాము. మేము ఓటు హక్కు ఉన్న భారతీయులమే అని తెలుపుతున్నాము.

దండంరాజు రాంచందర్ రావు

# రాడికల్ హ్యూమనిజంలోకి ఎంఎన్.రాయ్ ప్రస్థానం

తాష్కెంట్‌లో, ఇండియాలో సిపిఐ వ్యవస్థాపకుడు మానబేంద్రనాథ్‌రాయ్ అనే దురభిప్రాయం విస్తృతంగా ఉంది. ఆ విషయాన్ని మరింత పరిశీలించుదాం. మానబేంద్రనాథ్ అసలు పేరు నరేంద్రనాథ్ భట్టాచార్య. అతడు ప్రసిద్ధ విప్లవకారుడు. విదేశాల్లో కమ్యూనిస్టు అయ్యాడు. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో పనిచేశాడు. అంతిమంగా 'రాడికల్ హ్యూమనిస్టు' ఆలోచనాధారను కనుగొన్నారు. ఆయన 1887 మార్చి 21న పశ్చిమ బెంగాల్‌లోని 24 పరగణాల జిల్లా అర్బేలియా గ్రామంలో జన్మించారు. తండ్రి దీనబంధు భట్టాచార్య, తల్లి బసంతకుమారి దేవి. వారిది పూజారుల కుటుంబం. నరేన్ అర్బేలియాలో ప్రాథమిక విద్య అనంతరం 1898లో కొడాలియా వెళ్లి హరిణవి ఆంగ్లో సంస్కృత పాఠశాలలో చదువు కొనసాగించారు. తర్వాత అరవిందో ఆధ్వర్యంలో నేషనల్ కాలేజీలో చేరారు. ఆ తదుపరి బెంగాల్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో (అదే ఉత్తరోత్తరా జాదవ్‌పూర్ యూనివర్శిటీ అయింది) ఇంజినీరింగ్, కెమిస్ట్రీ అభ్యసించారు.

**విప్లవోద్యమంలో:** బంకించంద్ర, వివేకానంద ఇతర రాడికల్‌వేత్తల ప్రభావంతో నరేన్ 14 ఏళ్ల వయసులో రహస్యంగా పనిచేసే అనుశీలన్ సమితిలో చేరారు. ఆ తర్వాత జతిన్ ముఖర్జీ స్థాపించిన జుగాంతర్ గ్రూపులో చేరారు. సత్కోరి బెనర్జీ, శైలేశ్వర్, శ్యాంసుందర్ బోస్, ఫణి, నరేంద్ర చక్రవర్తి తదితర భవిష్యత్ విప్లవకారులతో ఆయనకు సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రసిద్ధ విప్లవకారుడు బరేన్ ఘోష్‌ను దేవఘర్‌లో కలుసుకున్నారు. చింగ్రిపోట, నేత్రల్లో రాజకీయదాడుల్లో ఆయన పాల్గొన్నారు. హౌరా గ్యాంగ్ కేసులో (హౌరాశివపూర్ విచారణ) 1910 జనవరిలో నరేన్‌ను అరెస్టు చేశారు. 1911 ఫిబ్రవరిలో విడుదల చేశారు. గార్డన్ రీచ్ మోటారు రెయిడ్ కేసులో 1915 ఫిబ్రవరిలో మళ్లీ అరెస్టు చేశారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నరేన్‌ను ఆయన గ్రూప్ ఆయుధాల విషయమై జర్మన్‌లతో మాట్లాడేందుకు దూతగా బటావియా (ఇండోనేషియా) పంపింది. ఆయన 1915లో బెయిలు ఉల్లంఘించి నౌకలో బటావియా వెళ్లారు. తిరిగి వచ్చాక 1915 ఆగస్టులో మళ్లీ ఓడలో జావా వెళ్లారు. చరిత్రాత్మక కాలం తదుపరి 1930లో స్వదేశం తిరిగి వచ్చారు.

**శాన్‌ఫ్రాన్సిస్కోలో:** సహాయం ఆశించి నరేన్ ఇండోనేషియా నుంచి జపాన్ వెళ్లారు. ప్రసిద్ధ చైనా నాయకుడు సన్‌ఎట్‌సేన్‌ను కలుసుకున్నారు. తర్వాత కొరియా, చైనా వెళ్లారు. ఒక జర్మనీ ఓడ రహస్య ఛాంబర్‌లో ప్రవేశించి జపాన్ తిరిగి వచ్చారు. అమెరికా వీసా సంపాదించి శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్లారు. పాలో అల్టోలో ఉండగా ఎవిలిన్ లియోనార ట్రెంట్ (ఉరఫ్ శాంతిదేవి)ను వివాహమాడారు. నిఘా కారణంగా ఆయన మానబేంద్రనాథ్ రాయ్ (ఎంఎన్‌రాయ్)గా మారారు. న్యూయార్క్‌కు మకాం మారినాక న్యూయార్క్ సిటీ పబ్లిక్ లైబ్రరీలో మార్క్సిజం అధ్యయనం చేశారు. ఆయన ఇక్కడ లాలా లజపత్ రాయ్‌ని కలుసుకున్నారు. రాయ్ ఇలా చెప్పారు: లాలా లజపత్‌రాయ్ కారల్ మార్క్స్ రచనలు, ఇతర సోషలిస్టు సిద్ధాంత గ్రంథాలు కొన్నారు. నాతో మార్క్స్ ''క్యాపిటల్'' చదివించారు. రాయ్ సోషలిస్టు అయినారు. ఈలోపు అమెరికన్ పోలీసులు లజపతిరాయ్ సమావేశం నుండి ఆయనను అరెస్టు చేశారు. ఏదో విధంగా బెయిలు ఉల్లంఘించి రైలెక్కి మెక్సికో సరిహద్దులోని శాన్ ఆంటోనియో చేరారు. రియో గ్రాండె నది దాటి మెక్సికోలో ప్రవేశించారు.

**మెక్సికో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి:** రాయ్ మెక్సికో చేరే సమయానికి దేశం విప్లవం అంచున ఉంది. 1917 నవంబర్ చివరి నుంచి 1919 నవంబర్ ప్రారంభం వరకు ఆయన అక్కడ ఉన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కో కుట్ర కేసులో ఆయనను అరెస్టు చేశారు. అయితే త్వరలోనే విడుదల అయ్యారు. అధ్యక్షుడు కరాంజతో స్నేహం ఏర్పడింది. మెక్సికో నుండి పారిపోవటానికి ఒకసారి ప్రయత్నించాడు గానీ, సమయానికి ఓడను అందుకోలేకపోయాడు. సోషలిస్టు పార్టీ పత్రిక ''లా లూచా'' నడపటంలో సహాయపడ్డారు. ఎల్‌హెరాల్డో ఇంగ్లీషు బాణీ పత్రికను ఎడిట్ చేశారు.

ఎంఎన్ రాయ్ రూపొందించిన ప్రణాళిక 'లా లూచా'లో ప్రచురించబడింది. దాని ప్రాతిపదికపై సోషలిస్టు పార్టీ 1918లో 'వర్కర్స్ పార్టీ'గా మారింది. 1918 డిసెంబర్‌లో జరిగిన మరో మహాసభ ఆ పార్టీ పేరును 'కమ్యూనిస్టు పార్టీ'గా మార్చుకుంది. దాని ప్రధాన కార్యదర్శిగా ఎంఎన్ రాయ్ ఎన్నుకోబడ్డారు. ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన పేరుతో ఫలకం ఇప్పటికీ ఉంది.

**కొమింటర్న్ రెండవ కాంగ్రెస్, 1920లో:** మెక్సికోలో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (కొమింటర్న్) ప్రతినిధిగా ఉన్న ప్రసిద్ధుడు మిఖాయిల్ బోరోడిన్ 1919 ప్రారంభం లో రాయ్‌తో సంబంధం ఏర్పరుచుకున్నారు. అమెరిలో ఉన్న బోరోడిన్ పోలీసుల నుంచి తప్పించుకునేందుకు మెక్సికోలో ప్రవేశించారు. చేతిలో చిల్లిగవ్వ (పెన్నీ) లేని బోరోడిన్ రాయ్ ఆశ్రయం కోరారు. ఆయన అధ్యక్షుడు కొరాంజతో సంబంధం ఏర్పాటు చేశాడు. కొమింటర్న్ రెండవ మహాసభకు మెక్సికో కమ్యూనిస్టు పార్టీ నుంచి హాజరైన ఇద్దరిలో ఎంఎన్ రాయ్ ఒకరు. ఆయన బెర్లిన్ చేరుకుని అక్కడి నుండి 1919 అంత్యం, 1920 ఆరంభంలో మాస్కో చేరారు. రాయ్ జర్మనీ, రష్యాల్లో బెర్లిన్ కమిటీ విప్లవకారులు తదితరులను కలుసుకున్నారు. వీరేంద్రనాథ్ చట్టోపాధ్యాయ, అబనీ ముఖర్జీ, భూపేష్ దత్తా, చంపక్ పిళ్లయ్, సౌకత్ ఉస్మానీ తదితరులు వారిలో ఉన్నారు. కొమింటర్న్ కాంగ్రెస్‌కు వారం రోజులముందు లెనిన్‌ను రాయ్ కలుసుకున్నారు. చర్చల తర్వాత, వలస ప్రజల సమస్యలపై అనుబంధ థీసిస్ తయారు చెయ్యవలసిందిగా లెనిన్ ఆయనను కోరారు.



నేడు రాయ్ వర్ధంతి

**రాయ్‌పై లెనిన్ విమర్శ:** 1920 జులై 19 నుండి ఆగస్టు 7 వరకు 'కమ్యూనిస్టు ఇంటర్నేషనల్' రెండవ కాంగ్రెస్ మాస్కోలో జరిగింది. జాతీయ, వలసల అంశాలపై లెనిన్ థీసిస్‌లను మహాసభ చర్చించింది. అనుబంధ థీసిస్‌లను రాయ్ రూపొందించారు. వలస దేశాల్లో స్వాతంత్ర్యోద్యమాలను విశ్లేషించటం, అనువైన వ్యూహం, ఎత్తుగడలు రూపొందించటం వాటి ఉద్దేశం. రాయ్ థీసిస్‌లను లెనిన్ తీవ్రంగా విమర్శించారు. ఎందుకంటే అవి పూర్తిగా ఒంటెత్తు వాదంతో, విప్లవకారులు, కమ్యూనిస్టులను స్వాతంత్ర్య ఉద్యమాల నుంచి ఏకాకులను చేసేవిగా ఉన్నాయి. రాయ్ టైప్డు థీసిస్‌ల నుండి పెద్ద పేరాలను లెనిన్ స్వయంగా తొలగించారు. (హిస్టరీ ఆఫ్ సిపిఐ డాక్యుమెంట్స్, ఎడిటర్ డాక్టర్ అధికారి, వాల్యూం ఒకటి,1917–22, పేజీలు 173,177. ఫోటోస్టాట్స్ ఆఫ్ రాయ్ థీసిస్).

బూర్జువా ప్రజాతంత్ర విప్లవాలు ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించబోవని రాయ్ అంటారు... ''భారతదేశంలో ప్రజలు బూర్జువావర్గ నాయకులతో లేరు, విప్లవం వైపు ప్రయాణిస్తున్నారు... గాంధీజీ, కాంగ్రెస్‌లను త్రోసివేసి స్వాతంత్ర్యోద్యమ నాయకత్వాన్ని కమ్యూనిస్టులు స్వాధీనం చేసుకోవాలి. జాతీయతతత్వాన్ని బలపరచటం వర్గ పోరాటాన్ని విడనాడటమే'' అంటారు రాయ్. ఇవీ, ఇంకా కొన్ని కీలకమైన పేరాగ్రాఫ్‌లను లెనిన్ తిరస్కరించారు. స్వదేశీ బూర్జువా ప్రజాతంత్ర ఉద్యమాన్ని కమ్యూనిస్టులు బలపరచాలని లెనిన్, కొమింటర్న్ స్పష్టంగా చెప్పాయి. వాటి విప్లవకర పాత్ర ముగియలేదు. ఆ విధంగా లెనిన్, సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య సంఘటన అనే సరికొత్త భావనను ప్రతిపాదించారు. ఆయన తూర్పు దిక్కు ప్రజలకు ఇలా చెప్పారు: ''అక్కడి ప్రజల్లో జాగృతమవుతున్న, జాగృతం కావలసిన బూర్జువా జాతీయతవాదంపై మీరూ ఆధారపడాలి. దానికి దాని చారిత్రక సమర్ధనీయత ఉంది''. అటువంటి ఉద్యమాలకు కమ్యూనిస్టు రంగు ఇవ్వటాన్ని గట్టిగా వ్యతిరేకించారు. వలస దేశాల్లో పరిస్థితులు పక్వం కాకుండా కమ్యూనిస్టు పార్టీల ఏర్పాటును లెనిన్ వ్యతిరేకించారు. ఎందుకంటే వర్గ ఏర్పాటు ఇంకనూ శైశవదశలో ఉంది. మహాత్మాగాంధి, సన్‌ఎట్‌సేన్, పాషా తదితర సామ్రాజ్యవాద వ్యతిరేక నాయకులను ఆయన ఎంతో ప్రశంసించారు.

కాగా, ఎంఎన్‌రాయ్ అభిప్రాయం తద్విరుద్ధం. జాతీయ బూర్జువావర్గం సామ్రాజ్యవాదం వైపు వెళ్లిపోయింది. కాంగ్రెస్ సామ్రాజ్యవాదులకు సేవకుడు అవుతున్నది అంటారు. ఆ విధంగా ఎంఎన్ రాయ్ కమ్యూనిస్టు ఉద్యమంలో ఒంటెత్తు, పిడివాద ధోరణికి పునాది వేశారు; దాని భవిష్యత్‌ను దెబ్బతీశారు.

**తాష్కెంట్ 'సిపిఐ'ని వ్యతిరేకించిన రాయ్:** తాష్కెంట్ లో సిపిఐ ఏర్పాటు (1920)కు ఎంఎన్ రాయ్ చర్యలు తీసుకున్నారని భావించటం వాస్తవంగా తప్పు. నిజానికి ఆయన వ్యతిరేకించారు. భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యవస్థాపకునిగా రాయ్‌ని చూపటం కూడా తప్పు. వాస్తవానికి తాష్కెంట్‌లో సిపిఐ ఏర్పాటును ఆయన వ్యతిరేకించారు. తాష్కెంట్ సమావేశానికి హాజరైనప్పటికీ తన ఆత్మకథలో ఇలా రాశారు: 'ప్రవాసంలో కొద్దిమంది వ్యక్తులు కమ్యూనిస్టు పార్టీగా తమను తాము పిలుచుకోవటం అర్థరహితం... అది నామమాత్రావశిష్టం అని సంపూర్ణంగా తెలిసికూడా...' రాయ్ ఇంకా ఇలా అన్నారు: ''ప్రవాస కమ్యూనిస్టు పార్టీని నేను ఆమోదించలేదు. భారత ప్రజల మొత్తం పక్షాన అన్న విషయాన్ని అలా వుంచితే, భారత కార్మికుల పక్షాన మాట్లాడే ఎట్టి హక్కు దానికి ఉంటుందని నేను విశ్వసించను'' (ఆత్మకథ, పేజి 465)

**భారత్‌కు పునరాగమనం:** 15 ఏళ్ల తర్వాత, 1930 డిసెంబర్‌లో ఎంఎన్ రాయ్ భారత్‌కు తిరిగి వచ్చారు. నెహ్రూ, బోస్ తదితర నాయకులను కలుసుకున్నారు. 1924 నాటి వారెంటు కింద 1931 జులైలో బొంబాయిలో అరెస్టు చేసి 12 సం.లు జైలు శిక్ష విధించారు. ఐదు జైళ్లు తిప్పారు. చివరకు ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింది. 1936 నవంబర్‌లో విడుదల అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. రాజ్యాంగ నిర్ణాయక సభ ఏర్పాటును ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను కూలద్రోయమని ప్రతిపాదించిన వ్యక్తి అదే పార్టీలో చేరటం చిత్రంగా లేదూ! రాయ్ 1936లో మద్రాసులో సింగారవేలును కలుసుకున్నారు, కొన్నాళ్లు ఆయన ఇంట్లోనే ఉన్నారు.

**'రాడికల్ హ్యూమనిజం':** కాంగ్రెస్‌తో త్వరలోనే ఆయనకు భేదాభిప్రాయాలు తలెత్తాయి. 'ఇండిపెండెంట్ ఇండియా' అనే పత్రిక ప్రచురణ ప్రారంభించారు. ఎల్లెన్ గాట్స్‌చక్‌ను రెండవ భార్యగా స్వీకరించాక డెహ్రాడూన్‌లో స్థిరపడ్డారు. 'లీగ్ ఆఫ్ రాడికల్ కాంగ్రెస్‌మన్' ఏర్పాటు చేశాక 'రాడికల్ హ్యూమనిజం' అనే సిద్ధాంతం అభివృద్ధి చేశారు. అది ఆయన ''రీజన్, రొమాంటిసిజం, అండ్ రివల్యూషన్'' అనే తన గ్రంథంలో ప్రతిపాదించిన గందరగోళపు భావాల సమ్మిళితం. ఆయన నాయకత్వంలోని చిన్న గ్రూప్‌కు ట్రేడ్ యూనియన్ విభాగం వుంది. ఆ గ్రూప్ కాంగ్రెస్‌లో, ఎఐఎస్ఎఫ్‌లో పనిచేసింది. రాయ్ ఆయన గ్రూప్ 1940లో కాంగ్రెస్ నుంచి వైదొలిగి రాడికల్ డెమోక్రటిక్ పార్టీ(ఆర్‌డిపి) ఏర్పాటు చేసింది. 1946 డిసెంబర్‌లో బొంబాయిలో ఆయన ఆ పార్టీ అఖిల భారత మహాసభలో రాడికల్ డెమోక్రసీ మ్యానిఫెస్టోను లేదా 22 ప్రాథమిక సూత్రాలను ప్రకటించారు. ఆ తర్వాత దాన్ని 'బియాండ్ కమ్యూనిజం', 'న్యూ హ్యూమనిజం ఎ మ్యానిఫెస్టో' పేరుతో ప్రచురించారు. ప్రజాస్వామ్యం గూర్చిన తన భావనతో పార్టీ రాజకీయాలు పొసగవని నిర్ధారణకు వచ్చిన రాయ్ 1948 డిసెంబర్‌లో కలకత్తా మహాసభలో ఆర్‌డిపిని రద్దు చేశారు. రాయ్ డెహ్రాడూన్‌లో ఇండియన్ రినైజాన్స్ ఇన్‌స్టిట్యూట్ నెలకొల్పారు. ఇంటర్నేషనల్ హ్యూమనిస్టు అండ్ ఎథికల్ యూనియన్ (ఐహెచ్‌ఇయు) ప్రారంభ మహాసభ 1952లో ఆమ్‌స్టెర్‌డంలో జరగాల్సి ఉంది. రాయ్ హాజరు కావాలి. అయితే 1952 జూన్‌లో ముస్సోరీలో జరిగిన ప్రమాదంలో 50 అడుగుల లోతు గోతిలో పడిపోయారు. మెదడులో రక్తం గడ్డకట్టడం, పక్షవాతం జబ్బులకు గురైనారు. తన పరోక్షంలో ఆయన ఐహెచ్‌ఇయు ఉపాధ్యక్షునిగా ఎన్నుకోబడ్డారు. ఆయన ఆఖరు వ్యాసం 1954 జనవరి 24న ప్రచురితమైంది. 1954 జనవరి 25న, తన 67వ ఏట డెహ్రాడూన్‌లో గుండెపోటుతో రాయ్ మరణించారు. చివరి రోజుల్లో ఆయన భౌతికవాదాన్ని విడిచిపెట్టి ఆధ్యాత్మికవాదంవైపు మరలినారు. చివరకు గందరగోళ భావాలతో ఆయన విప్లవ జీవిత ప్రస్థానం ముగిసింది.

– అనిల్ రాజింవాలె

# 'ఆప్' కన్వీనర్ కేజ్రీవాల్ హత్యకు కేంద్రం, ఢిల్లీ పోలీసులు కుట్ర

### ఇద్దరు సిఎంల సంచలన ఆరోపణ



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సంచలన ఆరోపణలు చేసింది. తమ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను అంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు కుట్ర పన్నారని ఆరోపించింది. ఆ కుట్రలో భాగంగానే కేజ్రీవాల్ రక్షణ కోసం పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన భద్రతా బృందాన్ని బిజెపి సారథ్యంలోని కేంద్ర సర్కార్ ఉపసంహరించిందని తెలిపింది. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఢిల్లీ సిఎం ఆతిశీ, పంజాబ్ సిఎం భగవంత్ మాన్ ఈ ఆరోపణలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం(ఇసి) వెంటనే ఈ అంశంపై స్పందించాలని, కేజ్రీవాల్‌కు పంజాబ్ ప్రభుత్వం కల్పించిన భద్రతను పునరుద్ధరించి, పారదర్శకతను చాటుకోవాలన్నారు. కేజ్రీవాల్ ప్రాణాలకు ముప్పు కలిగించే రీతిలో ఇప్పటి వరకు జరిగిన దాడులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 5న జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కు జరిగేలా చూడాలని తాము ఇసికి లేఖ రాసినట్లు చెప్పారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశం మేరకు కేజ్రీవాల్‌పై జరిగిన దాడులను కేంద్రం పరిధిలోకి వచ్చే ఢిల్లీ పోలీసులు పట్టించుకోలేదని వారు ఆరోపించారు. కేజ్రీవాల్‌జీని చంపడానికి జరిగిన ఈ కుట్రలో ఇద్దరు పాత్రధారులు.. బిజెపి, ఢిల్లీ పోలీసులు ఉన్నారన్నారు. వారిద్దరూ కేజ్రీవాల్ జీవితాన్ని అంతం చేయడానికి కుట్ర పన్నారని మండిపడ్డారు. ఆయనపై ఒకదాని తర్వాత ఒకటి దాడులు జరుగుతున్నాయన్నారు. గత సంవత్సరం అక్టోబర్‌లో కేజ్రీవాల్‌పై దాడి జరిగిందని, తమ దర్యాప్తులో, దాడి చేసినవారు బిజెపి కార్యకర్తలని తేలినప్పటికీ పోలీసులు ఎటువంటి చర్య తీసుకోలేదని ఆతిశీ ఆరోపించారు. కేజ్రీవాల్ భద్రతను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఇసికి లేఖ రాశామని చెప్పారు. ఢిల్లీ పోలీసులు అమిత్ షా నియంత్రణలో ఉన్నందున తమకు వారిపై నమ్మకం లేదన్నారు. ఢిల్లీ ఎన్నికలకు ముందు 'మురికి రాజకీయాలకు' పాల్పడుతూ, బిజెపి కేజ్రీవాల్ భద్రతను తొలగించడానికి కుట్ర పన్నిందని ఆప్ నాయకులు ఆరోపించారు. గత మూడు నెలలుగా వేర్వేరు సందర్భాలలో, రాజకీయ ర్యాలీలో భౌతిక దాడి, రాళ్ల దాడి ఘటనలతో సహా కేజ్రీవాల్‌పై దాడులకు ప్రయత్నించారని, ఇది తమలో ఆందోళనలను మరింత పెంచిందన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్‌కు పంజాబ్ పోలీసుల భద్రతా కవరేజీని ఉపసంహరించుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన నివేదికను ముఖ్యమంత్రులు 'రాజకీయ ప్రేరేపిత' నిర్ణయంగా పేర్కొన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్‌కు పంజాబ్ పోలీసుల భద్రతను ఉపసంహరించుకోవాలని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కోరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే అతనికి ఇప్పటికే జెడ్ ప్లస్ భద్రత ఉంది. కేజ్రీవాల్ భద్రత కోసం మోహరించిన తమరాష్ట్రాని కి చెందిన పోలీసు సిబ్బందిని ఉపసంహరించుకున్నట్లు పం జా బ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) గౌరవ్ యాదవ్ గురువారం తెలిపారు. 'ఢిల్లీ పోలీసులు, ఇసి నుండి వచ్చిన ఆదేశాల ను అనుసరించి కేజ్రీవాల్ భద్రతలో పంజాబ్ పోలీసు విభాగా న్ని ఉపసంహరించుకున్నామన్నారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ భద్రతా ఏర్పాట్లను వెంటనే పూర్తిగా సమీక్షించి అత ని భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని, నమ్మకమైన, నిష్పాక్షికమైన రక్షణను అందించడానికి అతని భద్రతా విభాగంలో పం జాబ్ పోలీసు విభాగాన్ని చేర్చాలని ఆప్ నాయకులు ఇసిని కోరారు.

# పూర్వాంచల్ వలసదారులకు ప్రత్యేక మంత్రిత్వశాఖ

### అధికారంలోకి వస్తే ప్రత్యేక బడ్జెట్ : కాంగ్రెస్ ప్రకటన



**న్యూఢిల్లీ :** అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే ఢిల్లీలో పూర్వాంచల్ వలసదారులకు కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ, బడ్జెట్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ శుక్రవారం ప్రకటించింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిలీలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను విధ్వంసం చేసి చెత్తబుట్టగా మార్చిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఆప్ ప్రభుత్వం ఆరోగ్యశాఖలో రూ.382 కోట్ల మేరకు అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. పార్టీ బీహార్ యూనిట్ అధ్యక్షుడు, మాజీ కేంద్ర మంత్రి అఖిలేష్ ప్రసాద్ సింగ్ ఢిల్లీ కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీ ప్రపంచ స్థాయి నగరంగా మారితే, దేశ రాజధానిలో నివసించే ఇతరుల మాదిరిగానే పూర్వాంచలీయులకు కూడా అంతే పాత్ర ఉందన్నారు. నేడు తాము రెండు ముఖ్యమైన ప్రకటనలు చేయాలనుకుంటున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పూర్వాంచలీయుల ప్రజలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెడు తామని, తద్వారా వారి ఆరోగ్యం, విద్యకు సంబంధించిన సమస్యలను పరిష్కరించవచ్చని సింగ్ తెలిపారు. తూర్పు ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ నుండి వచ్చిన ఢిల్లీ నివాసితులను దేశ రాజధానిలో పూర్వాంచలీలుగా పిలుస్తారు. ఢిల్లీలోని అనేక నియోజకవర్గాలలో అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించగల ఓటర్లలో వీరు గణనీయంగా ఉన్నారు. అందుకే ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బిజెపి, ఆప్ వారిని ఆకర్షిస్తాయి. పూర్వాంచలీలు ఈ దేశంలోని ప్రతి మూలకు వెళ్లి ఆ ప్రాంతాలను అభివృద్ధి చేశారని కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనాటే అన్నారు. కానీ వారి హక్కుల విషయానికి వస్తే, వారికి అన్యాయం జరుగుతుందని ఆమె అన్నారు. ఢిల్లీలో ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగుతుందని, ఫిబ్రవరి 8న కౌంటింగ్ జరుగుతుందని ఆమె అన్నారు.

# నన్ను సిఎం చేస్తానన్నారు

### బిజెపిపై మనీశ్ సిసోదియా సంచలన ఆరోపణ



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయం మరోసారి రసవత్తరంగా మారింది. ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ డిప్యూటీ సిఎం మనీశ్ సిసోదియా సంచలన వ్యాఖ్యలు చేశారు. లిక్కర్ స్కామ్ కేసులో తాను తీహార్ జైలులో ఉన్న సమయంలో బిజెపి తనకు ముఖ్యమంత్రి పదవి ఇస్తానని ప్రతిపాదించిందని చెప్పారు. అయితే, తాను బిజెపి ప్రతిపాదనను నిరాకరించినందుకే ఎక్కువ సమయం జైలులో గడపాల్సి వచ్చిందన్నారు. ఆయన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రకంపనలు రేపాయి. 'ఆప్‌పై బిజెపి చేసిన కుట్రలు ఎవరికీ తెలియవు. ఇతర పార్టీల నుంచి నేతలను కొనుగోలు చేయడమే బిజెపి విధానం. బిజెపిని వ్యతిరేకించే ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసుకుంటారు. వాళ్ల మాట వినకపోతే తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తారు. ప్రజాసంక్షేమం, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రజల అవసరాలతో కాషాయ పార్టీ నేతలకు అవసరం లేదు. కేవలం అధికారం కోసమే బిజెపి ఆరాటపడుతుంది. లిక్కర్ స్కామ్ కేసులో నన్ను అన్యాయంగా జైలులో పెట్టారు. నేను జైలులో ఉన్న సమయంలో బిజెపి నాకు సీఎం పదవి ఇస్తానని చెప్పింది. బిజెపిలో చేరాలని.., అలా అంగీకరిస్తే ఆప్ ఎమ్మెల్యేలను విడగొట్టి తనకు ముఖ్యమంత్రి పదవి ఇస్తానని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను నిరాకరిస్తే ఎక్కువ కాలం కటకటాల వెనుక ఉంచుతామని బిజెపికి చెందిన ఒక నేత బెదిరించారు' అని సిసోదియా చెప్పారు.

# మత ఘర్షణల్లో బిజెపి రాష్ట్రాలు టాప్

### అల్లర్లకు చిరునామాగా మహారాష్ట్ర
### 2024లో 84 శాతం పెరిగిన ఘటనలు



**న్యూఢిల్లీ:** భిన్నత్వంలో ఏకత్వానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే భారతదేశం ఎన్డీయే హయాంలో మత ఘర్షణలకు చిరునామాగా మారింది. ముస్లింలే లక్ష్యంగా హింస పేట్రేగింది.లవ్ జిహాద్, గో సంరక్షణ పేరిట హింస కొనసాగుతోంది. మూక హత్యలు పెరిగాయి. పండుగలప్పుడు అల్లర్లు జరగడం నిత్యకృత్యంగా మారిపోయింది. 2024లో దేశంలో మతఘర్షణలు 84 శాతం పెరిగినట్లు ది సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సొసైటీ అండ్ సెక్యులరిజం (సీఎస్ఎస్ఎస్) నివేదించింది. మత ఘర్షణల్లో బీజేపీ పాలిత రాష్ట్రాలే అగ్రస్థానంలో నిలిచినట్లు తెలిపింది. టాప్5లో మహారాష్ట్ర, బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఉన్నాయని పేర్కొంది. మొత్తం 59 కేసుల్లో 49 బీజేపీ రాష్ట్రాల్లోనే నమోదైనట్లు తెలిపింది. ఏడు కేసులు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో, మూడు కేసులు తృణమూల్ పాలిత బెంగాల్‌లో నమోదైనట్లు వెల్లడించింది. మత ఘర్షణలు, అల్లర్లలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. మత ఘర్షణలకు కేంద్రంగా మహారాష్ట్ర ఉందని, మొత్తం 59 ఘటనల్లో 12 ఈ రాష్ట్రంలోనే జరిగాయని సీఎస్ఎస్ఎస్ నివేదిక తెలిపింది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్, బీహార్ ఉన్నాయని పేర్కొంది. ది హిందూ, టైమ్స్ ఆఫ్ ఇండియా, ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్, షహీఫత్, ది ఇంక్విలాబ్ వంటి పత్రికల ముంబై ఎడిషన్ల ఆధారంగా విడుదల చేసిన ఈ నివేదికను మానవ హక్కుల కార్యకర్తలు ఇర్ఫాన్ ఇంజినీర్, నేహా దభాడే, మిథులా రౌత్ రూపొందించారు. '2024 జనవరిలో మహారాష్ట్రలో హింస ఎక్కువగా జరిగింది. అయోధ్యలో రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సమయంలో నాలుగు అల్లర్లు జరిగాయి. ఫిబ్రవరిలో సరస్వతి పూజా సమయంలో విగ్రహాల నిమజ్జనం వేళ ఏడు... గణేశ్ ఉత్సవాల్లో నాలుగు... బక్రీద్ సమయంలో రెండు ఘటనలు జరిగాయి. విద్వేష ప్రసంగాలు, మూక హత్యల విషయానికొస్తే 2024లో తొమ్మిది మంది ముస్లింలు, ఒక క్రైస్తవుడు, ఒక హిందువుతో కలిపి 11 మంది చనిపోయారు. మొత్తం 13 ఘటనలు నమోదయ్యాయి. వీటిలో ఏడు ఘటనలు గో రక్షణ సాకుతో జరిగాయి. మిగతావి లవ్ జిహాద్ పేరిట చోటుచేసుకున్నాయి. ముస్లింలే లక్ష్యంగా హింస పేట్రేగింది. ఏప్రిల్/మేలో సార్వత్రిక ఎన్నికలతో పాటు మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటం కూడా మత ఘర్షణలకు ఆజ్యం పోశాయి. ఆయా సందర్భాల్లో మత విద్వేషం, అలర్లు, విద్వేష ప్రసంగాలకు అడ్డు లేకుండా పోయింది' అని సీఎస్ఎస్ఎస్ నివేదిక వెల్లడించింది.

# ఇక మూడో ఉప ముఖ్యమంత్రి

### శివసేనలో చీలిక తప్పదు: రౌత్



**ముంబై:** శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ శుక్రవారం శివసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్రకు వారి నుంచి మూడో ఉప ముఖ్యమంత్రి ఉంటారని చెబుతూ, ఆయన పార్టీలో చీలిక ఏర్పడిందని అన్నారు. శుక్రవారం రాజ్యసభ ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ తెరవెనుక కార్యకలాపాలు ఎంతలా అంటే, భవిష్యత్‌లో రాష్ట్రానికి ముగ్గురు ఉప ముఖ్యమంత్రులు ఉండేలా ఉన్నాయని తెలిపారు. 'ఏక్‌నాథ్ షిండేను ఎవరూ సీరియస్‌గా తీసుకోకూడదు. ఆయన ఉప ముఖ్యమంత్రి. ఆయన నిన్న ముఖ్యమంత్రి. మహారాష్ట్రకు అదే పార్టీ నుంచి మూడవ ఉప ముఖ్యమంత్రి వస్తున్నందున ఆయన రేపు అక్కడ ఉండరు. ఆయన (షిండే) దీని గురించి ఆలోచించాలి' అని రౌత్ అన్నారు. పార్టీ మిత్రపక్షమైన బీజేపీని ఉద్దేశించి షిండే మహారాష్ట్ర 'శత్రువులకు' సేవ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పరిశ్రమల మంత్రి ఉదయ్ సమంత్... షిండే నేతృత్వంలోని శివసేనను విభజించగలరని, ఎందుకంటే ఆయనకు 20 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని రౌత్ పేర్కొన్న కొన్ని రోజుల తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది నవంబరులో జరిగిన రాష్ట్ర ఎన్నికల తర్వాత షిండేకు ముఖ్యమంత్రి పదవి నిరాకరించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నప్పుడు సమంత్‌ను పరిశీలించే ఆలోచనలు వచ్చాయని ఆయన తెలిపారు. అయితే పార్టీ అధ్యక్షుడు షిండే తనకు ఎలాంటి విభేదాలు లేవని, చీలిక సృష్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని సమంత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలో ప్రస్తుతం షిండే, ఎన్‌సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా ఉన్నారు.

# యమునా నీళ్లు తాగే ధైర్యం ఉందా?

### యుపి సీఎంకు అఖిలేశ్ ప్రశ్న



**లక్నో:** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్‌పై సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విమర్శలు గుప్పించారు. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ యమునా నదిని మురుగు కాలువగా మార్చారని దిల్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా యూపీ సీఎం యోగి చేసిన విమర్శలపై అఖిలేశ్ స్పందిస్తూ... ముందు సొంత రాష్ట్రంలోని పరిస్థితులను ఆయన సరిచూసుకోవాలన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'ఇతరులను సవాలు చేసే ముందు యూపీలో పరిస్థితి ఎలా ఉందో చూసుకోవాలి. మథుర నుంచి ప్రవహించే యమునా నది నీరు తాగేందుకు సిద్ధమా' అని యోగి పేరు ప్రస్తావించకుండా అఖిలేశ్ ప్రశ్నించారు. గురువారం బీజేపీ తరపున దిల్లీ ఎన్నికల ప్రచారంలో యోగి పాల్గొన్నారు. 'బంగ్లాదేశీయులు అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్నారు. వారికి అన్ని రకాల సౌకర్యాలను ఆప్ ప్రభుత్వం కల్పిస్తోంది. దిల్లీని డంపింగ్ యార్డ్‌లా చేసింది. యమునా నదిని మురుగు కాలువగా మార్చింది. కుంభమేళా సందర్భంగా మంత్రులతో కలిసి ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానం ఆచరించా. ఇక్కడున్న యమునా నదిలో కేజ్రీవాల్ మునగగలరా? దీనికి ఆయన నైతికంగా సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

# దళిత ఓట్లపై ప్రధాన పార్టీల గురి !

### ఓట్లు చీలే అవకాశాలున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా



**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బిజెపి, పార్టీల మధ్య త్రిముఖ పోరు జరగబోతోంది. ఓటర్లను ఆకర్షించేందుకు మూడు ప్రధాన పార్టీలు పోటీపడి ఓటర్లపై హామీలు గుప్పిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో కీలకంగా మారే దళిత ఓటర్లపై మూడు పార్టీలు ప్రత్యేకంగా దృష్టిసారించాయి. దాంతో ఈసారి ఢిల్లీలో దళితుల ఓట్లు మూడు పార్టీల మధ్య చీలిపోయే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో 12 ఎస్‌సి రిజర్వ్‌డ్ స్థానాలు ఉన్నాయి. అంతేగాక మరో 30 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను నిర్ణయించే స్థాయిలో దళితుల ఓట్లు ఉన్నాయి. ఢిల్లీలో గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ దళిత ఓటర్లు బిజెపి వైపే మొగ్గుచూపారు. ఆప్ రెండు పర్యాయాలు వరుసగా అధికారంలోకి రావడంలో దళితుల ఓట్లు కీలకపాత్ర పోషించాయి. అయితే రెండు సార్లు ఆప్‌కు అధికారం కట్టబెట్టినా దళితుల జీవితాల్లో పెద్దగా మార్పు రాలేదు. దాంతో దళితుల్లో కొందరు ప్రస్తుతం ఆప్‌పై అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో ఆప్‌కు దళితుల మద్దతు తగ్గే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు, సబాల్టర్న్ మీడియా పౌండేషన్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ కుశ్ అంబేద్కర్‌వాదీ చెప్పారు. ఇక బిజెపికైతే ఢిల్లీలో ఎప్పుడూ దళితుల ఆదరణ లభించలేదు. అందుకే 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 12 ఎస్‌సి నియోజకవర్గాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా బిజెపి గెలుచుకోలేకపోయింది. అంతకు ముందు జరిగిన ఎన్నికల్లో కూడా బిజెపి 23 సీట్లతో మాత్రమే సరిపెట్టుకుంది. దాంతో ఈసారైనా దళిత ఓటర్ల మనసు గెలువాలని ఆ పార్టీ ప్రణాళిలు సిద్ధం చేస్తోంది. దళితులను ఆకర్షించేందుకు అనేక వ్యూహాలను రచిస్తోంది. వారిని ఊరించే హామీలు గుప్పిస్తోంది. దళిత మెజారిటీ నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దళితుల ఓట్లను ఆకర్షించేందుకు గత కొన్ని నెలలుగా బిజెపి ఎస్సీ మోర్చా ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. ఇదిలావుంటే ఆప్‌పై దళిత ఓటర్లు అసంతృప్తిగా ఉండటంతో తమకు ఎస్‌సి నియోజకవర్గాలు కలిసి వస్తాయని కాంగ్రెస్ పార్టీ లెక్కలు వేస్తోంది. కానీ దళిత ఓటర్లను ఆకర్షించడంలో మాత్రం కాంగ్రెస్ ఆలస్యం చేస్తోంది. ఈ విషయాన్ని గత ఏడాది ఆప్ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి రాజేంద్ర పాల్ గౌతమే స్వయంగా చెప్పారు. దళిత ఓటర్లను ఆకర్షించేలా ముందే ప్రచారం ప్రారంభించి ఉంటే మరింత మద్దతు పొందేవాళ్లమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో ఆప్‌కు దళితుల్లో ఆదరణ తగ్గినప్పటికీ మెజారిటీ దళిత ఓటర్లు ఆప్ వైపే మొగ్గే అవకాశం కనిపిస్తున్నది. ఎందుకంటే బిజెపిపై ఢిల్లీ దళితుల్లో అనాదిగా సదభిప్రాయం లేకపోవడం, కాంగ్రెస్ పార్టీ దళితులను ఆకర్షించడంలో విఫలం కావడం లాంటి పరిణామాలు ఆప్‌కు కలిసివచ్చేలా ఉన్నాయి. మూడు పార్టీలను పోల్చి చూస్తే తమకు ఆపే బెటర్ అనే ఆలోచనలో మెజారిటీ దళితులు ఉన్నారు. కాగా, సబాల్టర్న్ మీడియా ఫౌండేషన్ గణాంకాల ప్రకారం, ఢిల్లీలో దాదాపు 1.23 కోట్ల మంది దళిత ఓటర్లు ఉన్నారు. జాతవ్‌లతో సహా చమర్ కమ్యూనిటీకి 24 లక్షలకు పైగా ఢిల్లీ జిల్లాలన్నింటిలోనూ ఉన్నారు. వాల్మీకిల సంఖ్య 12 లక్షలకు పైగా ఉంది. ఇతర ప్రధాన దళిత గ్రూపులలో మల్లాలు ఉండగా, రెండు లక్షలకు పైగా ఉన్నారు. 4.82 లక్షలకు పైగా ఖాతికులు, 4.18 లక్షలకు పైగా కోలిలు ఉన్నారు. ఇతర ప్రముఖ దళిత కుల సమూహాలలో చోహ్రా, బాజిగర్, బంజారా, ధోబీ, జులాహా, మదారి, పాసి, సపేరా మరియు నాట్ ఉన్నాయి.

# టిడిఎస్ రద్దు పిల్‌ను తోసిపుచ్చిన సుప్రీం

**న్యూఢిల్లీ:** టీడీఎస్ రద్దు పిల్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఆదాయ పన్ను చట్టం కింద పన్ను వసూలుకు అనుసరిస్తున్న టీడీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఓ వ్యక్తి సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనివల్ల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందని తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. అయితే, ఈ పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది. దిల్లీ హైకోర్టును ఆశ్రయించాలంటూ పిటిషనర్‌కు సూచించింది. ప్రతిచోటా అనుసరిస్తున్న టీడీఎస్ విధానాన్ని రద్దు చేయాలంటూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఆయన తరఫున మరో లాయర్ అశ్వినీ దూబే ఈ వ్యాజ్యాన్ని వేశారు. టీడీఎస్ విధానం సమానత్వపు హక్కుతో పాటు అనేక ప్రాథమిక హక్కుల్ని ఉల్లంఘిస్తోందని పేర్కొన్నారు. ఎలాగైనా దీన్ని రద్దు చేయాలని కోరారు. దీనిపై వాదనలు విన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల సారథ్యంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. లోపభూయిష్టంగా ఉన్న ఈ వ్యాజ్యాన్ని తాము విచారణకు స్వీకరించలేమని పేర్కొంది. టీడీఎస్ విధానం అన్ని దేశాల్లోనూ అమలవుతోందని గుర్తు చేసింది. కావాలంటే దిల్లీ హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు ధర్మాసనం సూచించింది.

# మూడు పాఠశాలలకు బాంబు బెదిరింపులు..

**గాంధీనగర్ :** దేశంలో బాంబు బెదిరింపులు మరోసారి కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల క్రితం తమిళనాడులోని రెండు పాఠశాలలకు, నిన్న ముంబైలోని ఓ పాఠశాలకు ఇలాంటి బెదిరింపులే వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా గుజరాత్ రాష్ట్రంలోని మూడు పాఠశాలలకు బెదిరింపులు వచ్చాయి. వడోదర లోని నవరచన స్కూల్ సహా మొత్తం మూడు పాఠశాలలకు శుక్రవారం ఉదయం ఈ బెదిరింపులు వచ్చాయి. దుండగులు ఈమెయిల్ ద్వారా ఈ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ బెదిరింపు మెయిల్‌తో అప్రమత్తమైన ఆయా పాఠశాలల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు పాఠశాలల్లోని విద్యార్థులను, సిబ్బందిని వెంటనే బయటకు పంపించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాల సాయంతో ఆయా పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ కనిపించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న వడోదర పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# పాల ధరలు తగ్గించిన అమూల్

**అహ్మదాబాద్:** ప్రముఖ డెయిరీ బ్రాండ్ అమూల్ పాల ధరలు తగ్గించింది. మూడు రకాల పాలపై లీటరుకు రూపాయి చొప్పున తగ్గించినట్లు ప్రకటించింది. కంపెనీ అందిస్తోన్న ప్రధాన పాల ఉత్పత్తులు అమూల్ గోల్డ్, అమూల్ తాజా, అమూల్ టీ స్పెషల్‌పై ఈ తగ్గింపు ఉంటుందని పేర్కొంది. ఈ విషయాన్ని అమూల్ పేరుతో పాలు విక్రయించే గుజరాత్ కోపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఎండీ జయేన్ మెహతా వెల్లడించారు. ధరల తగ్గింపు తర్వాత అమూల్ గోల్డ్ ధర రూ.65 (ఒక లీటరు), అమూల్ టీ స్పెషల్ ధర రూ.61 (ఒక లీటరు), అమూల్ తాజా ధర రూ.53 (లీటరు)గా ఉంది. ధరల తగ్గింపు నిర్ణయం వెనుకున్న కారణాన్ని అమూల్ వెల్లడించలేదు. డెయిరీ విభాగంలో పోటీ పెరుగుతున్న తరుణంతో తన ఉనికిని బలోపేతం చేసుకుంటూ... ధరల తగ్గింపుతో వినియోగదారులకు ఉపశమనం కలిగించాలని కంపెనీ ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా... గతేడాది జూన్‌లో అమూల్, మదర్ డెయిరీ లీటరు పాలపై రూ.2 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఆడపిల్లల రక్షణ గాలికి...

### నిలిచిన సిసి కెమెరాల ఏర్పాటు



**దాదర్:** విద్యార్థులపై అత్యాచారాలు, లైంగిక దాడుల ఘటనలు తరుచూ వెలుగులోకి వస్తున్నప్పటికీ బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) స్కూళ్లలో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ ఇంతవరకూ పూర్తికాలేదు. దీంతో విద్యార్థుల భద్రత ముఖ్యంగా ఆడపిల్లల రక్షణ గాలికి వదిలేసినట్లైంది సుమారు నాలుగు నెలల కిందట బద్లాపూర్‌లోని ఓ పాఠశాలలో ఇద్దరు చిన్నారులపై లైంగిక దాడుల ఘటన జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ప్రజలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ముంబై సహా తూర్పు, పశ్చిమ ఉప నగరాల్లో ఉన్న అన్ని బీఎంసీ పాఠశాలల్లోని తరగతి గదుల్లో, పాఠశాల ఆవరణలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బీఎంసీ పరిపాలనా విభాగం నిర్ణయం తీసుకుంది. కానీ ముంబై సిటీ పరిధిలో ఉన్న బీఎంసీ పాఠశాలల్లో మాత్రమే సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. పశ్చిమ, తూర్పు ఉప నగరాల్లోని 356 పాఠశాలల్లో ఇంతవరకు వాటి ఊసే లేదు. నిధుల కొరత వల్ల వాటిని ఏర్పాటు చేయలేదని బీఎంసీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో విద్యార్థుల భద్రత మరోసారి తెరమీదకు వచ్చింది. ముంబై, ఉప నగరాల్లో బీఎంసీకి చెందిన ప్రాథమిక, సెకండరీ పాఠశాలల్లో దాదాపు మూడు నుంచి నాలుగు లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఏడున్నర వేలకుపైగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. వీరిలో పురుషులతో పోలిస్తే మహిళా ఉపాధ్యాయుల సంఖ్య అధికం. దీంతో వారికి కూడా రక్షణ కల్పించాల్సిన బాధ్యత బీఎంసీపై ఉంది. పాఠశాల తరగతి గదుల్లో, స్కూల్ ఆవరణలో విద్యార్థులపై లైంగిక దాడులు, వేధింపులు చోటుచేసుకుంటే సీసీ టీవీ కెమెరాల్లో రికార్డయిన వీడియో దృశ్యాలు నిందితులను గుర్తించడానికి ఎంతో దోహద పడతాయి. దీంతో బీఎంసీకి చెందిన అన్ని పాఠశాలల్లో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బీఎంసీ పరిపాలన విభాగం నిర్ణయం తీసుకుంది. గతంలో జరిగిన సంఘటనలతో అప్రమత్తమైన బీఎంసీ అన్ని స్కూళ్లలోనూ సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. కానీ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోడ్, మూడేళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న బీఎంసీ ఎన్నికలు, ఇతర అనివార్యకారణాల వల్ల కెమెరాల ఏర్పాటు ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. కానీ బద్లాపూర్ ఘటనతో ఈ అంశం మళ్లీ తెరమీదకు రావడంతో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు సలహాదారుల కమిటీని నియమించి టెండర్ల ప్రక్రియను పూర్తిచేసింది. బీఎంసీ పరిధిలో మొత్తం 479 పాఠశాలుండగా వీటిలో ముంబై సిటీలో ఉన్న 123 పాఠశాలల్లో 2,832 సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ నిధుల కొరత వల్ల ఉప నగరాల్లో ఉన్న 356 పాఠశాలల్లో మాత్రం ఇంతవరకూ ఏర్పాటు చేయలేదు. చివరకు బీఎంసీ అదనపు కమిషనర్ అమిత్ సైనీ జోక్యం చేసుకుని నిధుల మంజూరుకు ఆదేశించారు. కానీ అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో నిధులు మంజూరు ప్రతిపాదన అటకెక్కింది. ఫలితంగా ఉప నగరాల్లోని 356 పాఠశాలల్లో సుమారు ఆరువేల సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటుచేసే ప్రక్రియ పెండింగులో పడిపోయింది. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు, ఫలితాల తంతు పూర్తయి కొత్త ప్రభుత్వం కూడా ఏర్పాటైంది. దీంతో ఈ పాఠశాలల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు దాదాపు రూ.54 కోట్లు అవసరం కావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించాలని బీఎంసీ యోచిస్తోంది.

# మానవత్వం మంటకలిసిన వేళ...

**అగర్తల:** అప్పు తిరిగి చెల్లించలేదని ఓ మహిళ పట్ల అమానవీయంగా ప్రవర్తించారు. ఇంట్లో వంట చేసుకుంటున్న మహిళను బయటికి ఈడ్చుకొచ్చి మూకుమ్మడి దాడి చేశారు. అంతటితో ఆగక మరో అనాగరిక చర్యకు పాల్పడ్డారు. బలవంతంగా గుండు గీశారు. త్రిపుర రాష్ట్రం సెపహిజాలా జిల్లాలోని విశాల్‌గఢ్‌లోగల లాల్‌సింగ్‌మురా ప్రాంతంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... లాల్‌సింగ్‌మురా ఏరియాకు చెందిన ఓ మహిళ స్వయం సహాయక సంఘం నుంచి కొంత డబ్బు అప్పుగా తీసుకుంది. ఆ డబ్బును కుటుంబ అవసరాలకు వినియోగించింది. ఆ తర్వాత కొన్నాళ్లకు ఆమె భర్త ఉద్యోగం పోయింది. దాంతో ఆ డబ్బు తిరిగి చెల్లించలేకపోయింది. దాంతో గ్రూపులోని మిగతా సభ్యులంతా ఆమెను డబ్బు తిరిగిచెల్లించాలని ఒత్తిడి చేశారు. కానీ ప్రస్తుతం తాను చెల్లించే పరిస్థితిలో లేనని ఆమె చెప్పింది. దీంతో గురువారం ఉదయం స్వయం సహాయక సంఘంలోని మిగతా మహిళలంతా కలిసి అప్పు తీసుకున్న మహిళ ఇంటికి వెళ్లారు. కిచెన్‌లో వంట చేస్తున్న ఆమెను బయటికి ఈడ్చుకొచ్చారు. దుర్భాషలాడుతూ తీవ్రంగా కొట్టారు. అంతటితో ఆగకుండా ఇంటి ముందు కూర్చోబెట్టి ఆమెకు బలవంతంగా గుండుగీశారు. అప్పటికే స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. బాధితురాలిని విడిపించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఘటనపై కొన్ని సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.



## అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందజేస్తాం

ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను అందజేస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు పారుపల్లి, సారగండ్ల గూడెం, తుక్కాపురం గ్రామాలలో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించగా మండల కేంద్రంలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య పాల్గొని మాట్లాడుతూ గ్రామ సభల్లో చదివిన ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డ్ చదివి వినిపించిన పేర్లలో ఎవరైనా లబ్ధిదారులు పేర్లు రాకుంటే తిరిగి దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. గతంలో ఉన్న రైతు బీమాను యధావిధిగా కొనసాగిస్తామని తెలిపారు. గ్రామంలో ఇంటి నిర్మాణం చేపట్టిన వారికి, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణానికి, సీసీ రోడ్లకు ఇసుక అనుమతించేలా అధికారులకు ఆదేశిస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా అఖిలపక్ష నాయకులు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమీల, పిఏసిఎస్ చైర్మన్ డైరెక్టర్ జిల్లాల శేఖర్ రెడ్డి, నోముల వెంకన్న, డిఆర్‌డిఏ పిడి నాగిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీవో రాములు నాయక్, ఎంపీఓ అపర్ణ, ఏఈఓ మనీషా, ఏపీవో, ఏపిఎం రమేష్, పకీరయ్య పాల్గొన్నారు.

## ప్రజల కోసం' ప్రజాపక్షం' పత్రిక



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** ప్రజల కోసం నిరంతరంగా, నిస్వార్థంగా నిజాలను వెలికితీసి, నిర్భయంగా రాసేదే ప్రజా పక్షం జాతీయ తెలుగు దినపత్రిక అని మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మాజీ ఎంపిపి మండల కేంద్రంలో ప్రజా పక్షం 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండి పార్టీలకు కులాలకు, మతాలకు అతీతంగా వాస్తవాలను రాసి ప్రజా సంక్షేమం కోసం, సమాజ శ్రేయస్సు కోసం పత్రికలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసి రమావత్ జగన్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మూడావత్ మంగ్యానాయక్, ఎస్సి సెల్ జిల్లా కన్వీనర్ ఏకుల సురేష్, మండల నాయకులు రమావత్ తుకారాం పాల్గొన్నారు.

### ప్రజల వైపు నిలిచేదే ప్రజాపక్షం



**ప్రజాపక్షం/ హాలియా:** ప్రజా సమస్యల పరిష్కారం వైపు నిలిస్తేనే అది ప్రజాపక్షం అవుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ ఎడవెల్లి అనుపమ నరేందర్ రెడ్డి, కమిషనర్ రామదుర్గారెడ్డి అన్నారు. శుక్రవారం హాలియా మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రజాపక్షం క్యాలెండర్ ని వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రజాపక్షం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి చంద్రకళ ఆంజనేయులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, ఎడవల్లి నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు నల్గొండ సుధాకర్, వర్ర వెంకటరెడ్డి, అన్నేపాక శ్రీనివాస్, మాజీ చైర్మన్ వెంపటి శంకరమ్మ, చింతల దీప్తి చంద్రారెడ్డి, దేపావత్ ప్రసాద్ నాయక్, నల్లబోతు వెంకటయ్య పాల్గొన్నారు.

### ప్రజల పక్షమే 'ప్రజాపక్షం'



**ప్రజాక్షం/చింతపల్లి :** ప్రజలతో మమేకమై ప్రతి నిత్యం ప్రజా సమస్యలు వెలికి తీస్తూ ప్రజలపక్షం వహించే పత్రిక ప్రజాపక్షం జాతీయ దిన పత్రిక అని మండల మాజీ వైస్ ఎంపిపి యాదగిరిగౌడ్ అన్నారు. మండల పరిధిలోని వింజమూరు గ్రామంలో గురువారం ప్రజాపక్షం పత్రిక 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను యాదగిరిగౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రలజకు మధ్య పత్రికలు వారధిగా పని చేసి, ప్రజాసమస్యలు పరిష్కరించుటకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి శతృఘ్నరాజు, ప్రజాపక్షం రిపోర్టర్ ఆరెకంటి రాధాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పుల డావలయ్య, మైబు, బాలయ్య, శ్రీశైలం, శేఖర్, బుచ్చయ్య పాల్గొన్నారు.

## చెర్వుగట్టు జాతర గోడ పత్రిక ఆవిష్కరణ

**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** తెలంగాణ రాష్ట్రములో రెండవ శ్రీశైలంగా విరాజిల్లుతున్న మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రతి ఏడాది అత్యంత వైభోవోపేతంగా దేవాదాయ శాఖ నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగానే ఫిబ్రవరి 02 నుండి రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవములు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్వామి వారి బ్రహ్మోత్సవములకు సంబంధించిన ఆహ్వాన పత్రిక,వాల్ పోస్టర్లు,ప్రచార వాహనాన్ని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య గౌడ్, మాజీ జెడ్పిటిసి సభ్యులు దూదిమెట్ల సత్తయ్య యాదవ్, చెరువుగట్టు మాజీ సర్పంచ్ నేతగాని కృష్ణ, నార్కట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెర్రీపోతుల భరత్ గౌడ్, ఎండోమెంట్ సహాయ కమిషనర్ భాస్కర్, ఇఒ నవీన్ కుమార్,అధికారులు పాల్గొన్నారు.



# మతసామరస్యాలకు ప్రతీక జాన్‌పహాడ్ దర్గా ఉర్సు

ఉర్సు ఉత్సవం (గంధం ఊరేగింపు)లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(పాలకవీడు) :** హిందూ, ముస్లీంల ఆరాధ్యదైవం జాన్‌పహాడ్ సైదన్న అని అందుకే మతసామరస్యానికి ప్రతీకగా జాన్‌పహాడ్ సైదులు బాబా దర్గా నిలిచిందని తెలంగాణ రాష్ట్ర భారీనీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభివర్ణించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని పాలకవీడు మండలంలో జాన్‌పహాడ్ సైదులు బాబా దర్గా ఉర్సు(గంధం ఊరేగింపు)ఉత్సవంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ముజావర్ జానీబాబా ఇంటి వద్ద నుండి సందల్ ఖానా వరకు పవిత్ర గంధాన్ని మంత్రి ఉత్తమ్ ఎత్తుకుని ఊరేగింపుగా దర్గాకు వచ్చారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జాన్‌పహాడ్ సైదులు బాబాను దర్శించుకోవడం తన అదృష్టంగా భావించారు. ప్రజలంతా పాడిపంటలతో,సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని, మరొకసారి ప్రజలకు సేవచేసే అవకావాన్ని తమకు తమ ప్రభుత్వానికి ఇవ్వాలని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. పాలకవీడు మండలంలో ఒక్క సంవత్సరంలోనే సుమారు రూ.400 కోట్ల తో అభివృద్ధి పనులు చేపట్టామని,జాన్‌పహాడ్‌లో రూ.1కోటి 30లక్షలతో రోడ్లు,మరుగుదొడ్లు వంటి మౌళికసదుపాయాలు కల్పించామన్నారు. రూ. 270 కోట్లతో జవహర్‌లాల్ నెహ్రూ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించిన సామర్థ్యాన్ని 5600 ఎకరాల నుండి 10 వేల ఎకరాలకు నీరు అందించేలా ప్రణాళికలు సిద్దం చేయాలని ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడటం జరిగిందని,లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించిన భూమి కూడా సేకరించడం జరిగిందని తెలియజేశారు. ఇటీవలె ఆ ప్రాంతాన్ని కూడా సందర్శించడం జరిగిందని మెటల్ రోడ్డు కొరకు రూ. 1కోటి రూపాయలను మంజూరీ చేయించడం జరిగిందని తెలిపారు. 33.80కోట్ల రూపాయలతో బెట్టతండా లిఫ్ట్ ఏర్పాటుకు పనులు,భూసేకరణను మొదలు పెట్టాలని అధికారులను మంత్రి అదేశించారు. గరిడేపల్లి నుండి అలింగాపురం వరకు రూ.30కోట్లతో డబుల్ రోడ్డు,రూ. 9కోట్లతో అలింగాపురం నుండి పాలకవీడు వరకు డబుల్‌రోడ్డు,రూ.7.5 కోట్లతో బెట్టె తండా చెక్‌డ్యాంను నిర్మిస్తున్నామని,రూ.3.5 కోట్లతో బెట్టతండా నుండి శూన్యపహాడ్ వరకు పంచాయతీరాజ్ రోడ్డు,రూ.1.8కోట్లతో మూసిఒడ్డు నుండి సింగారం వరకు, పాలకవీడు మండల కేంద్రంలో ప్రజలకు సత్వరసేవలు అందించేందుకు రూ.2.6కోట్లతో తహశీల్దార్ కార్యాలయం, రూ.2.6కోట్లతో పోలీస్‌స్టేషన్,రూ.2.6 కోట్లతో ఎంపిడిఒ కార్యాలయంల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని మంత్రి వివరించారు. రూ.1.4 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మిస్తున్నామ,రూ.60 లక్షలతో త్రాగునీరు వసతి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్‌డీఓ శ్రీనివాసులు,కోదాడ డిఎస్‌పి శ్రీదర్ రెడ్డి,బెల్లంకొండ విజయలక్ష్మి నరసింహారావు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, హుస్సేని, మాజీ ఎంపిపి గోపాల్,మాజీ జడ్పిటీసీ మోతీలాల్, ముజావర్ జానీ బాబా పాల్గొన్నారు.



### ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజెయు) డైరీ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ 2025 నూతన సంవత్సర డైరీని తెలంగాణ రాష్ట్ర భారీనీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికలకు ఎంతో గౌరవం ఉందని ఆ గౌరవాన్ని కాపాడుకోవాలన్నారు. దేశంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అతిపెద్ద సంస్థగా పనిచేస్తుందని,ప్రాజాస్వామ్యాన్ని కాపాడేందుకు కృషి చేయడం గర్వకారణమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానకి తెలంగాణ ప్రజాప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోల నాగేశ్వరరావు,నరేందర్ రెడ్డి,బసవోజు శ్రీనివాసాచారి,ఎస్ఆర్‌పి గౌడ్,ఇందిరాల రామకృష్ణ,దేవరం వెంకటరెడ్డి,కొమ్రరాజు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి కాన్వాయ్‌లో తప్పిన ప్రమాదం

గరిడేపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ కార్యకర్తలు నిలబడి ఉండటంతో వారిని చూసిన మంత్రి కారు ఒక్కసారిగా ఆగింది. అది గమనించిన కాన్వాయ్‌లో వేగంగా వస్తున్న 8 కార్లు ఒకేసారి బ్రేక్ వేయడంతో ఒకదానికొకటి ఢీకొన్నాయి.



## నిరంతరంగా సంక్షేమ పథకాల కొనసాగింపు

దేవరకొండ ఎంఎల్‌ఎ బాలునాయక్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** నిరంతరంగా నిరుపేదలకు సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం కొండమల్లేపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన ప్రజా పాలన ప్రత్యేక గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు వచ్చిన జాబితా కేవలం ఒక ముసాయిదా మాత్రమే అని అర్హులైన నిరుపేదలను గుర్తించి వారందరికి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులను ఇస్తామని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దని గ్రామ ప్రజలకు సూచించారు. ఆర్డీవో రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సాగులో లేని భూములను గుర్తించి వారికి రైతు భరోసా తొలగిస్తుందని, సాగు చేసేటటువంటి రైతులందరికి రైతు భరోసా కల్పిస్తామని అన్నారు. ఏఎస్పి మౌనిక మాట్లాడుతూ ప్రజలు ఆందోళన చెందకుండా అధికారులకు సహకరించి సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మాజీ ఎంపిపి రేఖ మాట్లాడుతు మండల నిరుపేదలందరికి ఖచ్చితంగా సంక్షేమ పథకాలు అందజేస్తామని అన్నారు. ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం డిండి ఎత్తిపోతల పథకానికి అనుమతి ఇచ్చి రూ. 1800 కోట్లను మంజూరు చేస్తూ జీవో ఇచ్చిందని అన్నారు. ఈ పథకం వలన దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలలో 3.75లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందని అన్నారు. డిండి ఎత్తిపోతల అనుమతితో ఎంఎల్‌ఏ బాలునాయక్ కల సాకారం అయిందని అన్నారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని అన్నారు. రైతు బంధు గుట్టలకు, వెంచర్లకు, రోడ్లకు ఇచ్చి దుర్వినియోగం చేసిందని అన్నారు. 4 సంవత్సరములలో దేవరకొండ నియోజకవర్గానికి సుమారు 17,500 ఇండ్లు మంజూరు అవుతాయని ఎవరు అధైర్య పడవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కో ఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటయ్య, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపిటిసి బొడ్డుపల్లి సైదులు, మాజీ జెడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్ పాల్గొన్నారు.




## ప్రజలకు వాస్తవాలు చెప్పండి తప్పుతోవ పట్టించకండి

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజలకు వాస్తవాలు చెప్పండి తప్పుతోవా పట్టించకండి అని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి బృందం దావుస్ టూర్ గురించి బిఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణల పై వారు కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత్‌లో ఏ రాష్ట్రం తేని విదంగా మన తెలంగాణకు అత్యధిక పెట్టుబడులు తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. గత సీఎంకి దావుస్ అంటే తెల్వదని, సెక్రటరియేట్ తెల్వదని, ఫామ్ హౌస్ మాత్రమే తెలుసని విమర్శించారు. గత పాలకులు 9 సంవత్సరాలలో రూ.25,750 కోట్లు పెట్టుబడులు మాత్రమే తెచ్చారని, సీఎం రేవంత్ రెడ్డి ఒక్క సంవత్సరంలోనే రూ.1,78,950 కోట్లు రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చారని తెలిపారు. దీనిద్వారా సుమారుగా 50 వేల మందికి పైగా ఉపాధి పొందరన్నారు. బిఆర్‌ఎస్ నాయకులు అత్యుత్సాహం, కడుపు మంటతో తాము చేసే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక మాట్లాడుతున్నారని విమర్శించారు. మా ప్రభుత్వం చేసే కార్యక్రమంలో తప్పులు ఉంటే గుర్తు చేయండని, కాని మీ కుర్చీ మీద కోపంతో మీ విషాన్ని మా మీద చిమ్మొద్దని అన్నారు.

## ఆడపిల్లలు చదువుకుంటే ఏదైనా సాధ్యం



జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ:** ఆడపిల్లలు చదువుకుంటే ఏదైనా సాధ్యమని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు .శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణం లోని క్లాక్ టవర్ వద్ద నుండి విద్యార్థినుల ,మహిళలతో నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బేటి బచావో బేటి పడావో పై ఏర్పాటుచేసిన పోస్టర్ ను విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆడ పిల్లలను చదివించాలని, వారు చదువుకుంటే ఏదైనా సాధ్యమని అన్నారు. ప్రధానమంత్రి, ఉపాధ్యాయులు కావాలన్నా లక్ష్యాలను తేలికగా సాధించగలరని అన్నారు. ఆడపిల్లలు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. చదువు వలన కలిగే లాభాలను, ఎందుకోసం చదువుకోవాలి అనే విషయాల పట్ల కలెక్టరు విద్యార్థులను అడిగి వారిలో ఆసక్తి కలిగించారు. 2015 నుండి ప్రారంభమైన జాతీయ బాలికా దినోత్సవం పది సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలలో మహిళలకు, విద్యార్థినులకు వచ్చే మార్చి 8 వ తేదీ వరకు భ్రూణ హత్యలను నివారించడం, బాలికా విద్యను పోత్సహించడం, మహిళా సాధికారత దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, లింగ వివక్షత లేకుండా మహిళా సాధికారతను పోత్సహించడం దీని లక్ష్యాలని తెలిపారు. జిల్లా న్యాయ సేవా అధారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బి.దీప్తి మాట్లాడుతూ తల్లిదండ్రుల పెంపకంలో అమ్మాయిల పట్ల ఎలాంటి వివక్షత చూపకుండా అన్ని రంగాలలో సమానంగా పోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ చింత కృష్ణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి కృష్ణవేణి, జువైనల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ మోహన్ రావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ వెంకన్న, గర్ల్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి సరిత, సిడిపివోలు సూపర్వైజర్లు అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆడపిల్లలు భారం కాదు భవితకు సోపానం



జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్

**ప్రజాపక్షం/యాదాద్రి :** ఆడపిల్లలు భారం కాదు భవితకు సోపానం అని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం, అలాగే బేటీ బచావో బేటీ పడావో పదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఘనంగా వేడుకలను నిర్వహించారు. డీసీపీతో కలిసి అదనపు జిల్లా కలెక్టర్ గంగాధర్ జ్యోతి ప్రజ్వలన గావించి, మిషన్ శక్తి సామర్థ్య (మహిళా సాధికారత కేంద్రం) పోస్టర్లను ఆవిష్కరించి, జాతీయ బాలికా దినోత్సవ నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రథమంగా జాతీయ బాలికల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. బాలికలు నిత్యం ఎదుర్కొనే సమస్యలను అధిగమించి, జీవితంలో అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లటమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. భ్రూణ హత్యల నిర్మూలనకు పుట్టిన ఆడబిడ్డకు రక్షణ కల్పించేందుకు పీసీపీఎన్డీటీ యాక్ట్ ఉందని, ఎవరైనా సరే లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఏదైనా సమస్య ఉంటే 1098 సహాయక నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జాతీయ బాలికల దినోత్సవం నేపథ్యంలో వివిధ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాస రచన, ఆటల పోటీలు, తదితరాల్లో పాల్గొని, గెలిచిన విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో శోభారాణి, డీపీఓ సునంద, జిల్లా ఆశా ప్రోగ్రాం కోఆర్డినేటర్ వీణ, సత్యవతి, సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్వైజర్‌లు, పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## జోగులాంబ బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే జోగులాంబ బాల బ్రహ్మేశ్వర అలంపూర్ బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు దేవదాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ప్రచార సాధనలో భాగంగా ముఖ్యమైన కూడలి యందు వాల్ పోస్టర్లు అంటించి కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే తో పాటు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అతిథులకు ఆహ్వానం అందించారు. వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు కార్యక్రమాల్లో భాగంగా చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. శాంతిభద్రతల పర్యవేక్షణ పోలీసు అధికారులు చేపడుతున్నట్లు వారు తెలిపారు.

## శాసనుల్‌లో గ్రామసభ

**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** ఆరు గ్యారెంటీలో భాగంగా శాసనుల్‌లో ప్రజా ప్రభుత్వం అమలుచేస్తున్న నాలుగు పథకాలు గ్రామ సభలు నిర్వహించడం జరిగింది. ఒకటి ఇందిరమ్మ ఇండ్లు రెండు రైతు భరోసా ఉపాధి హామీ ఆత్మీయ భరోసా రేషన్ కార్డులు ఈ నాలుగు పథకాలు గురించి గ్రామసభలు చర్చించడం జరిగింది. మన గ్రామంలో పంచాయితీ ఆఫీస్ దగ్గర నోటీసు బోర్డులో ఈ నాలుగు పథకాల కాఫీలను అతికించడం జరిగింది. ఈ గ్రామ సభలో గ్రామపంచాయితీ కార్యదర్శి స్పెషల్ ఆఫీసర్ హాజరుద్దీన్, హేమబిందు , పంచాయితీ కార్యదర్శులు వినోద్‌కుమార్, రంగన్న, రాజు, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఏఎన్‌ఎం జానమ్మ, ఆశావర్కర్స్ పద్మమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ట్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు విజయ్ భాస్కర్ జీ, నరసింహులు, హెచ్ హుస్సేన్, దువాస్ పల్లి మన్నె కృష్ణనాయుడు, బోయ లక్ష్మి నాయుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.






## మోటార్ సైకిల్ ర్యాలీని విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్‌కెఎం జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈనెల 26న నిర్వహించే మోటార్ సైకిల్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎఐకెఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకటయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా వెంకట్ రెడ్డిలు రైతులకు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఎఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో ప్రభుత్వాలు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నాయన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతు అప్పులపాలు అయ్యి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రైతులకు మద్దతు ధర అమలు చేసి రుణవిముక్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం పంజాబ్ రైతులు 60రోజుల నుండి దీక్ష చేస్తున్న కేంద్రం జోక్యం చేసుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికన ప్రభుత్వం రైతుల డిమాండ్లను పరిష్కరించి దీక్షను విరమింప చేయాలని కోరారు. ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు రాంబాబు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, నాయకులు కునుకుంట్ల సైదులు, మధు, అశోక్ రెడ్డి, సింహాద్రి పాల్గొన్నారు.

## ఆర్టిజన్స్ దీక్షల విరమణ

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** టివిఎసి జెఏసి ఆధ్వర్యంలో నల్లగొండలో చేపట్టిన 5 రోజుల రిలే నిరాహారదీక్ష లను శుక్రవారం నిమ్మరసం ఇచ్చి దేవేందర్ రెడ్డి విరమింప చేశారు.ఏఐటియూసి జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఐదు రోజులు వేలాదిమంది విద్యుత్ సంస్థ కార్మికులు రోడ్లమీద ఆందోళన చేసిన ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే ఆర్టిజన్లను చర్చలు పిలిచి సమస్యకు పరిష్కారం ఆలోచించాలని వారందరిని విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టిజన్ విలీనం చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని అన్నారు. సబ్ స్టేషన్ లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని దానివల్ల పని భారం పెరిగిపోయి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్స్ ను తక్షణమే కన్వర్షన్ చేయాలని ఆర్టిజన్స్ జిల్లా కన్వీనర్ పెరిక శేఖర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో చైర్మెన్ శ్రీపతి రమేష్,జిల్లా జాయింట్ సెక్రటరీ లు జిట్టబోయినలింగస్వామి దాసరి యాదయ్య, కోషాధికారి హతీరాం నాయక్,జిల్లా నాయకులు గుండా లింగారెడ్డి,పోతెపాక విజయ్‌కాశీరాములు,చంద్రశేఖర్ రెడ్డి,సురేష్ బాబు,యూనిస్,గోవర్దన్ రెడ్డి,జిల్లా మహిళా నాయకురాళ్లు ఉమాదేవి, అరుణ,రమా,నాగమణి పాల్గొన్నారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని డిమాండ్



**ప్రజాపక్షం/చండ్రుగొండ:** అర్హులందరికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని ఉపాధి హామీ పథకం కూలీలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట తిప్పనపల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం కూలీలు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనల పేరుతో, 202324 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజుల పాటు పని చేసి ఉండాలనే నిబంధనలు తొలగించాలన్నారు. అసలైనా నిరుపేద కూలీల కుటుంబాలను గుర్తించాలని, వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారికే పథకాలు వస్తున్నాయని, అధికార పార్టీ నాయకుల జోక్యాన్ని తగ్గించాలన్నారు. నిరసన కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం కూలీలు బొల్లెపోగు వరలక్ష్మి, కాకటి హైమవతి, రెడ్డిపోతు సునీత, కాకటి ధనమ్మ, పోతురాజు పార్వతి, బొల్లెపోగు యశోద, చెంగల రాములమ్మ, రెడ్డిపోతు సునీత, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్లను గౌరవించండి..



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** విధి నిర్వహణలో ఉన్న డ్రైవర్లను ప్రతి ఒక్కరు గౌరవించాలని సత్తుపల్లి ఎం.వి.ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిఐ టి. కిరణ్, సత్తుపల్లి డిపో మేనేజర్ యు. రాజ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం సత్తుపల్లి డిపోలో డ్రైవర్స్ డే వేడుకలు డిపో మేనేజర్ యు. రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డ్రైవర్ లందరికీ గులాబీలు అందజేస్తూ డ్రైవర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎం.వి.ఐ శ్రీనివాసరావు, సి.ఐ టి. కిరణ్ లు ఉత్తమ డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి విజయ శ్రీ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్ సాహితి, టిఐ సుబ్బారావు, కాంతారావు, బాలస్వామి, ఈడబ్ల్యూబి మెంబర్స్ సైదా రెడ్డి, పద్మావతి, ఏడీసీలు, సూపర్వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** మండల పరిధిలోని మొలుగుమాడు విద్యుత్ ఉప కేంద్రంలో నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల సూచన మేరకు రాబోయే వేసవిలో పెరిగే విద్యుత్ లోడ్ అనుగుణంగా రూ.45లక్షల వ్యయంతో మొలుగుమాడు విద్యుత్ ఉప కేంద్రంలో 3ఎంవిఎ నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయటం జరిగింది. భీమవరం విద్యుత్ ఉప కేంద్రంలో రూ.8లక్షల వ్యయంతో నూతన ఫీడర్ బ్రేకర్ ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో వైరా డివిజనల్ ఇంజనీర్ బండి శ్రీనివాసరావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎం.అనురాధ, అసిస్టెంట్ ఇంజనీర్ వి.గణేష్, సిబ్బంది జార్జ్, మౌలానా, రాజేష్, చక్రి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనను చూసి ఓర్వలేకపోతున్న బిఆర్ఎస్



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం ఓరుగంటి వీరయ్య భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య మాట్లాడుతూ అసలు మీ బిఆర్ఎస్ ప్రభుత్వంలో 10 ఏళ్లు ఇండ్లు, రేషన్ కార్డులు ఇచ్చి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేదా, ఏనాడైనా ఇలా సభ పెట్టి అర్హులని ఎన్నుకున్న దాఖలాలు లేవని ప్రశ్నించారు. అనంతరం పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదే కేశవరెడ్డి మాట్లాడుఊ అసలు మీ బిఆర్ఎస్ ప్రభుత్వంలో యాదవ సోదరులకు, దళిత సోదరులకు, ముస్లిం మైనార్టీ సోదరులకు, బీసీ సోదరులకు ఆనాడు మీరు ఏ పద్ధతిలో కమిషన్లు తీసుకొని ఇచ్చారో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు అని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనతో నిరుపేదలను గుర్తించి అర్హులకు పథకాలు అందించే విధంగా ముందుకు వెళ్తుంటే ఓర్వలేక కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం సరికాదని దళితబంధుకు, గొర్రెలకు, బీసీ బందుకు, మైనార్టీలకు బిఆర్ఎస్ ప్రభుత్వంలో పథకాలకు కమిషన్లు తీసుకొని ప్రజలను ఎలా మోసం చేశారని నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు దళితబంధు పేరుతో మీరు ఏ కమిటీ వేసి నిజమైన అర్హులకి పథకాలను మీ నాయకులకే తప్ప సామాన్య ప్రజలకి పథకాలు అందజేశారా తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఓరుగంటి రమేష్‌బాబు, బట్టా సత్యనారాయణ, యక్కటి సత్యనారాయణరెడ్డి, ఆవుల రవి, చామకూరి వెంకన్న, బేతం వెంకటరమణ, రావులపల్లి నరసింహారావు,నరేష్, వెంకటేశ్వర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



**ప్రజాపక్షం/కరకగూడెం:** మండల పరిధిలోని బర్లగూడెం గ్రామ శివారున గల చెరువు గట్టు పైన చెట్టుకి ఉరివేసుకుని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. నీలాద్రి పేట గండి గోత్తి కోయ గ్రామానికి చెందిన కుంజా ఇడుమయ్య (48) సుమారు రెండు సంవత్సరముల నుండి మతిస్థిమితం కోల్పోయి గతంలో రెండు సార్లు ఇంటి నుండి వెళ్లిపోగా తన కుటుంబ సభ్యులు అతని వెతికి పట్టుకుని ఇంటికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయాన్నే మతిస్థిమితం కోల్పోయిన ఇడుమయ్య ఇంటి నుండి బయటకు వెళ్లిపోయి బర్లగూడం ఊరి చివరన చెట్టుకి ఉరేసుకొని మృతిచెంది కనిపించాడు. ఈ విషయంపై అతని భార్య కుంజా పొజ్జమ్మ ఫిర్యాదు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతీఒక్కరి బాధ్యత



ఎమ్మెల్యే ఆదినారాయణ



**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** పరిసరాల పరిశుభ్రత బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని అశ్వారావుపేట ఆర్టిసి బస్టాండ్ ఆవరణంలో శుక్రవారం ఉదయం స్వచ్ఛ ఆర్టిసిలో భాగంగా బస్టాండ్ ఆవరణంలోని పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రయాణీకులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**గ్రామసభలో అధికారుల తీరుపై ఎమ్మెల్యే జారె ఆగ్రహం**

**అధికారులుపై కలెక్టర్‌కు ఫిర్యాదు**

అశ్వారావుపేట మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన గ్రామ సభ నిర్వహణలో అధికారుల అలసత్వంపై ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 8గంటలకు గ్రామ సభ షెడ్యూల్ నిర్వహించాల్సి ఉండగా హాజరైన ఎమ్మెల్యే సభా వేదికపై అధికారులు ఎవరూ లేకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్‌కు సభావేదిక నుండి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. పంచాయతీ, ఉపాధిహామీ, వ్యవసాయశాఖ అధికారులు మినహా ఇతర అధికారులు రాలేదని, వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే గ్రామ సభను ప్రారంభించిన ఎమ్మెల్యే జారేకు ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సమయానికి గ్రామస్తులు ఎవరూ రాకపోయిన గ్రామ సభలో ప్రభుత్వ పథకాల పనితీరుపై మాట్లాడారు. అనంతరం ఇతర గ్రామాల్లో జరుగుతున్న గ్రామ సభలకు వెళ్లిపోయారు

## పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్:** శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు సిబ్బందికి వృత్తిపరమైన పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ టానాకు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పైన ఉన్న డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కోఆర్డినేషన్ సెంటర్ను సందర్శించారు. ఇప్పటి వరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లలో నమోదైన సైబర్ నేరాల వివరాలను అట్టి కేసుల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లాలోని పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం పాటిస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ అధికారులకు సూచించారు. కంటికి కనపడకుండా ఆన్లైన్ ద్వారా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ జితేందర్, ఎస్సైలు రవి, జుబేదా బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

## చెడు అలవాట్లకు దూరంగా విద్యార్థులు



**ప్రజాపక్షం/ఏన్కూరు:** విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అడిషనల్ జాయింట్ కలెక్టర్ శ్రీజ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్నారి ప్రోగ్రాం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు, మంచి స్పర్శ, చెడు స్పర్శ, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.
పదో తరగతి విద్యార్థులు 10/10 జిపిఏ సాధనకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కోరారు. కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కలిగించారు. కృషి పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూరాకుల సైదయ్య, డాక్టర్ మౌనిక, డాక్టర్ లాస్య, గురుప్రసాద్,అరుణ, పుష్పరాణి, లీగల్ సెల్ అంజలి, సఖి, సరిత, ఉపాధ్యాయులు కస్తూరి విజయ లక్ష్మి, పుల్లయ్య, శంకర్‌రావు, చంద్రప్రకాష్, వర్జినియా, రాంబాబు, నర్సింహారావు, సులోచన, భీమ్‌సింగ్, హత్తిరామ్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు

## అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తాం: షేక్ జానిమియా



**ప్రజాపక్షం/బోనకల్:** అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందిస్తామని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ జానీమియా తెలిపారు. మండలంలోని ముష్టికుంట్లలో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను గ్రామసభల ద్వారా ఎంపికచేస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పథకం అందేలా గ్రామ కాంగ్రెస్ కమిటీ, ఇందిరమ్మ కమిటీలు కృషి చేస్తాయని తెలిపారు. జాబితాలో పేర్లు రానివారు ఆందోళన చెందవద్దని, ఈ జాబితా చివరి కాదని అన్నారు. అర్హులు ఉంటే మరో మారు దరఖాస్తు చేసుకోవాలని, అధికారులు పరిశీలించి రానున్న రోజుల్లో పథకాలలో ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను అధికారులే పారదర్శకంగా ఎంపిక చేస్తున్నారని అన్నారు. మిత్రపక్షమైన సిపిఐలో అర్హులైన వారికి ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. దీంతో పాటు సిపిఎం, టిడిపి, టిఆర్ఎస్, జనసేన, బిజెపి, వైఎస్సార్‌సిపి, వైఎస్సార్‌టిపిలు తెలిపే సూచనలను తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, నాయకులు బోయినపల్లి మురళి, షేక్ షాజహాన్, బోయినపల్లి వెంకటేశ్వర్లు, షేక్ ముస్తాఫా, మహిళ నాయకురాలు అమరేసి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభం



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపలి:** లక్ష్మీ దేవిపల్లి మండల కేంద్రంలో ముస్లీం మైనార్టీ విభాగం జిల్లా కార్యాలయాన్ని శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొదెం వీరయ్య ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో ముస్లీంల సంక్షేమం అభివృద్ధి, హక్కుల కోసం పాటుపడేది కేవలం కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలను కన్నబిడ్డలా కాపాడుకుంటుందని అన్నారు. దేశంలో సోనియాగాంధి, రాహుల్ గాంధి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని అన్నారు.రాబోయే రోజుల్లో మతోన్మాద బిజెపి మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని అన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రజాపాలన ప్రభుత్వం సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో నూతన రెవిన్యూ చట్టం భూభారతి అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని అన్ని రకాల భూమి సమస్యలు తొలగిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండి.ఖాన్, పిసిసి సభ్యులు ధర్మారావు, నాగ సీతారాములు, మాజీ జెడ్పీ చైర్మన్ కంచర్లచంద్రశేఖర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవిప్రసన్న, పిఏసిఎస్ చైర్మన్ హనుమంతరావు, మైనార్టీ నాయకులు నయామ్ కురేషి, జిల్లా మైనార్టీ కార్యదర్శి గౌస్‌పాషా తదితరులుపాల్గొన్నారు.

## సర్వే, అర్హుల జాబితాకు పొంతనేది?



**ప్రజాపక్షం/బోనకల్:** ప్రజాపాలన దరఖాస్తులకు, సామాజిక ఆర్థిక సర్వేకి గ్రామ సభల్లో ప్రకటించిన జాబితాకు పొంతనేదని, నిరుపేదలకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో తహసీల్దార్ అని శెట్టి పున్నం చందర్‌కు పలు వినతులతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్లకు అనేకమంది నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నారని, వీటిని అధికారులు సర్వే చేసి జాబితా పంపారన్నారు. కానీ ఆ జాబితాలో సెంటు భూమి లేని వారికి ఇందిరమ్మ ఇళ్లలో చోటు దక్కలేదని, భూములు కలిగిన వారికి దక్కిందన్నారు. అధికారులు భూములు, స్థలాలు, ఆదాయ వనరులు ఉన్నా కుటుంబాలకు రేషన్‌కార్డుల అర్హుల జాబితాలో చేర్చారని అన్నారు. అర్హత కలిగిన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అమలుచేయాలని, నిజమైన అర్హులను గుర్తించి వారికి మాత్రమే న్యాయం చేయాలని కోరారు. అనర్హులను జాబితా నుండి తొలగించాలని తహసీల్దార్‌ను ఈ సందర్భంగా ఆయన కోరారు. ప్రభుత్వం సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ సంవత్సరం నాలుగు నెలలుగా ప్రజలను మభ్యపెడుతూ కాలం గడుపుతుందని కోరారు. జనవరి 26న అర్హులైన ప్రతి ఒక్కరి పథకాలు మంజూరు చేయాలని, లేనియెడల సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, నాయకులు గుంపుల జయరాజు, ఏఐవైఎఫ్ నాయకులు యంగల గిరి, టిడిపి నాయకులు గొల్లపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుభద్రత ప్రతీఒక్కరి బాధ్యత



ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు

**ప్రజాపక్షం/ఖమ్మంక్రైం :** రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు అన్నారు. రోడ్డు భద్రాతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఆవరణలో నేహ్రు యువకేంద్రం, ప్రభుత్వ మహిళ డిగ్రి కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధునిక ప్రపంచంలో రవాణా, రోడ్డు ప్రతి ఒక్కరికి నిత్యసరంగా మారిందన్నారు. జనాభాతో సమానంగా వాహనాలు పెరిగి రోడ్లు రద్దీగా మారాయన్నారు. చట్ట పరంగా ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కొందరు వాహన చోదకుల నిర్లక్ష్యం వలన ప్రమాదాల భారిన పడి రోడ్డు పై వెళ్తున్న సామాన్యుల ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వేల సంఖ్యలో ప్రాణాలు పోతుండగా లక్షల సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారన్నారు. దీని ప్రధాన కారణం ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటమేనన్నారు. ఏడాదికి కోటి యాబై లక్షల మంది వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని లెక్కలు చెపుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు అరికట్టవచ్చన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు డ్రైవర్లు సిటు బెల్ట్ విధిగా ధరించాలన్నారు. రోడ్డు భద్రత ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై డ్రంకెన్‌డ్రైవ్‌లు నిర్వహిస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కారు ప్రమాదాల భారిన పడుతున్నవారు మధ్య వయస్కులే ఎక్కువగా ఉంటున్నారన్నారు. అతివేగం, సెల్‌ఫోన్, డ్రంకెన్ డ్రైవ్ చట్టరిత్య నేరమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ మోహన్‌బాబు, ఆర్ఐ సాంబశివరావు, నెహ్రూయువకేంద్రం ప్రోగ్రాం ఆఫిసర్ భానుచందర్, ఎన్ఎస్ఎస్ పిఓలు రామకుమారస్వామి, శ్యామలాదేవి, షారుఖ్ ఇమ్రాన్, మహిళ డిగ్రి కళాశాల అధ్యాపకురాలు సునందా, అటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎండిన చెట్టుతో పొంచి ఉన్న ప్రమాదం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని తిరువూరు రహదారిలో ఆర్అండ్‌బి రహదారిపై మారెమ్మ తల్లి దేవాలయం వద్ద ఎండిన చెట్టుతో ప్రమాదం పొంచి ఉంది. ఈ రహదారిలో రాకపోకలు చేస్తున్న ప్రజలు వాహనదారులు ఎప్పుడు ఎవరి మీద పడుతుందో భయంతో ఉన్నారు. ఈ రహదారిలో తెలంగాణ,ఆంధ్రాకు చెందిన ప్రజలు నిత్యం ప్రయాణం చేస్తూ ఉంటారు. ఈ సమయంలో ప్రమాదకరంగా ఉన్న చెట్టును తీసివేయాలని ఆర్అండ్‌బి అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బి జేఈ రవిచంద్రను వివరణ కోరగా తీసివేపిస్తామని ఎవరికి ఇబ్బంది లేకుండా చేస్తామని తెలిపారు.

## ఆయిల్ పామ్‌తో సిరులు ఎవరికి? రైతులకా.. అధికారులకా!

ఆఫ్‌టైప్ మొక్కలతో రైతులు అతలాకుతలం..
అధికారులకు వరం...
స్థాన చలనం లేని అధికారులురూ. కోట్లు కూడబెడుతున్నారు...
సాగును నమ్ముకున్న రైతులు దివాళా తీస్తున్నారు...



**ప్రజాపక్షం/సత్తుపలి:** ఆయిల్ ఫామ్ సాగుతో రైతన్న ఇంట సిరులు కురిపిస్తాయంటూ రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలను ఆయిల్ ఫామ్ సాగు వైపు మరల్చుతుంది. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలతో పాటు ప్రకృతి వైపరిత్యాలను తట్టుకుని ఆయిల్ ఫామ్ సాగు రైతన్నలకు లాభం చేకూర్చుతుండటంతో రైతన్నలు సైతం ఆయిల్ ఫామ్ సాగు వైపు మళ్ళుతున్నారు. అంతా బాగానే ఉన్నా ఆచరణలోకి వచ్చేసరికి ఆయిల్ ఫామ్ సాగును నమ్ముకున్న రైతులు దివాళ్ళా తీస్తుండగా, మొక్కలను అందిస్తున్న ఆయిల్ ఫెడ్ అధికారులు కోట్లు కూడబెడుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు. అధికారులు ఇచ్చిన మొక్కలను తెచ్చి నాటి 4 నుండి 5 ఏండ్లు సాగుచేస్తే చివరికి దిగుబడి రాకపోగా చావు కబురు చల్లగా తెలిసినట్లు మొక్కలు ఆఫ్ టైప్ గా తేలుతున్నాయని, దీంతో భారీగా నష్టాలు వస్తున్నాయని, అయితే తమకు మొక్కలు అందిస్తున్న టిఎస్ ఆయిల్ ఫెడ్ అధికారులు మాత్రం ఈ మధ్య కాలంలోనే లక్షలు పోగేసుకుంటూ కోట్లకు పడగలెత్తుతున్నారని మండిపడుతున్నారు. 10 నుండి 15 ఏళ్లుగా టీఎస్ ఆయిల్ ఫెడ్ లో విధులు నిర్వహిస్తున్న అధికారులు శాఖలోని లొసుగులను ఒడిసి పట్టుకుని, రైతన్నల నెత్తిన చెయ్యి పెడుతున్నారని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టిఎస్ ఆయిల్ ఫెడ్ లో విధులు నిర్వహిస్తున్న అధికారుల గతంలోని ఆస్తుల కంటే ఇప్పుడు మూడు రెట్లు పెరిగాయని, వీరికి హైదరాబాద్ హెడ్ ఆఫీస్ లోని అధికారులు సైతం ఊతమిస్తుండటంతో ఇక్కడి అధికారులది ఆడిందే ఆట, పాడిందే పాటగా మారిందంటున్నారు రైతులు, రైతు సంఘం నాయకులు. గత కొంత కాలం క్రితం డివిజన్ స్థాయి అధికారి బదిలీపై వెళ్లినా, పట్టుమని 10 నెలలు కూడా ఉండకుండా హైద్రాబాద్ నుండి లాబియింగ్ చేపించి, తిరిగి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు బదిలీ చేయించుకున్నారని వీళ్ళందరి కన్నుసన్నలోనే ఆప్ టైప్ మొక్కలు రాజ్యమేలుతున్నాయని రైతన్నలు బాహటంగానే విమర్శిస్తున్నారు. గత కొన్ని రోజులుగా పత్రికలలో ఆయిల్ ఫామ్ నర్సరీలలో సీడ్ లింగ్స్ బాగోతం బయటకు రావటంతో తమ తలలకు చుట్టుకోకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కొందరు అధికారులు బదీలలకు పావులు కదుపుతున్నారని, వారికి పై స్థాయి అధికారుల సహాయం, సహకారాలు అందించి వారిని అక్రమాల నుండి తప్పించి, కింది స్థాయి ఉద్యోగులను బలి చేస్తున్నట్లు గుస, గుసలు వినిపిస్తున్నాయి. ప్రస్థుతం బదిలీకి పావులు కదుపుతున్న అధికారి తమ బంధువులు పేరుతో ఆస్తులు గట్టిగానే కూడబెట్టినట్లు సమాచారం. ఆయిల్ ఫామ్ సాగును సుమారు 8 ప్రైవేట్ కంపెనీలు నిర్వహిస్తున్నా, ఆ ఎనిమిది కంపెనీల ద్వారా రైతులకు అందుతున్న ఆయిల్ ఫామ్ మొక్కలలో ఏ ఒక్క దగ్గర కూడా రైతులకు ఆఫ్ టైప్ మొక్కలు వచ్చిన దాఖలాలు కనిపించడం లేదని, కానీ ప్రభుత్వం ద్వారా నడుస్తున్న టీఎస్ ఆయిల్ ఫెడ్ లో మాత్రం లక్షల మొక్కలు ఆఫ్ టైప్ గా రూపాంతరం చెంది రైతన్నలను నిలువునా ముంచుతున్నాయని వాపోతున్నారు. అనుభవం ఉన్న అధికారులు ప్రభుత్వం నుండి జీతాలు తీసుకుంటూనే, కమీషన్లకు కక్కుర్తి పడి నాణ్యమైన మొక్కలు రాకుండా చేస్తున్నారని మండిపడుతున్నారు. రేగళ్లపాడు నర్సరీలో జరిగిన ఘటనకు ఇద్దరు ప్రైవేట్ సిబ్బందిని బలి చేసి చేతులు దులుపుకోవాలని చూస్తుండటం విడ్డూరంగా ఉందని, దీనికి ప్రైవేట్ వ్యక్తులు ఏ విధంగా బాధ్యత వహిస్తారని, ప్రభుత్వ సిబ్బంది కనుసన్నలోనే అంతా నడిచి ఉంటుందని ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులు ఆరోపిస్తున్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ ఆయిల్ ఫెడ్ ఆద్వర్యంలో నడుస్తున్న నర్సరీలో వస్తున్న ఆఫ్ టైప్ మొక్కలపై ఓ కమిటీని, ఆయిల్ ఫెడ్ అధికారులతో సంబంధం లేకుండా ఏర్పాటు చేసి నిజాలను నిగ్గు తేల్చి అక్రమార్కుల ఆట కట్టించాలని ఆయిల్ ఫామ్ రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## ఘనంగా నాలెడ్జ్ హబ్ దినోత్సవం

ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధిః నగరంలోని వావిలాలపల్లిలో గల అల్ఫోర్స్ ప్రైమరీ పాఠశాలలో నాలెడ్జ్ హబ్ దినోత్సవంతో పాటు జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే సామాజిక అవగాహన పెంపొందించాలన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సంధర్భంగా బాలికలతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు. బాలికల సాధికారికత ద్వారా దేశంఅభివృద్ధి చెందుతుందన్నారు.సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విరాళం



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః ఫిబ్రవరి 2 నుంచి 10వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో గల శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణకు తనవంతుగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా.వి.నరేందర్‌రెడ్డి రూ.15 లక్షల విరాళాన్ని ప్రకటించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం ఆలయ ఆవరణంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ప్రకటించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు.

## విజేతలకు బహుమతులు




ప్రజాపక్షం/కొత్తపల్లిః తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నగునూరులో జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీలకు చిత్రలేఖన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. మాలతి, వైస్ ప్రిన్సిపాల్ డా.జి.సమత, సీనియర్ అధ్యాపకులు పద్మజ, ఎర్రోజు వెంకటేశ్వర్లు, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.గీతారాణి, సంధ్యారాణిలు పాల్గొన్నారు.



రామగిరి ః రామగిరి మండలం వెంకట్రావు పల్లె అంగన్ వాడి1 సెంటర్ లో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ పల్లె అనిత మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం ఇవాళ్ళని సూచించారు. చిన్నపిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. మొక్కలు నాటారు. లబ్ధిదారులంతా ప్రతి ఇంటిలో ఒక మొక్క నాటాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ హేమలత పాల్గొన్నారు.

## ఇళ్ల జాబితా తప్పల తడక!



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండలంలోని బొప్పాపురం గ్రామసభ శుక్రవారంతో ముగిసింది.ఇందిరమ్మ ఇళ్ళ జాబితా తప్పుల తడకగా నడుస్తుందని బిల్డింగ్‌లో కిరాయిలకు ఉంటే కూడ ఇందిరమ్మ ఇళ్ళు అధికారులు కట్ చేశారని గ్రామస్థులు ఆరోపించారు.పూర్తి స్థాయిలో పరిశీలన చేసి నిజమైన అర్హతగల వారికి ఇళ్ళ జాబితా మళ్ళీ ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు.గ్రామ సభలో గందరగోళం నెలకొనడంతో పోలీసులు నిఘాను పటిష్టం చేశారు. చివరి రోజు కావడంతో రాజన్నసిరిసిల్లా జిల్లా ఎస్పి అఖిల్‌మహాజన్ పటిష్ట చర్యలు ఏర్పాటు చేశారు. బొప్పాపూర్‌లో ఆయన పర్యటించారు. రానివారి జాబితాను పరిశీలించి అర్హులైన వారికి తప్పకుండా రెండోదఫాలో వస్తాయని ఆందోళన చెందవద్దని ఇది నిరంతరంగా కొనసాగుతాయని అధికారులు ప్రకటించారు.పెంకుటిల్లు,రేకులు అని రాసిన వారికి వచ్చాయని ఆవేదన చెందారు.దరఖాస్తు పెట్టుకోవాలని ఏమైన సవరణలు ఉంటే మళ్ళీ చూస్తామని పంచాయితి సిబ్బంది అన్నారు.సీఐ శ్రీనివాస్‌గౌడ్,ఎస్సై రమాకాంత్, ఎంపీడీవో సత్తయ్య,ఆర్ఐ చంద్రగిరి సంతోష్,కార్యదర్శి పంతుల వారి సంతు,ఏఈవో అనూష,ఏఎంసీ చైర్మెన్ సబేరాబేగం,ప్రజాప్రతినిధులు నర్సయ్య,లక్ష్మారెడ్డి,షేక్‌సాహెబ్ గ్రామస్థులు ఉన్నారు.

## ఏరియా ఆసుపత్రికి కేంద్ర బృందం



ప్రజాపక్షం/వేములవాడ: వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి నీ సందర్శించిన కేంద్ర బృందం పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ కి చెందిన కేంద్ర వైద్య బృందం వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి నీ శుక్రవారం సందర్శించి ఆస్పత్రిలో అందుతున్న వివిధ రకాల వైద్య సేవలను పలు రికార్డులను పరిశీలించారు. సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బృందంలో డా.ఫ్రాన్సిస్ జేవియర, డా. డాంగ్,ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పెంచలయ్య, డా.సుభాషిణి, నర్సింగ్ సూపెరిండెంట్లు అంజమ్మ, సుందరి, సంజీత మరియు నాగరాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పాలకమండలి సభ్యులకు సన్మానం

ప్రజా పక్షం /వేములవాడ టౌన్: వేములవాడ మున్సిపల్ పాలకవర్గం కాల పరిమితి రెండు రోజుల్లో ముగియనుంది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజుల ఆధ్వర్యంలో చివరి సమావేశాన్ని నిర్వహించారు.భారత రాష్ట్ర సమితి వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహారావు చైర్‌పర్సన్‌తో పాటు పాలకమండలి సభ్యులు, కోఆప్షన్ సభ్యులను సత్కరించారు. చల్మెడ లక్ష్మీ నరసింహారావు మాట్లాడారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టూరిజం సర్కిల్‌గా సర్వాయికోట

### మంత్రి పొన్నం ప్రభాకర్




ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధిః సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను దేశానికి చాటి చెబుతామని, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సర్వాయిపేటలోని సర్వాయికోటను టూరిజం సర్కిల్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. సైదాపూర్ మండలం సర్వాయిపేటలో రూ.4 కోట్ల 70 లక్షలతో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కోట పర్యాటక అభివృద్ధికి భూమి పూజ చేశారు. సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాబోయే తరాలు సర్దాయి పాపన్న తెలివి, ధైర్యం, తెగువను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అరాచకానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి సామాజిక న్యాయం కోసం పోరాడిన సర్వాయి పాపన్న నేలని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడి హనుమంతుడి గుడి, మహమ్మదాపూర్‌గుట్ట, మహాసముద్రం గండిని అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని టూరిజం సర్కిల్‌గా మారుస్తామని తెలిపారు. సర్వాయిపాట కోట పనులు పూర్తయ్యాక ముఖ్యమంత్రితో ప్రారంభోత్సవం చేస్తామన్నారు.

**వెన్నంపల్లిలో సహకార సంఘ భవనం, గోదాం ప్రారంభం**

వెన్నంపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవన కార్యాలయం ప్రారంభించిన అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. విద్యార్థి విభాగం నుంచి వచ్చిన తాను సహకార రంగంలో సేవ చేశానన్నారు. రైతు బిడ్డనైన తనకు రైతు అవసరాలు తెలుసన్నారు. రాజకీయాలకు, సహకార సంఘాలకు సంబంధం లేదని, సహకార సంఘాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు. వరద కాలువ ఫేస్ 2 ద్వారా సైదాపూర్, చిగురుమామిడి మండలాలకు సాగునీరు అందించనున్నామని తెలిపారు.

**మోడల్ స్కూల్ అభివృద్ధికి రూ.60 లక్షలు**

సైదాపూర్‌లోని మోడల్‌స్కూల్‌లో అభివృద్ధి పనులకు రూ. 60 లక్షలు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులతో మాట్లాడారు. కలెక్టర్ పమేలా సత్పతి, అడిషినల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్, సహకార సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి, తిరుపతిరెడ్డి ఉన్నారు.

## 28న 'ఎన్‌టిపిసి' ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాపక్షం/గోదావరిఖని: రామగుండంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న 2,400 మెగావాట్ల ఎన్టీపీసీ తెలంగాణ విద్యుత్తు ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి ఈనెల 28న ఎన్టీపీసీ జ్యోతినగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టనున్నారు. శుక్రవారం రామగుండం కమీషనరేట్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం విజయవంతం, భద్రత ఏర్పాట్లపై ఎన్టీపీసీ రామగుండంతెలంగాణ విద్యుత్తు ప్రాజెక్టు హెడ్, సీజీఎం చందన్‌కుమార్ సమంత, పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణు, డీసీపీ చేతనలతో కలిసి రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఎన్టీపీసీ, రెవెన్యూ, పోలీసు, సంబంధిత ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ ఉన్నారు.

## పౌర హక్కులు కాపాడేది కాంగ్రెస్ పార్టీయే

### కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మహేందర్‌రెడ్డి



ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి ః తెలంగాణలో ప్రజలు కోల్పోయిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు పౌర హక్కులను కాపాడే పార్టీ ఈ దేశంలో ఏదైనా ఉం దంటే అది కాంగ్రెస్ పార్టీ అని సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల పాలనలో ఏ ఒక్క రేషన్ కార్డు అయిన ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా గ్రామసభలను నిర్వహిస్తూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా అప్లికేషన్లు స్వీకరిస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 26 వేల కోట్లతో రుణమాఫీ చేశామన్నారు. వారు చేసిన 70వేల కోట్ల రూ.ల అప్పుకు వడ్డీ కడుతున్నామన్నారు. అభివృద్ధిని సంక్షేమాన్ని రెండు కళ్లలాగా చూస్తూ ఎక్కడా కూడా తగ్గకుండా చేస్తున్నామని అన్నారు. ఇవన్నీ ఎదుర్కొంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరు పథకాలను అమలు చేస్తుందన్నారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఉండా కూలిపోతుందని మాట్లాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, గడ్డం నర్సయ్య, కల్లూరి చందన, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త



ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం, డైవర్స్ దే సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు. ర్యాలీ నిర్వహించి. స్థానిక కొత్త బస్టాండ్ సర్దార్ వల్లభాయ్ పటేల్ చౌరస్తా వద్ద కళాబృందం ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనా నడపాలని పాటలు పాడుతూ అవగాహన కల్పించారు కళాబృందాల సభ్యులు.ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత మాట్లాడుతూ రోడ్డు ప్రమాధలు, కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడుపాలన్నారు.హెల్మెట్, సిట్ బెల్ట్ ధరించి డ్రైవింగ్ చేయాలన్నారు.డ్రైవర్స్‌డే సందర్భంగా విద్యార్థులు పూలనిస్తూ డీఎం సునీత డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ టి సి అధికారులు, డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు అండగా కాంగ్రెస్

ప్రజాపక్షం/ సారంగాపూర్ ః సారంగాపూర్ మండలం పెంబట్ల, సారంగాపూర్, ఆర్పపల్లి, లక్ష్మిదేవి పల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు జరిగాయి. లక్ష్మి దేవిపల్లి గ్రామసభలో శుక్రవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన రైతుకు అండగా నిలిచే ప్రభుత్వం అన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు, గుడిసెలు ఉన్న వారికి, వికలాంగులకు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎంపిడివో చౌదారపు గంగాధర్, డిప్యూటీ తహశీల్దార్ రాజశేఖర్, పిఎసిఎస్ చైర్మన్ నరసింహ రెడ్డి ఉన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ప్రజాపాలన గ్రామ సభలు



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: జగదేవ్‌పూర్ మండలంలో ఈ నేల 21 నుండి ప్రారంభమైన ప్రజాపాలన గ్రామ సభలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయి. జగదేవ్‌పూర్ గ్రామపంచాయతీ మినహా అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహించిన గ్రామ సభలు ప్రశాతంగా ముగిశాయి. 29 గ్రామ పంచాయతీలలో ఇందీరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందీరమ్మ ఆత్మీయ భరోసా తదితర సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక సజావుగా కొనసాగింది. కాగా ఈ నేల 26 లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్న దృష్ట్యా అధికారులు అయా గ్రామాలలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు గ్రామాలలో రేషన్ కార్డులను అందజేసేందుకు జాబితాలను సిద్ధం చేసే పనిలో అయా శాఖల అధికారులు నిమగ్నమయ్యారు.

## విజేతలకు అభినందన

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః రిపబ్లిక్ డేను పురస్కరించుకుని న్యాయవాదుల బాల్ బ్యాడ్మింటన్ పోటీలను కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో పోటీలు ప్రారంభించగా ఏడు టీంలుగా ఏర్పడి పోటీలు జరుగగా ఫైనల్‌లో డిజె 11పై స్పోర్ట్స్ సెక్రటరీ టీం విజయం సాధించింది. స్పోర్ట్స్ సెక్రటరీ టీంలో మంద రవీందర్, కొట్టె తిరుపతి,గోనెపల్లిశ్రీనివాస్,జ్ఞానేశ్వర్,పెంచాలవిశాల్, రామాంజనేయులు, నోమురాజ్, పెరుక రంగయ్య, ఎం.శ్రీధర్, శేఖర్ జట్టు విజయం సాధించింది. డిజె 11టీంలో సయ్యద్ మోబిన్, జిత్తు సృజన్, గొంటి మధు, ఎస్.వేణు, ఆర్.ఈశ్వర్, కొత్త ప్రకాష్, గుజ్జ సతీష్, ఆర్.దేవేందర్, జూలూరి శ్రీరాములు, గౌతం రాజులు రన్నర్స్‌గా నిలిచారు.కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పివి రాజ్ కుమార్, బేతి మహేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. బాల్ బ్యాట్మింటన్ ఇంచార్జి గుడిపాటి సత్యం రెడ్డి వ్యవహరించారు. విజేతలకు రిపబ్లిక్ దే రోజు జిల్లా జడ్జి బి.ప్రతిమ బహుమతులను అందజేస్తారన్నారు.



## గొప్ప లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజా పక్షం/పెద్దపల్లి ప్రతినిధి ః బాలికలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవం వేడుకలలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ గతంలో బాలికలకు విద్య అవకాశాలు చాలా తక్కువగా ఉండేవని, ఆ పరిస్థితి నేడు మారి బాలికలకు సమానంగా విద్యా అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు.మనకు అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని, బాలికలు ఈ రంగంలో రాణించలేరు అనే అపోహలను తొలగించే దిశగా బాలికలంతా విద్య, వైద్యం, క్రీడలు, సాంస్కృతిక, మొదలైన వివిధ అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. బాలికలను సం రక్షించాలని, వారిని చదివించాలని బాల్య వివాహాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నేటి బాలికలు ఉన్న అవకాశాలను వినియోగించుకుంటూ భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు, క్రీడాకారులుగా, వివిధ రంగాలలో పెద్దస్థాయికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాలిందిని, జిసిడిఓ జి. కవిత, పెద్దపల్లి సీడీపీవో కె. కవిత, సంపదకుమారి ,అంగన్వాడీ సూపర్విసర్లు ప్రేమలత, పుష్పాలత, డిసిపిఒ పి. కమలాకర్, పోషన్ అభియాన్ కోఆర్డినేటర్ కె. అనిల్, సఖి కోఆర్డినేటర్ డి. స్వప్న, చైల్డెన్ కోఆర్డినేటర్ బి. ఉమాదేవి, మహిళా సాధికారత ఫైనాన్షియల్ లిటరసీ ఎస్.సంధ్య, అకౌంటెంట్ సమత, ఐసిపిఎస్, సఖి బృందాలు పాల్గొన్నారు.

**పనులు సకాలంలో పూర్తి**

పెద్దపల్లి ప్రతినిధి ః పంచాయతీరాజ్ శాఖ పరిధిలో నూతనంగా మంజూరు చేసిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఆయనమాట్లాడుతూ గ్రామీణ పంచాయతీ రాజ్ విభాగానికి సంబంధించి పురోగతి ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు.ఇఇపంచాయతీరాజ్ గిరీష్ బాబు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు

### సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వడిగ్రీ కళాశాల మైదానంలో గతతంత్ర దినోత్సవ ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలసి కలెక్టర్ సందర్శించారు. మైదానంలో స్టేజీ ప్రక్కన విఐపి, మీడియా ఇతర ప్రజాప్రతినిధులు సిట్టింగ్ అరెంట్‌మెంట్స్ గురించి తగు సూచనలు చేశారు.జాతీయ జెండా ఆవిష్కరణ, గౌరవవందనం, పరేడ్ పరిశీలన,ప్రోటోకాల్ కల్చరల్ ప్రోగ్రామ్స్ తదితర అంశాల గురించి అధికారులకు తగు సలహాలు, సూచనలు చేశారు. మైదానంలో అందరికి డ్రింకింగ్ వాటర్ సౌకర్యాంతో పాటు పారిశుద్య ఏర్పాట్లు సైతం పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రీత్‌కుమార్‌కు తెలిపారు.శకట ప్రదర్శన, సంబంధిత ఏర్పాట్లు చూసుకోవాలని అర్బన్ తహశీల్దార్ సలీంకు తెలిపారు. మైక్ సిస్టమ్‌తో పాటు కల్చరల్ ప్రోగ్రామ్స్ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఐఅండ్‌పిఆర్ డిప్యూటీ ఈఈకి సూచించారు. పోలీస్ పరేడ్ చుట్టు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎఆర్ఆడిషనల్ డిసిపి సుభాష్‌చంద్రబోస్‌తెలిపారు.ఆర్డీఓ సదానందం, ఎసిపి మధు, కలెక్టరేట్ ఎఓ అబ్దుల్ రహమాన్,డివిపిఆర్ఓ రవికుమార్, ఐఆర్ ఈఈ భూపాల్ పాల్గొన్నారు.

## 6గ్యారంటీల అమలు పూర్తి స్థాయిలో కాలేదు




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి ః ఎన్నికల సమయంలో ప్రజలకు 6గ్యారంటీ పథకాల అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని, సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. శుక్రవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సిపిఐ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని, అందరికి రుణమాఫీ చేయలేదని, కౌలు రైతులకు రైతు భరోసా 15వేలు ఇస్తామన్న మాట ఏమైందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత రైతు భరోసా కేవలం 12వేలు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అది కూడా ఒక పంటకు 6వేలు మరో పంటకు 6వేలు ఇస్తానంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంతం రవి, జిల్లా నాయకులు శ్రావనపల్లి మల్లేశం, బాచుపల్లి శంకర్, రాములు, రాజేందర్, బాలనగర్ శంకర్, రాజయ్య, మల్లేశం, రాజయ్య, రాజేందర్, రమేష్, నారాయణ ఉన్నారు.

# గ్రామసభలో ప్రోటోకాల్ రగడ



ప్రజాపక్షం/మల్లాపూర్ః రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలను గుర్తించి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామసభలు కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్ నాయకుల రాజకీయ రణరంగానికి వేదికలుగా రంగు పుసుకుంటున్నాయి. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభకు స్థానిక ఎంఎల్ఏ కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావులు హాజరయ్యారు. సభ సాగుతున్న సమయంలో గ్రామ సభ కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎంఎల్ఏ కల్వకుంట్ల సంజయ్ ఫోటో లేకపోవడంతో ప్రోటోకాల్ పాటించలేదని బిఆర్ఎస్ నాయకులు ప్రశ్నలే లేవనెత్తగా, అది కాస్త చినికి చినికి గాలి వానలా మారి రెండు పార్టీల నాయకులు తన్నుకునే వరకు వచ్చింది. ప్రజా సమస్యలను పట్టించుకోకుండానే ఒకరిపై ఒకరు దుమ్మెత్తా పోసుకుని సుమారు గంటకు పైగా బహాబాహీగా తలపడ్డారు. తమ సమస్యలను పరిష్కరించడానికి నాయకులు వస్తున్నారని సంబరపడ్డ సామాన్య ప్రజలకు, గ్రామసభ రాజకీయ వేదిక మారడంతో దరఖాస్తులు సమర్పించడానికి వచ్చిన మహిళలు నిరాశకు గురయ్యారు. గంటకు పైగా సాగిన వివాదం కాంగ్రెస్ నాయకులకు జువ్వాడి నర్సింగరావు, బిఆర్ఎస్ నాయకులకు ఎంఎల్ఏ సంజయ్ సర్ది చెప్పినా వినకపోవడంతో సభా ప్రాంగణమంతా ఉద్రిక్తత వాతావరణంతో నిండిపోయింది. దాదాపు గంటన్నర తర్వాత ఇరు పార్టీల నాయకులు శాంతించడంతో సభను అధికారులు ప్రారంభించారు. అనంతరం ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకుని అధికారులకు పరిష్కరించాలని సూచించారు. కాగా ప్రశాంతంగా ఉన్న మండలంలో గ్రామసభ వేదికగా నాయకుల్లో దాగి ఉన్న రాజకీయ కక్షలు బయటపడడం శోచనీయం.

## జాబితాల్లో పేర్లు లేకపోవడంపై నిలదీత



ప్రజాపక్షం/గొల్లపల్లి : రాష్ట్ర రాష్ట్రప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయబోయే నాలుగు కొత్త పథకాల కోసం అర్హులు, అనర్హులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభలు రసాభాసగా మారాయి .జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల పరిధిలోగల 27 గ్రామాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 పథకాల కోసం ఈనెల 21 నుంచి 24 వరకు జరిగిన గ్రామ సభలు ఆందోళన మధ్య ముగిశాయి .మండల వ్యాప్తంగా 27 గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన సభల్లో చాలాచోట్ల జనం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అధికారులు జాబితాలు చదువుతుండగా కొత్త రేషన్ కార్డులు ,ఇందిరమ్మ ఇండ్లు , జాబితాలలో తమ పేరు జాబితాలో లేదని లబ్ధిదారులు అధికారులతో వాగ్వాదంకు దిగారు .ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో అనర్హుల పేర్లున్నాయని ,భూములు లేని తమ పేర్లు లేవని అధికారులతో గొడవకు దిగారు. జాబితాలో పేరు రాని వారు ఎవరైనా అర్హత కలిగి ఉంటే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పగా ,ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలంటూ మండిపడ్డారు. ప్రాథమిక జాబితాలో పేర్లు రానివారు గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ,ఈ పథకాలు నిరంతర ప్రత్యేక కొనసాగుతాయని అన్నారు. అయితే 2023 లో నిర్వహించిన ప్రజా పాలనలో ,గతేడాది నిర్వహించిన కుల గణన లోను తాము ఇల్లు లేదని ,రేషన్ కార్డు లేదని వెల్లడించామని అయినా మళ్లీ దరఖాస్తు చేసుకోవడమేంటి అంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేశారు .గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను ఎప్పుడు ఖరారు చేస్తారంటూ స్థానిక అధికారులను ప్రశ్నించారు .దీనిపై అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడం మరింత ఇబ్బందిగా మారింది .కొన్ని గ్రామాల్లో కంట నీరు పెడుతూ ...దండం పెడుతూ తమలాంటి పేదలకు పథకాలు దక్కేలా చేయాలని సామాన్యులు వేడుకున్నారు.ఇలా చాలా గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి .ఇదే సమయంలో జాబితాలో పేర్లు లేని అర్హులు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు ఇచ్చేందుకు ఎగబడ్డారు .ఇక శుక్రవారంతో నేటికీ గ్రామ సభలు ముగియనున్నాయి .అయితే ఇప్పటివరకు జాబితాలో ఉన్న పేర్లకు సమానంగా తిరిగి కొత్తగా దరఖాస్తులు వస్తున్నట్లు తెలుస్తుంది .అయితే కొత్త దరఖాస్తులకు తిరిగి మోక్షం ఎప్పుడు అనేది వేచి చూడాల్సిందే.

ఫోకస్

# సైన్స్

# విద్యుత్ నిల్వకు గ్రావిటీ స్టోరేజ్

దేశ వ్యాప్తంగా విద్యుత్ అవసరాలు పెరుగుతుండగా, ఉత్పత్తిపై పర్యావరణ మార్పులు ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. దీనితో పునరుత్పాదక శక్తి వైపు దృష్టి సారించక తప్పడం లేదు. అయితే, ఈ ఇందులో పలు కీలక సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రత్యేకించి నిల్వ చేయడం అత్యంత సమస్యాత్మకంగా మారింది. దీనిని నివారించడానికి గ్రావిటీ ఎనర్జీ స్టోరేజ్ అందుబాటులోకి రానుంది. ఇది తక్కువ ఖర్చుతో కూడిన ఒక వినూత్న ప్రక్రియ. సంప్రదాయ బ్యాటరీ శక్తి నిల్వకు మంచి ప్రత్యామ్నాయంగా పని చేస్తుంది. గ్రావిటీ ఎనర్జీ స్టోరేజ్ అరైని గురుత్వాకర్షణ శక్తిని పెంచడం ద్వారా శక్తిని నిల్వ చేయడానికి రూపొందించబడిన వినూత్న సాంకేతికత. అదనపు శక్తి ఉత్పత్తి సమయంలో భారీ ద్రవ్యరాశిని పెంచడం, అవసరమైనప్పుడు విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి దానిని విడుదల చేయడం ఈ స్టోరేజీ విధాన ప్రధాన లక్ష్యం. టర్బయిన్ లేదా జనరేటర్ పిస్టన్ యొక్క అవరోహణ కదలికను ఈ విధానంలో విద్యుత్‌గా మారుస్తారు. ఇందుకుగాను నీటితో నిండిన సిలిండర్‌ను ఏర్పాటు చేస్తారు. మిగులు విద్యుత్ ఉత్పత్తి సమయంలో పిస్టన్‌ను ఎత్తివేయడంతో, శక్తి నిల్వ సాధ్యమవుతుంది. శక్తి అవసరమైనప్పుడు, తిరిగి పిస్టన్‌ను ఉపయోగిస్తారు. ఫలితంగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. సాంప్రదాయ బ్యాటరీ నిల్వ మాదిరి కాకుండా, గురుత్వాకర్షణ శక్తి వ్యవస్థలు రసాయన ఆధారిత విద్యుత్ నిల్వలను నివారిస్తాయి. వాటిని పార్యవరణపరంగా స్థిరంగా, దీర్ఘకాలం ఉండేలా చేస్తాయి. నిర్దిష్ట భౌగోళిక లక్షణాలు అవసరమయ్యే పంప్డ్‌హైడ్రో సిస్టమ్‌ల మాదిరి కాకుండా , గురుత్వాకర్షణ శక్తి వ్యవస్థలు విభిన్న ప్రదేశాలలో ఈ విధానాన్ని అమలు చేయడానికి వీలుంది. కనిష్ట మెకానికల్ క్షీణత కారణంగా నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుంది. మన దేశంలో పునరుద్పాదక విద్యుత్ ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి వీలుగా గ్రావిటీ ఎనర్జీ స్టోరేజ్‌లో సౌర, పవన శక్తి స్థిరంగా ఉండదు. అవి వాతావరణంతోపాటు సంబంధిత రోజులో సమయం మీద ఆధారపడి ఉంటాయి. నేషనల్ సోలార్ మిషన్, విస్తరిస్తున్న పవన విద్యుత్ సామర్థ్యాల వంటి పథకాలతో, గురుత్వాకర్షణ శక్తి నిల్వను పరిష్కరించడం ద్వారా గ్రిడ్‌ను స్థిరీకరించడానికి అవకాశం ఉంటుంది. విద్యుత్ సరఫరా, డిమాండ్‌ను సమతుల్యం చేయడానికి విశ్వసనీయ నిల్వ విధానం అవసరం. తక్కువ వినియోగ కాలంలో విద్యుత్‌ను నిల్వ చేయగలిగి ఉండాలి. డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు, నిల్వ చేసిన శక్తిని విడుదల చేసే అవకాశం ఉండాలి. ఈ రెంటికీ గ్రావిటీ స్టోరేజ్ పరిష్కారాన్ని చూపిస్తున్నది. విద్యుత్ రంగంలో అధునాతన సాంకేతికతకు ఈ విధానం ఒక నిదర్శనం.




## పరమాణు కేంద్రంలో భిన్నతత్వాలు!



పరమాణు నిర్మాణం ప్రకారం, ధనావేశం ఉన్న ప్రోటాన్లు అతి చిన్న కేంద్రంలో చాలా దగ్గరగా ఉంటాయని తెలుస్తోంది. సజాతి ఆవేశం కలిగిన ప్రోటాన్లు ఒకదానినొకటి వికర్షించుకొని దూరంగా జరగాలి. కానీ ఏదో శక్తి వాటిని అతి దగ్గరగా బంధించి ఉంచుతోంది. ఒక పరమాణు కేంద్రకం ద్రవ్యరాశి, దానిలోని కణాల మొత్తం ద్రవ్యరాశికి సమానంగా ఉండాలి. అయితే, క్షుణ్ణంగా పరిశీలిచినప్పుడు, ఒక్క హైడ్రోజన్‌లో తప్ప మిగిలిన అన్ని మూలకాల కేంద్రకాల ద్రవ్యరాశి, అందులో ఉండే కేంద్రక కణాల మొత్తం ద్రవ్యరాశి కంటే తక్కువగా ఉంటోంది. అది శక్తిగా మారి కేంద్రక కణాలను బంధించి ఉండవచ్చు. ప్రముఖ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ ద్రవ్యరాశి, శక్తుల తుల్యసూత్రం E = mc2 ని ప్రతిపాదించాడు. ఇక్కడ m అనేది ద్రవ్యరాశి, E అనేది శక్తి,c అనేది శూన్యంలో కాంతివేగం. ఈ సూత్రం ప్రకారం ద్రవ్యరాశిని శక్తిగాను, శక్తిని ద్రవ్యరాశిగాను మార్చగలమని తెలుస్తుంది. అందుచేత ద్రవ్యశక్తి నిత్యత్వ సూత్రాన్ని ప్రతిపాదించుకోవాలి. విశ్వంలో ఉన్న మొత్తం ద్రవ్యరాశి, శక్తి స్థి రం. ద్రవ్యరాశి తరుగు బంధన శక్తిగా మారి కేంద్రక కణాలను బంధించిం ది. కేంద్రకం మొత్తం బంధన శక్తిని, కేంద్రకంలో ఉన్న కణాల సంఖ్యతో భాగిస్తే వచ్చేది సగటు బంధన శక్తి. ఈ సగటు బంధన శక్తి ఏ కేంద్రకానికి ఎక్కువ ఉంటుందో అది చాలా స్థిరంగా ఉంటుంది. ఇది తక్కువగా ఉన్న కేంద్రకాలు అస్థిరంగా ఉండి స్థిరత్వం కోసం కొన్ని కణాలను బయటకు వెదజల్లుతాయి. ఇటువంటి లక్షణం పరమాణు సంఖ్య 83 కంటే ఎక్కువ ఉన్నమూలకాలలోకనిపిస్తుంది. ఈ ప్రక్రియని రేడియో ధార్మికత అంటారు.యురేనియం, రేడియం మొదలైన మూలకాలను దీనికి ఉదాహరణలు.

## పక్షుల వలసలు ఎలా సాధ్యం?

సాధారణంగా కొత్త ప్రాంతాలకు వెళ్లినప్పుడు దారి మరచిపోతుంటాం. ఈ అధునాతన కాలంలో జిపిఎస్ సాయం తీసుకున్నప్పటికీ, పొరపాట్లు జరుగుతునే ఉంటాయి. సురూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు, మాట్లాడి వివరాలు తెలుసుకునే అవకాశం ఉన్నప్పటికీ మనుషులు గందరగోళపడితే, పక్షులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఏ విధంగా వలస వెళతాయన్న ప్రశ్న ఉదయించడం సహజం. శీతకాలం ఆగమనంతో జమ్మూకశ్మీర్‌కు భారీ సంఖ్యలో విదేశీ పక్షులు వలస రావడాన్ని చూస్తున్నాం. ఈ విధంగా ప్రతి సంవత్సరం ఒక నిర్ణీత కాలంలో పక్షులు ఒకే ప్రదేశానికి వలస పోవడానికి ఎన్నో కారణాలు దోహదపడతాయి. భూమిపై ఉండే నదులు, సముద్ర తీరాలు, పర్వత శ్రేణుల లాంటి భౌగోళిక పరిసరాలను అవి గుర్తు పెట్టుకోగలుగుతాయి. సముద్రాలను దాటి వలసపోయే ముందు పక్షులు సముద్ర తీరంలో ఒక నిర్ణీత ప్రాంతంలో గుమిగూడుతాయి. తర్వాత వాటి దృష్టి వ్యవస్థ ఆధారంగా సముద్రాలను దాటుతాయి.



## ఐన్‌స్టీన్ సృష్టి సాధారణ సాపేక్షత

అల్బర్ట్ ఐన్‌స్టీన్ 1915లో ప్రతిపాదించిన సాధారణ సాపేక్షత (General Relativity) లేదా సాధారణ సాపేక్ష సిద్ధాంతం జ్యామితీయ గురుత్వాకర్షణ సిద్ధాంతం. ఆధునిక భౌతిక శాస్త్రంలో గురుత్వాకర్షణను గురించి వివరించడానికి ప్రస్తుతం ఈ సిద్ధాంతాన్నే వాడుతున్నారు. సాధారణ సాపేక్ష సిద్ధాంతం, ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతాన్ని మరింత విస్తృతం చేసి న్యూటన్ విశ్వగురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని మరింత మెరుగు పరుస్తుంది. ఇది గురుత్వాకర్షణను చతుర్మితీయ స్థలకాలాల జ్యామితీయ ధర్మంగా వివరిస్తుంది. ఐన్‌స్టీన్ సిద్ధాంతం ఖగోళ భౌతిక శాస్త్రపు అంతర్భావాలను సూచిస్తుంది. వీటిలో కృష్ణ బిలాలు ఏర్పడటం గురించి ఉంటుంది. కృష్ణ బిలాలు అంటే అతి పెద్ద నక్షత్రాల అంతిమ రూపాలు. వీటిలో స్థలకాలాలు ఏమీ ఉండవు. కాంతి కూడా వీటి నుంచి తప్పించుకోలేదు. సాధారణ సాపేక్ష సిద్ధాంతం ఇప్పటికే ఉన్న అన్ని భౌతిక సిద్ధాంతాలలో చాలా అందమైనదిగా వర్ణించబడింది. కాగా, 1905లో హెన్రీ పాయిన్కేర్ ఎలక్ట్రాన్ గమనాన్ని అర్థం చేసుకోవడానికి సాపేక్షతను ప్రయోగించాడు. ఇదే భావనను గురుత్వాకర్షణతో సహా అన్ని బలాలకు కూడా అన్వయించాడు. ఇతని సిద్ధాంతంలో గురుత్వాకర్షణ తరంగాలు కాంతి వేగంతో ప్రసరిస్తాయని నిరూపించాడు. దీని తర్వాత ఐన్స్టిన్ కూడా తన సాపేక్ష సిద్ధాంతంలోకి గురుత్వాకర్షణ బలాన్ని ఎలా తీసుకురావాలో ఆలోచించాడు. 1907 లో ఒక ఆలోచనా పరమైన ప్రయోగంగా ప్రారంభమైన ఆయన పరిశోధనను సుమారు ఎనిమిదేళ్ళు కొనసాగించి 1915 నవంబర్ నెలలో తన పరిశోధనను ప్రష్యన్ అకాడెమీ ఆఫ్ సైన్స్ ముందు పెట్టాడు. అదే ప్రస్తుతం ఐన్‌స్టీన్ ఫీల్ ఈక్వేషన్స్. సాధారణ సాపేక్ష వాదానికి ఇవి మూలస్తంభాల్లాంటివి.కొత్త మూలకాలను తయారు చేయడం.

## జన్యు అధ్యయనాలకు ‘ట్విగ్‌స్టాట్స్’



కొత్త జన్యు విశ్లేషణ సాధనం ‘ట్విగ్‌స్టాట్స్’ (Twigstats) ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. దీని ద్వారా క్రీస్తు పూ ర్వం 500 నుంచి క్రీస్తు శకం 1000 సంవత్సరం వరకూ పురాతన డియోక్సిరిబోన్యూక్లిక్ యాసిడ్ (డిఎన్‌ఎ) నమూనాలను ఉపయోగించి, అక్కడి ప్రజల పూర్వీకులను గుర్తించడం సాధ్యమవుతుంది. అంతేగాక, ఖచ్చితమైన ఫలితాలను ఇస్తుంది. ట్విగ్‌స్టాట్స్ అనేది జన్యు అధ్యయనాల కోసం అభివృద్ధి చేసిన ఒక అధునాతన విశ్లేషణాత్మక సాధనం. పూర్వీకుల గురించిన సమాచారాన్ని విస్పష్టంగా విశ్లేషించడానికి ఈ విధానాన్ని వాడవచ్చు. ఇది జన్యు డేటా, పురావస్తు పరిశోధనలు, చారిత్రక సందర్భ ం వంటి అనేక కోణాల్లో సమాచారాన్ని ఉపయోగించడం ద్వారా జనా భా డైనమిక్స్‌కు సంబంధించిన అవగాహనను మెరుగుపరుస్తుంది. వ్య క్తుల మధ్య భాగస్వామ్య జన్యు ఉత్పరివర్తనాలను విశ్లేషించడం ద్వారా ట్విగ్‌స్టాక్స్ జన్యు కుటుంబ వృక్షాలను పునర్నిర్మిస్తుంది. ఇది మన పూర్వీకులను కనిపెట్టడానికి, వివిధ కాలల నుంచి వ్యక్తుల మధ్య సంబంధాలను ఏర్పరచడానికి ఇటీవలి ఉత్పరివర్తనాలను ఉపయోగిస్తుంది. ఆధునిక డిఎన్‌ఎను పురాతన జనాభాతో కలుపుతుంది. ట్విగ్‌స్టాట్స్ జన్యు డేటాను విశ్లేషించడానికి టైమ్‌స్ట్రాటిఫైడ్ విధానాన్ని ఉపయోగిస్తాయి. చారిత్రక కాలాల్లో మానవ పరిణామ క్రమాన్ని అధ్యయనం చేయడం ద్వారా ఖచ్చితత్వాన్ని మెరుగుపరుస్తుంది. ఇది భాగస్వామ్య డిఎన్‌ఎ విభాగాలు లేదా హాప్లోటైప్స్, అరుదైన వైవిధ్యాలు, సింగిల్ న్యూక్లియోటైడ్ పాలిమార్ఫిజమ్ (ఎస్‌ఎన్‌పి)లను మిళితం చేస్తుంది. తద్వారా పూర్వీకుల పరిణామక్రమంపై సమగ్ర అవగాహనను అందిస్తుంది. జన్యు డేటాను మరింత ఖచ్చితత్వంతో విశ్లేషించడంలో పరిశోధకులకు సాయం చేయడానికి ఇది గణాంక భాషలై ఆర్ (R) మరియు సి++ (C++)లను ఉపయోగిస్తుంది. సింగిల్ న్యూక్లియోటైడ్ పాలీమార్ఫిజమ్స్ అనేవి డిఎన్‌ఎ శ్రేణిలో తేడాలను కనుగొడానికి ఉపయోగించే ఒక విధానం. ఇక్కడ న్యూక్లియోటైడ్ (ఎ,సి,జి లేదా టి) వ్యక్తుల మధ్య నిర్దిష్ట పాయింట్ల వద్ద మారుతూ ఉంటుంది. పురాతన జన్యు పదార్థం నుంచి జన్యు చరిత్రలు, పూర్వీకుల నమూనాలను పునర్నిర్మించడానికి ఈ విధానం విస్తృతంగా ఉపయోగపడుతుంది. అధిక నాణ్యతతో కూడిన ఎస్‌ఎన్‌పి విశ్లేషణకు డిఎన్‌ఎ నమూనాలు అవసరం. ఇప్పటి వరకూ పూర్వీకుల సమూహాల డిఎన్‌ఎ సేకరణ ఒక ప్రధాన సమస్యగా ఉండేది. ఆ సమస్యను ట్విగ్‌స్టాట్స్ పద్ధతిలో సేకరించే లేదా ఖచ్చితంగా అంచనా వేయవచ్చు. మన పూర్వీకుల గురించిన అధ్యయనంతోపాటు విశ్లేషణలో ఈ విధానం విప్లవాత్మక మార్పులు తీసుకురావడం ఖాయం.

# రైతు ఉద్యమాలకు సిద్ధమవ్వండి




**జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి**

**ఎఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాగం, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా**

**ప్రజాపక్షం / పాల్వంచ :** రైతాంగ సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ఉద్యమాలకు రైతులు సంసిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పాల్వంచలోని స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో ఎఐకెఎస్ జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. దేశ సరిహద్దుల్లో రైతు నాయకులు అమరణ నిరాహార దీక్ష చేస్తున్న కనీసం కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సం బంధించి ఎటువంటి షరతులు లేకుండా చేయాలని, ప్రభుత్వం చెబుతున్న నూరుశాతం రుణమా ఫీ జరగలేదన్నారు. రైతు భరోసా ఎకరానికి రూ.12వేలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంటున్నామని, రైతాంగ సమస్యలను పరిష్కారిస్తామని హామీని అమలు చేయకపోవడంతో నిరసనగా ఢిల్లీకి పాద యాత్ర మొదలు పెట్టిన రైతులను సరిహద్దుల్లోనే అడ్డుకొని వారిపై బాష్పావాయుతో దాడులు చేయడం, ముళ్ళకంచెలతో వారిని అడ్డుకోవడం రైతు ఉద్యమాన్ని అణిచివేయాలని ప్రభుత్వ ప్రయత్నాలు హేయమైన చర్యన్నారు. తక్షణమే జాతీయ వ్యవసాయ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలతో చర్చలు చేపట్టి రైతాంగ సమస్యలను పరిష్కరించాలని, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కారదర్శి ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారానికి నూతన ఉద్యమాలను రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ జిల్లా నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, కమటం సురేష్, కుమారి హనుమంతరావు, రవి, ఉకే నారాయణ, వాడేలక్ష్మి , నారటి రమేష్, కోటి నాగేశ్వరరావు, భానోత్ రంజిత్, సీతారాంరెడ్డి, సుబ్బారెడ్డి తదితర రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టిజన్ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాల్సిందే

**కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు**






**ప్రజాపక్షం/గణపురం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ కెటిపిపి ఆధ్వర్యంలో 5వ రోజు విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, ఎఐటియుసి అధ్యక్షులు నరాటి ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రిజినల్ అధ్యక్షులు జర్పుల చందన్ సింగ్, అసోసియేషన్ సభ్యులు కొండికొప్పుల అనిల్ కుమార్, మురళి,రవిందర్ నాయక్, రత్నాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 23,000వేల మంది ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి డిపార్మెంటుకు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు, సంస్థలో పనికి బంగం కలగకుండా సంస్థకు నష్టం వాటిల్లకుండా రిలేనిరాహార దీక్షలు చేస్తున్న ఆర్టీజన్ కార్మికులకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. జెన్ కో, ఎస్పిడిసిఎల్, ఎన్పిడిసిఎల్, ట్రాన్స్‌కో విద్యుత్ శాఖల్లో ఆర్జిజన్ కార్మికులు కుటుంబాలకు తన కష్టం తెలియకుండా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. కార్మికుల న్యాయమైన కోరిక ప్రభుత్వం వెంటనే నెరవేరుస్తారని. ఒకే సంస్థ ఒకే సర్వీస్ రూల్స్ ఉండాలని వేరు వేరుగా సర్వీస్ రూల్స్ ఉండడం వలన ఆర్టీజన్ కార్మికులు చాలా ఇబ్బందుల్లో పడుతున్నారని తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్ శాఖ యాజమాన్యాలు కలిసి వారి న్యాయమైన రూల్స్, డిమాండ్‌లు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి చైర్మన్ కన్వీనర్ అల్లం ఓదెలు బీరెల్లి రాజు, కోశాధికారి మణి కుమార్ ట్రేడ్ యూనియన్ నాయకులు సిఐటియు జెన్ కో సెక్రటరీ చిలువేరు మల్లయ్య, కుమార్, ఆర్టిజన్ కార్మికులు మామిండ్ల నాగరాజు, బొమ్మకంటి రాజేందర్, వొనపాకల సంపత్, సూర శశాంక్, శంకర్, నరసింహ, మహెందర్, రాజు, తిరుపతి, ప్రకాష్, రఫీక్ ల తో పాటు కెటిపిపి లోని వందలాది మంది ఆర్టీజన్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ**



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హా మీలను అమలుచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బాల్ నర్సింహ్మ అ న్నారు. నాగర్ కర్నూల్ జిల్లా చారగొండ మండలకేంద్రంలో శుక్రవారం బస్టాండు కూడలిలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా సిపిఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు డాక్టర్ చిలువేరు శ్రీనివాసు లు, సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి పులిజాల పరుషరాములు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, వంగూరు సిపిఐ మండలకార్యదర్శి గడ్డంశ్రీనివాసులు, ప్రజానాట్యమండలి జిల్లా సీనియర్ నేతలు తన్నీరు మల్లయ్య, సిపిఐ చారకొండ మండల నాయకులు జెల్లకృష్ణయ్య, మద్దినారంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలి

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి/ఖమ్మం రూరల్ :** పథకాల అమలు జాబితాలో అర్హులైన పేదలకు అధికారులు అన్యాయం చేశారని సిపిఐ జిల్లా స హాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సం దర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, రెండువేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నప్పుడు కొంత మంది అర్హత సాధించి మిగిలినవారు అర్హత ఎందుకు కాలేదో అధికారులు చెప్పాలన్నారు. 11 సంవత్సరాల తర్వాత ప్రభుత్వం ఇంటి స్థలాలు, ఇండ్లు, రేషన్ కార్డుల కోసం కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులకు దూరం చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. రైతుల, ప్రభుత్వ భూములను ప్రభుత్వ అవసరాలతో పాటు ఉద్యోగస్తులు, ఎన్జీవోస్‌కి కేటాయించి ఇక్కడి ప్రజలకు అన్యాయం చేశారన్నారు. కానీ ఇప్పుడు ఆ భూమిని వారు అమ్ము కుంటున్నారని, దీంతో భూములు ఇచ్చిన రైతులు, పేద ప్రజలకు దక్కకుండా అయిపోయాయన్నారు. అర్హులందరికీ పథకాలు అందుతాయని గ్రామసభ తీర్మానం చేస్తే, దానిని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతామని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడ కంటి చిన వెంకట్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, బానోతు రాంకోటి నాయకులు మిడకంటి పెద్ద వెంకటరెడ్డి, వెంపటి సురేందర్, దండి రంగారావు వెన్నం భాస్కర్, రామిడి రమేష్, పొన్నకంటి రామకృష్ణ, మేళ్లచెరువు వీరబాబు, యువజన సంఘం సభ్యులు తదితరులుపాల్గొన్నారు.

**సిపిఐ ఆధ్వర్యంలో దరఖాస్తులు నింపి అందజేత**

సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా దరఖాస్తులు నింపి వారికి అందజేసినట్లు తెలిపారు. సిపిఐ నాయకులు, యువజన సంఘం సభ్యులు వరంగల్ క్రాస్‌రోడ్ తదితర చోట్ల గ్రామసభలో, అదే విధంగా ఎదులా పురంలో గ్రామసభలో దరఖాస్తులు నింపి అందజే సినట్లు తెలిపారు. అనంతరం అభ్యర్థుల అపోహ లను సిపిఐ నాయకులు నివృత్తి చేశారు.

## సిపిఐలో చేరికలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవా రం పలువురు పార్టీలో సిపిఐ పార్టీలో చేరారు. జిల్లా కేం ద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, సీనియర్ కార్యవర్గ సభ్యులు దంతాల రాంబాబుల ఆధ్వర్య లో పలువురిని పార్టీలోకి ఆహ్వానించి సభ్యత్వం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణకార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్లకు అప్పచెప్పే నిర్ణయం వెంటనే ఉపసంహరణ

**ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ డిమాండ్**




**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** వైస్ చాన్సర్ల నియామకం గవర్నర్లకు అప్పచెప్పే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ అన్నారు. భువనగిరిలోని ఎఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఫెడరల్ హక్కులను కాలరాసే, ప్రభుత్వ యూనివర్సీటీలను మూసివేసే కుట్రలకు యుజిసి తెరలేపిందని, వైస్ ఛాన్సలర్లను గవర్నర్లకు కట్టబెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. భారత దేశ ఉన్నత విద్యా రంగంలో ప్రమాదకరమైనదిగా ఈ ప్రతిపాదనలు ఉన్నా యన్నారు. విద్యను మరింత కేంద్రీకరణ కార్పొరేట్ కరు ణ, కాషాయకరణ చేసే దిశగా బిజెపి పునుకుంటుందని అన్నారు. నూతన విద్య విధానం 2020లో భాగంగా తీసుకొని వస్తున్నా ఈ ప్రతిపాదనలను ఫెడరిజం ప్రాథ మిక సూత్రాలను ఉల్లంఘిస్తూ రాజ్యాంగం మూల సూత్రాలను బలహీనం పరిచే విధంగా ఈ ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. అదే కాకుండా విద్యలో రాష్ట్రాల హక్కు లను దెబ్బతీసి వారి స్వయంప్రతిపత్తిని అణిచివేస్తున్నా యన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వంశీ, శివ పట్టణ నాయకులు జానీ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల హక్కులు కాపాడుకుందాం

## జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి




ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి : బాలికల హక్కులను కాపాడుకుందామని జిల్లా న్యాయ సేవాధి కారి సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా మహిళ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భేటీ బచావో– భేటీ పడావో దశాబ్ది ఉత్సవాలలో జిల్లా సంక్షేమాధికారి రౌఫ్ ఖాన్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్ లతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి ఉజ్వల భవిష్యత్తు కోసం బాలికలను కాపాడుకుందామని, వారిని స్వేచ్ఛగా ఎదగనిద్దామన్నారు. విద్యార్థినులు చదువుపై దృష్టి సారించాలని, ఎన్ని ఆటంకాలు వచ్చిన ఎంచుకున్న లక్ష్యం వైపుగా నడవాలని తెలిపారు. బాలికల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలు తెలుసుకోవాలని తెలిపారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి, పోస్టరు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిసిడిఒ, బాలల పరిరక్షణ సమితి అధికారి ఆనంద్, సిడిపిఒలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థినులు, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

### బాలికలు ధైర్యంగా ఉండాలి : జిల్లా జడ్జి

నిజామాబాద్ ప్రతినిధి : జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని జిల్లా జడ్జి కుంచాల సునీత జెండా ఊపి ప్రారంభించారు. ధర్నాచౌక్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుంచాల సునీత మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు ధైర్యంగా ఉండాలని, ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలని, ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాహిత్యం, కళలు వంటి ఏదైనా ఒక రంగంలో ప్రావీణ్యత సాధించాలన్నారు. డిసిపి బస్వారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని, ఎలాంటి సమస్యలున్న 1098కు ఫోన్ చేయాలన్నారు. డిఇఒ అశోక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జడ్జి పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, చదువుల్లో రాణిస్తూ మంచి ఉన్నత స్థాయిలో ఉండటానికి కృషి చేయాలన్నారు. బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్‌కుమార్, బిసిటియు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టాల రామకృష్ణ, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మీ, గౌరవ సలహాదారులు రమణస్వామి, సత్యనారాయణ, విజయ్‌కుమార్, రాజ్‌కుమార్ సుబేదార్ తదితరులు పాల్గొన్నారు.

# బీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఎఐటియుసి



ప్రజాపక్షం/బోథ్ : బీడి కార్మికులు సమస్యలు పరిష్కరించాలని బీడి వర్కర్స్ (ఎఐటియుసి) యూనియన్ నాయకులు బి.గోవర్ధన్ ప్రభుత్వాలను కోరారు తెలంగాణ రాష్ట్ర బీడి వర్కర్స్ ఫెడరేషన్(ఎఐటియుసి) రాష్ట్ర 2వ మహాసభలు ఈ నెల 30, 31 వ తేదీలలో కోరుట్లలో జరుగుతాయని గోవర్ధన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బోథ్‌లో ఇందుకు సంబందించిన పోస్టర్లను బీడి హెడ్ ఆఫీస్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీడి కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు

## ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రెబ్బన మండలం గోలేటి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కేవలం ఇండ్లు ఉన్నవారికి, ఇండ్లు ఇస్తుందని, ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించడం లేదని ఆరోపించారు. కేవలం పైరవీలకు మాత్రమే పరిమితమైన దరఖాస్తులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు గ్రామసభలో గ్రామస్థులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

# ఎస్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/వెల్దుర్తి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి యాదగిరి ఎస్టీయు క్యాలెండర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీయు సంఘం పాఠశాలల బలోపేతం కోసం, విద్యా పరిరక్షణ కోసం, ఉపాధ్యాయ సమస్యల సాధన కోసం నిరంతరం కృషి చేస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయు మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శి రాములు, జహీరుద్దీన్, ఎస్టీయు జిల్లా బాధ్యులు రమేష్ గౌడ్, చంద్రం, వసంత్, మధుసుధన్, రాష్ట్ర కార్యదర్శి ఎర్ర.రాజు తదితరులు పాల్గొన్నారు.

# కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/బైంసా : కుబీర్ మండల కేంద్రంలోని నాఫెడ్ అండ్ మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో పిఎసిఎస్ ద్వారా కందుల పంట కొనుగులు కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బైంసా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్,మండల అధికారులు,నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంక్షల పేరుతో లబ్ధిదారులకు ఇబ్బందులా? : ఎమ్మెల్యే సునీత



ప్రజాపక్షం/కౌడిపల్లి : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. ఆంక్షల పేరుతో లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల విషయంలో లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు సరైన సమాధానం చెప్పకుండా గ్రామసభలో వందల పేర్లు చదువుతున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి లబ్ధి చేకూరేలా అధికారులు పని చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు సారా రామగౌడ్, దుర్గారెడ్డి, రాజు నాయక్, రుద్రప్ప కాంత పురుషోత్తం, పోల నవీన్, మంగలపర్తి సందీప్, అమర్ సింగ్, చల్లా సంగప్ప, మాధవరెడ్డి పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనపై అవగాహన



ప్రజాపక్షం/ భీమారం/ జైపూర్ : విద్యార్థి దశ నుండే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలని జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా భీమారం పోలీస్ స్టేషన్ పరిధిలోని జడ్‌పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ శ్వేత ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జైపూర్ ఎసిపి హాజరై మాట్లాడారు. మైనర్లు వాహనాలు నడపరాదని, తల్లిదండ్రులు వాహనాలు నడుతున్న సమయంలో నిబంధనలు పాటించే విధంగా విద్యార్థులు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మాచర్ల ఆనంద్ పాల్, కిరణ్, నసీర్, రవళి, స్రవంతి, లస్మయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులకు పథకాలు అందేలా కృషి

## కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



ప్రజాపక్షం/వాంకిడి/ఆసిఫాబాద్ : అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని వాంకిడి మండలం జైత్‌పూర్ గ్రామంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలపై నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన, సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కుల గణన సర్వే, ప్రజావాణి కార్యక్రమాలలో అందిన దరఖాస్తులను క్రోడీకరించి ఇంటింటా సర్వే, గ్రామాలలో సర్వే నిర్వహించి జాబితాలను రూపొందించడం జరిగిందని తెలిపారు. అర్హత కలిగి ఉండి జాబితాలో పేర్లు రానివారు దరఖాస్తు చేసుకోవచ్చని, జాబితాలో అర్హులు కాని వారి పేర్లు ఉంటే అభ్యంతరాలు తెలిపినట్లైతే క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన వారి వివరాలు గ్రామసభలలో చదివి వినిపించడం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా కింద సాగు యోగ్యం గల భూముల వివరాలు తయారు చేయడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డు కొరకు, రేషన్ కార్డులు వివరాల చేర్పులు, మార్పులు, తొలగింపుల కొరకు అవకాశం ఉందని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలిపారు. అర్హత గల ప్రతి కుటుంబాని కి ఆహార భద్రత కార్డు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద అర్హులైన నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 20 రోజులు పని చేసిన భూమి లేని వారందరికీ పథకం వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అందరి సహకారంతో నగర సుందరీకరణ

## నగర మేయర్ నీతూకిరణ్



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : అందరి సహకారంతో నగరాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దుతామని నగర మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని ఛాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ మళ్లీ అవకాశం వస్తే ప్రజలకు మరింత సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈనెల 27న మా పాలన పూర్తవుతుందని మా పాలనలో ప్రజలకు ఏం చేశామో ఆ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని ముఖ్య ఉద్దేశ్యంతో మీడియా సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అభివృద్ధి కోసం సహకరించిన మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్‌గుప్తా, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆగిపోయిన మున్సిపల్ కార్యాలయాన్ని మా పాలన పూర్తి చేశామని గుర్తు చేశారు. కౌన్సిల్ హాల్‌ను అద్భుతంగా నిర్మించామన్నారు. రఘునాథ చెరువు నిజామాబాద్ ప్రజలకు బహుమతిగా ఇచ్చామని, రఘునాథ చెరువుకు ఎన్నో డిజైన్లు చేసి నిర్మాణానికి తుది రూపం ఇచ్చామని, ఆహ్లాదం కోసం రఘునాథ చెరువుకు ఎన్నో డిజైన్లు చేసి నిర్మాణానికి తుది రూపం ఇచ్చామని, ఆహ్లాదం కోసం రఘునాథ చెరువునుమినీ ట్యాంక్‌బండ్‌గా రూపొందించామన్నారు. నగరంలో అనేక వైకుంఠధామాలు నిర్మించామని, నగరంలో ఐటీఫ్ నిర్మించి యువతకు ఉపాధి కల్పించామన్నారు. స్మార్ట్ సిటీకి లాగా నగరాన్ని అభివృద్ధి చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పోరేటర్ తడకల ఉమారాణి, 18వ డివిజన్ కార్పోరేటర్ యమున పాల్గొన్నారు.

# అర్హతఉన్న వారికే సంక్షేమ పథకాలు

## ఎమ్మెల్యే రామారావు పటేల్



ప్రజాపక్షం/తానూర్ : అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల అందాలని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల పై అధికారులు ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామసభ మొగిలి గ్రామంలో శుక్రవారం ముఖ్య అతిథిగా ముధోల్ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ మాట్లాడుతూ పేర్లు రాని వారు ఎవ్వరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాలను అందింపజేస్తమని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులకు,బిజెపి మండల అధ్యక్షుడు పూండ్రా లక్ష్మణ్ రెడ్డి, చిన్నారెడ్డి, శివాజీ పటేల్, మారుతి, బాలాజీ సంతోష్ పాటిల్ మండల నాయకులు కార్యకర్తలు,గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# దివ్యాంగులకు ఉపకరణాలు అందజేత

ప్రజాపక్షం/బాన్సువాడ : దివ్యాంగులకు ప్రభుత్వం, అలీం కో సంస్థ సహకారంతో సహాయ ఉపకరణాలు అందజేయడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడ పట్టణ శివారులోని ఎస్ఎంబి ఫంక్షన్ హాల్‌లో మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల కోసం ఏర్పాటు చేసిన శిబిరానికి పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పోచారం మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వర ప్రసాద్, ఎంపిడిఒ బషీరుద్దీన్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలెక్, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, కృష్ణా రెడ్డి, అంజిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నార్ల సురేష్ గుప్తా, నాయకులు ఎజాస్, నారోజీ గంగారాం, హకీమ్, విఠల్ రెడ్డి, శిశు సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

## ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్




ప్రజాపక్షం/కడెం : కడెం మండల కేంద్రంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన,ఇందిర మహిళశక్తి పథకంలో భాగంగ ఈడిఐఐ యాక్సెంచర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు సిఎఫ్సి సెంటర్ను, సంచార వాహనాన్ని శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, డిఆర్డిఓ పిడి విజయలక్ష్మి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంఎల్ఏ బొజ్జు పటేల్ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ ద్వారా మహిళలు చేపల పచ్చడి, రొయ్యల పచ్చడి,ఎండు చేపలు తదితర వాటిని విక్రయాలు జరుపుతూ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ దేవేందర్ నాయక్, మండల నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి

## అదనపు కలెక్టర్ దీపక్ తివారి




ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ : అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం రాజంపేట గ్రామపంచాయతీలో కొనసాగుతున్న గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసరాలు, వంటశాల, తరగతి గదులు, రిజిస్టర్లు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబాలకు వెలుగులు నింపే దీపాలు బాలికలు

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : కుటుంబాలకు వెలుగులు నింపే దీపాలు బాలికలని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జీవితంలో ఉన్నత స్థితిలో నిలిచేందుకు చిన్నతనం నుంచే ఉన్నత బాటలు వేసుకోవాలని ఆకాక్షించారు. శుక్రవారం పట్టణంలోని రాంనగర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిచారు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,అధికారులతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 24న జరుపుకుంటామని ఈ ప్రత్యేకమైన రోజు సమాజానికి బాలికల పాత్ర ఎంత ముఖ్యమైందో గుర్తు చేస్తుందని తెలిపారు. ఒక బాలిక చదువుకుంటే, ఒక్క కుటుంబమే కాదు, ఒక సమాజం విద్యావంతం అవుతుందన్నారు. ప్రభుత్వం మహిళల సాధికారత కోసం బేటీ బచావో, బేటీ పడావో, సుఖన్య సమృద్ధి యోజన వంటి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఏర్పాటు చేసిన సెల్ఫీ కేంద్రం వద్ద ఫోటోలు దిగారు. అధికారులు, విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిఇఒ పి.రామారావు, డిటిడిఓ అంబాజి, మెప్మా పిడి సుభాష్, నిర్మల్ పట్టణ ఎంఇఒ నాగేశ్వర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుకారాం, మిషన్ శక్తి సమన్వయకర్త సవిత, సీడబ్ల్యూసీ చైర్మన్ వాహీద్, అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల పక్షం 'ప్రజాపక్షం'

## అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్




ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : 'ప్రజాపక్షం' దినపత్రిక ముమ్మాటికీ ప్రజల పక్షమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 'ప్రజాపక్షం' 2025 క్యాలెండర్‌ను జిల్లా ప్రతినిధి కర్క రమేష్ సమక్షంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎసిపి రాజా వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ పత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉన్నప్పుడే ఆ పత్రికలకు ప్రజాధరణ ఉంటుందని, అలాంటి కోవకు చెందినది 'ప్రజాపక్షం' అన్నారు. ప్రజాసమస్యల గొంతుకై ప్రజాపక్షం జర్నలిస్టులు వార్తలు, కథనాలు రాస్తున్నారని గుర్తు చేశారు. ప్రజాసమస్యలు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లటంలో 'ప్రజాపక్షం' ముందంజలో ఉందన్నారు. ఎసిని రాజా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రజాపక్షం' దినపత్రికను రోజు చదువుతానని, ఇందులో వచ్చే ఆర్టికల్స్, కథనాలు ప్రజలకు చైతన్యం కలిగించేలా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రజాపక్షం అర్బర్ రిపోర్టర్ ఉమామహేశ్వర్ రావు, రిపోర్టర్లు రాజ్‌కుమార్, రవికుమార్, కొట్టూర్ శ్రీనివాస్, మల్లెపూల నర్సయ్య, ప్రకాష్, భూమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






వాంకిడి : మీడియా నిజాలు నిర్భయంగా రాయాలని, ప్రజలు ప్రభుత్వానికి వారధిగా నిలవాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పారుపల్లి అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం వాంకిడి మండలం కేంద్రంలో 'ప్రజాపక్షం' దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎంపి, పిఎంపి మండల అధ్యక్షుడు పెట్కార్ వినోద్, ప్రధాన కార్యదర్శి చిందం రాజు, ఆశం పాల్గొన్నారు.

సదాశివపేట : సదాశివపేట పట్టణంలోని 12వ వార్డులో 'ప్రజాపక్షం' 2025 క్యాలెండర్‌ను పులిమామిడి రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాపక్షం విలేకరి పోల వెంకటేషం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మునిపల్లి సత్యనారాయణ, కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం, బోడగామ నాగభూషణం, చీలం సురేష్, తాలెల్మరాము జబ్బార్, మేకల సంగమేశ్వర్, పరమ దాసు , వేణు వెంకట్ రాగం అనిల్ సోమశంకర్ పాల్గొన్నారు.

# క్రీడ

## ఇండియా VS ఇంగ్లాండ్ రెండో టీ20కి
# వర్షం ముప్పు?



ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. చెన్నై వేదికగా శనివారం జరిగే రెండో టీ20లో ఇంగ్లాండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా బుధవారం జరిగిన తొలి టీ20లో సమిష్టిగా రాణించిన టీమిండియా 43 బంతులు మిగిలి ఉండగానే 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టీ20ల్లో ఇంగ్లాండ్‌పై టీమిండియాకు ఇదే అతిపెద్ద విజయం. ఇదే జోరులో చెన్నై వేదికగా జరిగే రెండో టీ20లోనూ విజయం సాధించాలని టీమిండియా పట్టుదలతో ఉంది. మరోవైపు తొలి టీ20 ఓటమి తప్పిదాల నుంచి తేరుకొని విజయం సాధించాలని ఇంగ్లాండ్ భావిస్తోంది. ఇంగ్లాండ్ బ్యాటింగ్ వైఫల్యం కారణంగా తొలి టీ20 ఏకపక్షంగా సాగగా.. కనీసం రెండో టీ20 అయినా హోరాహోరీగా సాగాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

**షమీ ఇన్.. నితీష్ ఔట్!**

ఇక 14 నెలల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి వచ్చిన మహమ్మద్ షమీకి తొలి టీ20 తుది జట్టు దక్కలేదు. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌ను ఆడించడం కోసమే షమీని పక్కనపెట్టారు. అయితే చెన్నై వేదికగా జరిగే రెండో టీ20లో అతన్ని ఆడించే అవకాశాలు ఉన్నాయి. కొత్త బంతితో హార్దిక్ పాండ్యా విఫలమవడంతో షమీని ఆడించాల్సిన పరిస్థితి ఏర్పడింది.
నితీష్ కుమార్ రెడ్డి స్థానంలో చెన్నై లోకల్ భాయ్ వాషింగ్టన్ సుందర్‌ను ఆడించే అవకాశాలు ఉన్నాయి. చెపాక్ మైదానం స్పిన్‌కు అనుకూలంగా ఉంటుంది. ఈ క్రమంలోనే వాషింగ్టన్ సుందర్‌ను తుది జట్టులోకి తీసుకోనున్నారు. బ్యాటింగ్ విభాగంలో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు.

**ఎక్స్‌ట్రా స్పిన్నర్‌తో ఇంగ్లాండ్**

తొలి టీ20లో దారుణంగా విఫలమైన ఇంగ్లాండ్ రెండో మ్యాచ్‌లో ఎక్స్‌ట్రా స్పిన్నర్‌తో బరిలోకి దిగే అవకాశం ఉంది. గస్ అట్కిన్సన్ స్థానంలో రెహాన్ అహ్మద్ బరిలోకి దిగవచ్చు.

**వర్షం ముప్పు..?**

ఈ మ్యాచ్‌కు ఎలాంటి వర్షం ముప్పు లేదు. శనివారం చెన్నైలో వాతావరణం పొడిగా ఉండనుంది. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 29 డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా 23 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కానుంది.

**తుది జట్లు(అంచనా)**

భారత్: అభిషేక్ శర్మ, సంజూ శాంసన్(కీపర్), సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, మహమ్మద్ షమీ, వరుణ్ చక్రవర్తి.

## ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో షాకింగ్ ఇన్సిడెంట్!

కోర్టు నుంచి బయటకు వచ్చి జకోవిచ్ సడెన్ రిటైర్మెంట్!



సెర్బియా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్‌ను గాయం ఇబ్బంది పెట్టింది. దీంతో కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్‌ను నెగ్గాలనే లక్ష్యం నిరాశగానే మిగిలింది. తాజాగా జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025లో జరిగిన ఈ ఘటన జకోవిచ్ అభిమానులను కలచివేసింది. తాజాగా జరిగిన సెమీస్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలి సెట్ తర్వాత జకోవిచ్ వాకోవర్ ఇచ్చేశాడు. అయితే గాయం కారణంగానే అతడు ఈ నిర్ణయాన్ని తీసుకొన్నట్లు వెల్లడించి, తన అభిమానులకు అభివాదం చేస్తూనే కోర్టు నుంచి బయటకు వెళ్లిపోయాడు. జకోవిచ్ చేసిన ఈ పనితో స్టేడియంలోని వారంతా ఒక్కసారిగా షాకయ్యారు. అయితే జకోవిచ్ వైదొలగడం వల్ల జర్మనీ స్టార్ జ్వెరెవ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్నాడు. శుక్రవారం జరగనున్న రెండో సెమీస్‌లో విజేతగా నిలవనున్న ప్లేయర్‌తో జ్వెరెవ్ టైటిల్ కోసం పోరాడనున్నాడు. ఇక ఇటలీకి చెందిన డిఫెండింగ్ ఛాంపియన్ సినర్‌తో అమెరికా స్టార్ బెన్ షెల్టన్ మరో సెమీస్‌లో తలపడనున్నాడు. ఆదివారం ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్ జరగనుంది.

## ఐసిసి టెస్టు టీమ్ ఆఫ్ ది ఇయర్
## టీమ్‌ఇండియా నుంచి ముగ్గురికి చోటు



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ 2024 టెస్టు టీమ్ ఆఫ్ ది ఇయర్ జట్టును ప్రకటించింది. ఈ జట్టులో భారత్ నుంచి ముగ్గురు ప్లేయర్లకు చోటు దక్కింది. యంగ్ ప్లేయర్ యశస్వీ జైస్వాల్, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా స్క్వాడ్‌లో ఉన్నారు. ఇక ఈ జట్టుకు ఆస్ట్రేలియా సారథి పాట్ కమిన్స్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. కాగా, ఈ జట్టులో అత్యధికంగా నలుగురు ఇంగ్లాండ్ ప్లేయర్లకు చోటు దక్కింది. బెన్ డకెట్, హ్యారీ బ్రూక్, జో రూట్, జిమ్మి స్మిత్ ఉన్నారు. మిగిలిన వాళ్లలో కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్), కామిందు మెండీస్ (శ్రీలంక), మ్యాట్ హెన్రీ (న్యూజిలాండ్) ఉన్నారు. ఇక టెస్టు జట్టు కంటే కాస్త ముందే ఐసీసీ 2024 వన్డే టీమ్ ఆఫ్ ది ఇయర్ జట్టు ప్రకటించింది. ఈ స్క్వాడ్‌లో టీమ్‌ఇండియా నుంచి ఒక్క ప్లేయర్ లేకపోవడం గమనార్హం. గతేడాది భారత్ అతి తక్కువ వన్డే మ్యాచ్‌లు ఆడడమే దీనికి కారణం.

**అక్కడ కూడా ఓపెనరే**

యంగ్ ప్లేయర్ జైస్వాల్ 2024లో అద్భుత ప్రదర్శన కనబర్చాడు. గతేడాది నిలకడగా ఆడుతూ 1474 పరుగులు చేశారు. అలాగే 36 సిక్స్‌లు బాదాడు. ఈ క్రమంలోనే ఓ కేలండర్ ఇయర్‌లో భారత్ తరపున అత్యధిక సిక్స్‌లు బాదిన ప్లేయర్‌గానూ నిలిచాడు. దీంతో ఐసీసీ జట్టులో ఎంపికయ్యాడు. ఇక్కడ కూడా యశస్వీ ఓపెనర్‌గా చోటు దక్కించుకున్నాడు. ఇక ఆల్‌రౌండర్‌గా రాణించిన జడ్డూ, వికెట్ల కింగ్ బుమ్రా ఎంపికయ్యారు.

**రోహిత్, విరాట్‌కు నో ప్లేస్**

అయితే ఈ జట్టులో టీమ్‌ఇండియా స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి చోటు దక్కలేదు. గతేడాది ఈ ఇద్దరు సీనియర్లు టెస్టుల్లో ఘోరంగా విఫలమయ్యారు. ముఖ్యంగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో అసలు ప్రభావం చూపలేకపోయారు. 10 మ్యాచ్‌లు ఆడిన విరాట్ 417 పరుగులు చేయగా, రోహిత్ 619 రన్స్ చేశాడు.

# రీల్

## యశ్‌కు జోడీగా నయనతార!





'కేజీఎఫ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత కన్నడ స్టార్ హీరో యష్ చేస్తున్న చిత్రం 'టాక్సిక్'. యాశ్ 19గా తెరకెక్కనున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే యష్ బర్త్‌డే పీక్ అంటూ గ్లింప్స్ విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ అందుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాలో కథానాయికగా నయనతార నటిస్తున్నట్లు కన్ఫర్మ్ అయ్యింది. ఈ విషయాన్ని బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ ఒక ఇంటర్వ్యూలో వెల్లడించాడు. అక్షయ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం యష్‌తో టాక్సిక్ సినిమాలో నటిస్తున్నాను. ఈ సినిమాలో నయనతార కూడా ఉంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ నుంచి అంతకంటే ఎక్కువ వివరాలను వెల్లడించలేను. మిగతా సమాచారం అంతా దర్శకురాలు గీతూ మోహన్ దాస్ వెల్లడిస్తుంది అంటూ చెప్పుకొచ్చాడు. దీంతో యష్ సరసన నయన్ నటిస్తుండటంతో వీరిద్దరి కెమిస్ట్రీ ఎలా ఉండబోతుందని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం సమ్మర్ కానుకగా.. ఏప్రిల్ 10న కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

## రవితేజ 'మాస్ జాతర' వచ్చేస్తోంది




మాస్ రాజా రవితేజ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మాస్ జాతర' ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలను క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు భాను భోగవరపు డైరెక్ట్ చేస్తుండగా పక్కా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాలో రవితేజ తన పాత్రతో అభిమానులకు మాస్ జాతర తీసుకురావడం ఖాయమని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ సినిమా నుంచి రవితేజ తన పుట్టినరోజు అయిన జనవరి 26న ఓ సాలిడ్ ట్రీట్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నాడు. జనవరి 26న 'మాస్ జాతర' చిత్రానికి సంబంధించి మాస్ ర్యాంపేజ్ గ్లింప్స్ రిలీజ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ ట్రీట్ అభిమానులకు ఫుల్ మీల్స్ ఇచ్చేలా ఉండబోతుందని ఓ కొత్త పోస్టర్ ద్వారా మేకర్స్ వెల్లడించారు. ఇక ఈ సినిమాలో రవితేజ లుక్ కూడా స్టైలిష్‌గా ఉండనుండటంతో ఈ మూవీపై అంచనాలను పెరుగుతున్నాయి. ఇక ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా భీమ్స్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు. ఇక ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యున్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## 'రానా నాయుడు–2'పై వెంకీ మామ కామెంట్స్!




టాలీవుడ్ మోస్ట్ లవబుల్ సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్ హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రం సంక్రాంతికి వస్తున్నాంతో తన కెరీర్ బిగ్గెస్ట్ గ్రాసింగ్ హిట్ ని కొట్టిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా తర్వాత తన నుంచి మరిన్ని ప్రాజెక్ట్స్ రానుండగా వాటిలో తన అవైటెడ్ వెబ్ సిరీస్ రానా నాయుడు – సీజన్ 2 కూడా ఒకటి. ఈ సిరీస్‌లో రానా దగ్గుబాటి కూడా సాలిడ్ రోల్‌లో కనిపించాడు. అయితే సీజన్ 1 హిట్ అయ్యినప్పటికీ చాలా నెగిటివ్ కామెంట్స్ కూడా వచ్చాయి. అయినప్పటికీ మేకర్స్ సీజన్ 2 అనౌన్స్ చేసి షూటింగ్ కూడా చేయడం జరిగింది. అయితే దీనిపై లేటెస్ట్‌గా వెంకీ మామ కామెంట్స్ వైరల్‌గా మారాయి. రానా నాయుడు సీజన్ 1కి చాలా కంప్లైంట్స్ వచ్చాయని వాటిని సీజన్ 2లో రిపీట్ కాకుండా తాము జాగ్రత్తలు తీసుకుంటున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. ఇక ఈ అవైటెడ్ సిరీస్ ఆల్రెడీ డబ్బింగ్ కంప్లీట్ కాగా నెట్ ఫ్లిక్స్ వారు ఈ మార్చిలో తీసుకొచ్చే సన్నాహాలు చేస్తున్నారు.

## ప్రతి దానిని చివరిదిగా భావిస్తా

**సమంత**



'సిటడెల్: హనీ బన్నీ'లో యాక్షన్ సన్నివేశాలతో ఆకట్టుకున్న సమంత ప్రస్తుతం సెలక్టివ్‌గా సినిమాలు చేస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్లమీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. సవాలుగా అనిపించే వాటినే ఎంపిక చేసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే రాజ్ అండ్ డీకేతో కలిసి వర్క్ చేయడానికి కారణాన్ని వివరించారు. 'సాధారణ సినిమాలు ఎన్నో అంగీకరించొచ్చు. కానీ, నా జీవితంలో ప్రతి దానిని చివరిదిగా భావించే దశలో ఉన్నాను. కచ్చితంగా ప్రేక్షకులపై ప్రభావాన్ని చూపే వాటిని మాత్రమే ఎంపిక చేసుకుంటున్నా. వందశాతం నేను నమ్మకపోతే పాత్రలను చేయలేను. అలాంటి కథలను మాత్రమే అంగీకరిస్తున్నా' అని చెప్పారు. రాజ్ అండ్ డీకేతో కలిసి వర్క్ చేయడానికి కారణాన్ని వివరిస్తూ.. 'వాళ్లు ఎక్కువగా సవాలుగా అనిపించే పాత్రలనే రూపొందిస్తున్నారు. వారితో కలిసి వర్క్ చేయడం నాకెంతో సంతృప్తిగా ఉంటుంది. నటనకు ప్రాధాన్యత ఉండే పాత్రలు ఎక్కువగా రూపొందిస్తున్నారు. గొప్ప సినిమాలో నటించాననే భావన రాకపోతే వర్క్ చేయలేను' అని చెప్పారు.

## ప్రభుత్వానికి ప్రైవేటు పాఠశాలల
# ఫీజు నియంత్రణ నివేదిక

పాఠశాలలను వివిధ కేటగిరీలుగా విభజించిన విద్యా కమిషన్



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రైవేటు పాఠశాలల ఫీజు నియంత్రణపై విస్తృతమై చర్చలు, సమావేశాలను నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్, 'ఫీజు నియంత్రణ ముసాయిదా బిల్లు' ప్రతిని ప్రభుత్వానికి అందజేసింది. కమిషన్ ఛైర్ పర్సన్ ఆకునూరి మురళి,కమిషన్ సభ్యులు, ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు, డాక్టర్ చారకొండ వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డి "ఫీజు నియంత్రణ ముసాయిదా బిల్లు'ప్రతిని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానాకు శుక్రవారం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల ఫీజు నియంత్రణ అంశంలో వివిధ వర్గాలతో విస్తృతమైన చర్చలను, సమావేశాలు నిర్వహించారు. కాగా ఫీజు నియంత్రణకు సంబంధించిన వివిధ అంశాలు ఈ ముసాయిదా బిల్లులో పొందపర్చారు. ఈ ప్రతితో పాటు ప్రేవేట్ పాఠశాలల స్థితిని బట్టి శాస్త్రీయ పద్దతిలో మౌలిక సదుపాయాలు, భూమి, లైబ్రరీ, ల్యాబరేటరీలు, డిజిటల్ సాంకేతికత, టీచర్ల సంఖ్య, స్పోర్ట్స్, గేమ్స్ మొదలైన వాటిని బట్టి వివిధ కేటగేరిలుగా విభజించి, వాటికి సంబంధించిన సమాచారాన్ని కూడా పొందుపరిచారు.

## తెలంగాణ రైజింగ్ బృందం పెట్టుబడుల ద్వారా
# 75 వేల వరకు ఉద్యోగాలు

ప్రజలను మభ్యపెట్టడం, ఆచరణ సాధ్యం కాని హామీలివ్వడమే బిఆర్ఎస్ పని

టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్




ప్రజాపక్షం / హైదరాబాద్: దావోస్ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 50 వేల నుంచి 75 వేల ఉద్యోగాలు లభించే అవకాశముందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ గత పదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమీలేదని, ప్రజలను మభ్యపెట్టడం, ఆచరణ సాధ్యం కాని హామీలు ఇవ్వడమే బిఆర్ఎస్ పని అని మహేష్‌కుమార్ విమర్శించారు. పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ పెద్దగా తెచ్చిన పెట్టుబడులు లేవని, అభివృద్ధి, పెట్టుబడులపై బిఆర్ఎస్ ఒక సారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. దావోస్‌లో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లడం వల్ల పెట్టుబడులపై నమ్మకం కుదిరిందన్నారు. తెలంగాణ పెవిలియన్ రద్దీగా మారిందని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే ప్రతిపక్షాలు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వ పాలన కారణంగా నెలకు ఆరున్నర వేల కోట్ల రూపాయల వడ్డీని కడుతున్నట్లు చెప్పారు. మంచి జరుగుతుంటే ప్రశంసించడం నేర్చుకోవాలని ప్రతిపక్షానికి ఆయన హితవు పలికారు.

# విపక్షసభ్యుల 'సస్పెన్షన్'

(మొదటి పేజీ తరువాయి)

తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానాన్ని కమిటీ ఆమోదించింది. కళ్యాణ్ బెనర్జీ, నదీమ్‌ఉల్‌హఖ్ (తృణమూల్ కాంగ్రెస్) మహమ్మద్ జావేద్, ఇమ్రాన్ మసూద్, సయ్యద్ నసీర్‌హుస్సేన్ (కాంగ్రెస్), ఎ.రాజా, మోహమ్మద్ అబ్దుల్లా (డిఎంకె), అసదుద్దీన్ ఒవైసీ (ఎఐఎంఐఎం), మొహీబుల్లా (సమాజ్‌వాదీ పార్టీ), అరవింద్ సావంత్ (శివసేనయుబిటి) సంస్పెడ్ అయిన సభ్యులలో ఉన్నారు. జమ్ము కశ్మీర్ నుంచి కశ్మీర్ మతాధిపతి మిర్వైజ్ ఉమర్ ఫరూఖ్ నేతృత్వంలో వక్ఫ్ సవరణ బిల్లుపై నియమించిన సంయుక్త కమిటీ ముందు హాజరయ్యేందుకు ప్రతినిధి బృందం వచ్చిన రోజున ముసాయిదా చట్టం గురించి తమ ఆవేదనలను పంచుకున్న రోజే ఈ విపక్ష సభ్యుల ఒకరోజు సస్పెన్షన్ చోటుచేసుకుంది. సమావేశపు ఎజెండాను ఛైర్మన్ జగదాంబికాపాల్ ఇష్టానుసారంగా మారుస్తున్నారని ఆరోపించడంతో కమిటీ సమావేశం గందరగోళం నడుమ ప్రారంభమైంది. కొద్దిసేపు విరామం తర్వాత తిరిగి ప్రారంభమైన కమిటీ సమావేశంలో నిరసనలు, నిందారోపణలు నిరవధికంగా కొనసాగుతున్న నేపథ్యంలో 10మంది విపక్షసభ్యులను సస్పెండ్ చేశారు. 'మా సమావేశం జనవరి 21న జరిగింది. ఆ తర్వాత ఛైర్మన్ జగదాంబికా పాల్ సభ్యులకు తదుపరి సమావేశం జనవరి 24 25తేదీలలో జరుగుతుందని ఛైర్మన్ జగదాంబికాపాల్ సభ్యులకు సమాచారం అందజేశారు. జనవరి30 లేదా 31తేదీలలో నిర్వహించాలని రాజా ఛైర్మన్ జగదాంబికాపాల్‌కు లేఖ రాసినప్పటికీ ఛైర్మన్ మా మాట పట్టించుకోలేదు' అని బెనర్జీ చెప్పారు. శుక్రవారం నాటి సమావేశం ఎజెండా మారిందని గురువారం అర్ధరాత్రి సభ్యులకు తెలియజేశారు. 'ఛైర్మన్ జగదాంబికాపాల్ ఇంటిపని చేసే వారిని చూసినట్లుగా ప్రవర్తిస్తున్నారని, వారి చుట్టూ తిరిగేలా ఆదేశిస్తున్నారు' అని బెనర్జీ చెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై దృష్టిసారించిన ఆయన సమావేశ కార్యకలాపాలను వేగవంతం చేస్తున్నారని ఆరోపించారు. బిజెపి సభ్యురాలు అపరాజితా సారంగి మాట్లాడుతూ విపక్ష సభ్యులు సమావేశ సమయంలో జగదాంబికాపాల్‌పై అనుచిత వ్యాఖ్యలు ఉపయోగిస్తూ నిరవధికంగా గలాభా సృష్టిస్తున్నారని తెలిపారు. కాగా కమిటీ జనవరి 29న తన తుది నివేదికను అడాప్ట్ చేసుకుంటుందని అధికారవర్గాలు తెలియజేశాయి. వక్ఫ్ ఆస్తులను మేనేజింగ్ చేయడంలో, నిర్వహణలో పెటు సవాళ్లను పరిష్కరించడానికి 1995 వక్ఫ్ చట్టం సవరించడమే బిల్లు ఉద్దేశం. కమిటీ ముందు హాజరుకావడానికి ముందు మిర్వైజ్ విలేకరులతో మాట్లాడుతూ తాను ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానన్నారు. మతపరమైన విషయాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదనే విషయానికి ప్రాధాన్యత ఇస్తున్నానని ఆయన కోరారు. 'వక్ఫ్ సమస్య ప్రత్యేకించి జమ్ముకశ్మీర్ ప్రజలకు ముఖ్యంగా ముస్లిం మైనార్టీలకు సంబంధించినదని మిర్వైజ్ అన్నారు. దీనికి సంబంధించి ప్రతీ అంశంపై లోతుగా అధ్యయనం చేసి వివరణాత్మక విజ్ఞాపనపత్రాన్ని సిద్ధం చేస్తాం. వక్ఫ్ అంశాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదని మేం కోరుతున్నాం' అని మిర్వైజ్ సూచించారు. దీనికి ముందు మిర్వైజ్ జగదాంబికాపాల్‌ను అతడి నివాసంలో కలువాలని నిర్ణయించుకున్నారు.

# సిఐడికి అప్పగింత

(మొదటి పేజీ తరువాయి)

సర్జరీలు జరిగాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వైద్యుల కమిటీ ఇచ్చిన ప్రాథమిక నివేదికను ఆయన పరిశీలించారు. కిడ్నీ అక్రమ మార్పిడితో తెలంగాణ రాష్ట్రంతో తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన వ్యక్తులకు ఈ అక్రమ వ్యవహారంతో సంబంధం ఉందని, అమాయకులు, అత్యంత నిరుపేదల ఆర్థిక దుస్థితిని ఆసరాగా తీసుకుని, వారిని మభ్యపెట్టి కిడ్నీల డొనేషన్‌లకు ఒప్పిస్తున్నారని వారు చెప్పారు. అలకనంద హాస్పిటల్‌లో తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళల నుంచి కిడ్నీలు తీసుకుని, కర్నాటకకు చెందిన వారికి అమర్చారని అధికారులు మంత్రికి వివరించారు. అలకనంద హాస్పిటల్‌ను సీజ్ చేశామని, యజమానిని పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలను సహించేది లేదని, ఈ వ్యవహారాన్ని చాలా సీరియస్‌గా పరిగణిస్తున్నామన్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్నవారిని కఠినంగా శిక్షించాలని, ఇందుకు అవసరమైన అన్ని ఆధారాలను సేకరించాలని ఆదేశించారు. పూర్తిస్థాయి విచారణ నిమిత్తం ఈ కేసును సిఐడికి అప్పగించాలని, దీనికి సంబంధించిన ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తును మంత్రి సూచించారు. ఆర్గన్స్ అక్రమ మార్పిడిల విషయంలో ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ల పాత్ర ఉన్నట్టు గతంలో వచ్చిన ఆరోపణలను మంత్రి గుర్తు చేశారు. ఈ దిశగా కూడా విచారణ చేపట్టాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో జరుగుతున్న శస్త్ర చికిత్సలపై నిఘా పెట్టాలన్నారు. గర్భిణుల వివరాలను నమోదు చేస్తున్నట్టుగానే, ఇతర సర్జరీలకు సంబంధించిన వివరాలను నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.హాస్పిటల్స్‌కు అనుమతులు ఇచ్చే సమయంలో రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసే క్రమంలో అన్ని వివరాలనూ పూర్తి స్థాయిలో పరిశీలించాలని తెలిపారు. అనుమతుల జారీ చేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రైవేటు హాస్పిటల్స్‌లో జరుగుతున్న ఆర్గాన్ మార్పిడిల విషయంలో ఆడిట్ నిర్వహించాలని గతంలోనే మంత్రి ఆదేశాలు జారీ చేశారు.






# అంతంచేసే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

మంచినీళ్లు వచ్చేంత వరకు మీ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. మీకు పట్టాలు ఇచ్చే వరకు ఎర్రజెండా మీకు అండగా ఉంటుందని అన్నారు. పేదల పక్షాన అసెంబ్లీలో గళమెత్తుతానని అన్నారు. రాష్ట్రంలో భూ పోరాటం ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల కుటుంబాలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని వారందరికీ పట్టాలు ఇచ్చే అంతవరకు సిపిఐ అండగా ఉంటుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని అందువల్లనే ప్రజలు మార్పు కోరుకున్నారని, ఈ మార్పు కాంగ్రెస్ కు ఇంకా సరిపోదని ఇంకా మారవలసిన అవసరం ఉందని ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలన్నారు. ఎర్ర చెరువులో గుడిసెలు వేసుకున్న గుడిసె వాసులందరికీ పట్టాలు ఇచ్చేవరకు పోరాటం ఆగదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. రెండు సంవత్సరాల క్రితం ఇక్కడే ఇదే సభలో చెప్పిన రీతిగా కాలనీలో మంచినీటి సౌకర్యం కోసం బోర్లు వేయడం జరిగిందని మీ అందరికీ పట్టాలు ఇచ్చేవరకు ఎర్రజెండా పార్టీ అండగా ఉంటుందని అన్నారు. సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, పనాసా ప్రసాద్ మామిడాల సమ్మిరెడ్డి, పైళ్ల శాంతి కుమార్, సొత్తుకు ప్రవీణ్ కుమార్, క్యాతగరాజు సతీష్, కొరిమి సుగుణ, సిపిఐ కౌన్సిలర్ నూకల భూలక్ష్మి చంద్రమౌళి, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, తోట రామచందర్, జి.శ్రీనివాస్ ఆసిఫ్ పాషా, తాళ్ల పోషం భగత్ సింగ్ కాలనీవాసులు సుమారు 1500 మంది పాల్గొన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com